ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

ప్రకాశం

శనివారం 6, జనవరి 2024



అశేష జనవాహిని సమక్షంలో టీడీపీ ఎన్నికల సమరశంఖారావాన్ని పూరించింది. కనిగిరిలో ఆపార్టీ అధినేత చంద్రబాబునాయుడు అందుకు శ్రీకారం పలికారు. రాష్ట్రంలో రాబోయే సార్వత్రిక ఎన్నికల సన్నాహంలో భాగంగా రా.. కదలిరా.. అంటూ లోక్‌సభ నియోజకవర్గాల వారీ సభలు నిర్వహించాలని టీడీపీ నిర్ణయించింది. ఆ కార్యక్రమం ప్రారంభ సూచికగా ఒంగోలు పార్లమెంటు పరిధిలోని కనిగిరి నియోజకవర్గంలో శుక్రవారం భేరీ మోగించింది. సభకు టీడీపీ, జనసేన కార్యకర్తలతో పాటు సాధారణ ప్రజానీకం తండోపతండాలుగా తరలివచ్చారు. ఎక్కడికక్కడ పోలీసులు ఆంక్షలు విధించడంతో సభాస్థలికి దూరంగా చాలా మంది ఆగిపోవాల్సి వచ్చినప్పటికీ.. అప్పటికే సభాప్రాంగణం కిటకిటలాడింది. చివర్లో వచ్చిన కొన్ని నియోజకవర్గాల ప్రజల వాహనాలు కనిగిరిలోకి ప్రవేశించే అవకాశం లేక వెనుదిరిగి వెళ్లిపోవడం కనిపించింది. మొత్తంమీద సభ సూపర్ సక్సెస్ అయ్యింది.

అభిమాని బహూకరించిన గొర్రెపిల్లతో బాబు



ఐదుగ్యారెంటీలను చంద్రబాబుకు వివరిస్తున్న ఉగ్ర

కనిగిరి సభ సక్సెస్

పోలీసుల అడ్డంకులను అధిగమించి పరుగులు తీసిన ప్రజలు

ప్రాంగణంలో ఎంతమందో.. బయట అంతమంది

అధికార పక్ష నేతలపై చంద్రబాబు వ్యంగ్యోక్తులు.. విమర్శలు



బాబుతో ఎమ్మెల్యే స్వామి, జనార్దన్, ఏలూరి



కనిగిరి సభలో మాట్లాడుతున్న చంద్రబాబు, హాజరైన అశేషప్రజానీకం

టీడీపీ సమరశంఖం



నే విజిలేస్తే...

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

టీడీపీ కనిగిరిలో నిర్వహించిన రా.. కదలిరా.. సభ సూపర్ సక్సెస్ అయ్యింది. ఒంగోలు లోక్‌సభ స్థాయిలో నిర్వహించిన సభకు తెలుగుదేశం, జనసేన పార్టీల ముఖ్యనేతలంతా హాజరయ్యారు. ముమ్మరమైన వ్యవసాయ పనులున్నా, ఊరూరా ప్రత్యేక వాహనాలు పంపకపోయినా రెండుపార్టీల ముఖ్య కార్యకర్తలతోపాటు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఆయా అసెంబ్లీ సెగ్మెంట్‌ల నుంచి టీడీపీ కార్యకర్తలు హాజరుకావాలని ప్రచారం చేశారు. సభ నిర్వహిస్తున్న కనిగిరి నియోజకవర్గం నుంచి స్వచ్ఛందంగా తరలిరావాలని డాక్టరు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు విస్తృత ప్రచారం చేశారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నా జనాలు సభకు హాజరయ్యారు. సభా ప్రాంగణంలో ఉన్నవారిని, ట్రాఫిక్‌లో చిక్కుకుని సుదూరంగా ఆగిపోయిన వారిని, పట్టణంలోకి ప్రవేశించే అవకాశం లేక వెనక్కివెళ్లేవారిని కలుపుకుంటే లక్షా 25వేల మంది వరకు వచ్చి ఉంటారని అంచనా. చంద్రబాబు సకాలంలో ప్రాంగణానికి చేరుకున్నారు. 5 గంటల 6 నిమిషాలకు వేదికమీదకు వచ్చారు. తెలుగుదేశం, జనసేన జిల్లా అధ్యక్షులు బాలాజీ, రియాజ్, కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర ప్రధానంగా మాట్లాడారు. ఆపార్టీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, బాపట్ల పార్లమెంటు అధ్యక్షుడు ఏలూరి సాంబశివరావు చివర్లో ప్రసంగించారు. 5 గంటల 36 నిమిషాలకు చంద్రబాబు సమరశంఖం మోగించి 5.40 గంటల నుంచి ప్రసంగాన్ని ప్రారంభించారు.

ఆరు గంటల సమయంలో సభాప్రాంగణంలో లక్షమందికి పైగా కనిపించారు. 7 గంటల సమయంలో ఆవరణ నుంచి వెళ్లిపోయేవారు అప్పటికీ సభకు వచ్చేవారు ఎదురుపడటంతో కనిగిరి-వెలిగండ్ల రోడ్డు మార్గంలో ప్రజలు తీవ్ర ఒత్తిడికి గురికాక తప్పలేదు. సభ ప్రారంభ సమయంలో సుమారు 40వేల మంది పాల్గొనగా బయటప్రాంతంలో మరో 20వేల మందికి పైగా ఆగిపోయారని పోలీసు గూఢచార శాఖ ప్రభుత్వానికి తెలియజేయడం విశేషం. వాస్తవంగా వారి అంచనాకు రెండింతల జనం రావటమనేది సత్యం. కార్యక్రమం వద్ద డాక్టరు ఉగ్ర దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి మధ్యాహ్నం, రాత్రికి కలిసి సుమారు 70వేల మందికి భోజన ఏర్పాట్లు చేశారు. సభ అనంతరం ఆ ప్రాంతమంతా కిటకిటలాడింది. టీడీపీ నేతలు మాత్రం పూర్తి ఆనందంతో సభ విజయవంతమైందని, 2 లక్షలకు పైగా ప్రజలు వచ్చారని ప్రకటించారు. సభలో కనిగిరి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, ఒంగోలు లోక్‌సభ టీడీపీ పరిశీలకులు రాంగోపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఒంగోలు, బాపట్ల అధ్యక్షులు నూకసాని బాలాజీ, ఏలూరి సాంబశివరావు, ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, స్వామి, మాజీ ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, పోతుల రామారావు, అశోక్‌రెడ్డి, నారాయణరెడ్డి, విజయకుమార్, పాపారావు, ఆ పార్టీ ఇన్‌చార్జిలు ఎంఎం కొండయ్య, ఇంటూరి నాగేశ్వరరావు, ఇతర నాయకులు దామచర్ల సత్య, ఇంటూరి రాజేష్, డాక్టర్ మన్నె రవీంద్ర, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్, ఆపార్టీ దర్శి నాయకుడు గరికపాటి వెంకట్, చీరాల ఇన్‌చార్జి ఆమంచి స్వాములు, ఇమ్మడి కాశీనాథ్ పాల్గొన్నారు.



సభకు జేజేలు కొడుతూ నడుచుకుని వస్తున్న అభిమానులు

వారికి అభినందనలు.. వీరిపై ఆరోపణలు

- కనిగిరి సభలో చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు
- రాజకీయ సమీకరణల మార్పునకు సంకేతమా?

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

అధికార వైసీపీలో టికెట్ల లొల్లి తీవ్రమై రోజుకోవిధంగా రాజకీయ పరిణామాలు మారుతున్న తరుణంలో టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు సంచలనమయ్యాయి. శుక్రవారం సాయంత్రం కనిగిరి సభలో చంద్రబాబు చేసిన ఉపన్యాసంలో 'నన్ను, పవన్ కల్యాణ్‌ను, లోకేష్‌ను తిట్టాలంట. అలా తిట్టిన వారికే ఎంపీ, ఎమ్మెల్యేల సీట్లు ఇస్తారంట. సమాజంలో సేవ చేసేవారికి సీటు ఇవ్వాలనుకోవడం సంస్కారం. ఇలా తిట్టినవారికి సీటు ఇవ్వాలనుకోవడం కుసంస్కారం. జగన్ షరతుకు అంగీకరించని ఈ జిల్లాకే చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు సంస్కారవంతులు. వారిని నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా.. మీరూ అభినందించాల్సిన అవసరం ఉంది' అని సభికులనుద్దేశించి సూచన చేశారు. దానికి ప్రజల నుంచి హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. ఇటీవల ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డిలకు జగన్ ఇలాంటి షరతు పెట్టడం, వారు తిరస్కరించడం తెలిసిందే. ఈనేపథ్యంలో మాగుంట చంద్రబాబుకు టచ్‌లోకి వెళ్లారని తదనంతరం బాలినేనితో కూడా చర్చలు జరుపుతున్నారని ప్రచారం జరుగుతోంది. మహీధర్‌రెడ్డి కూడా మాగుంటకు టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చంద్రబాబు వారిని అభినందించడంతో రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి.

మంత్రి సురేష్, ముగ్గురు ఎమ్మెల్యేలపై విమర్శలు

ఒంగోలు లోక్‌సభ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలు అంటూ చంద్రబాబు కొన్ని వ్యాఖ్యానాలు చేశారు. తొలుత ఆయన కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ గురించి మాట్లాడుతూ ఎమ్మెల్యే బుర్రా పెద్ద అవినీతిపరుడు. ఆయన పేరు మనీ సూదన్ అని విమర్శించారు. ఆయనకు అన్నింట్లో వాటా, డీపీడీల్లోనూ వాటా అంటూ కామెంట్ చేశారు. ఎర్రగొండపాలెంలో మంత్రి సురేష్‌ను ఉద్దేశించి.. 'ఆయన దుస్తులిప్పి తిరిగేవాడు. ఆయన్ను ట్రాన్స్‌ఫర్ చేసి కొండపికి పంపారు. ఎర్రగొండపాలెంలో పనికిరాని చెత్త కొండపిలో బంగారం అవుతుందా' అంటూ విమర్శనాస్త్రాలు సంధించారు. మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి గురించి మాట్లాడుతూ ఆయనో నయాం, ఆయన తమ్ముడో చోటా నయాం అని వ్యాఖ్యానిస్తూ ఈ మాటలు నియోజకవర్గంలో అందరూ అంటున్నారని వ్యాఖ్యానించారు. దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ గురించి మాట్లాడుతూ 'ఆయనకు అన్నిట్లో పర్సంటేజీలే. కుటుంబసభ్యులతో కలిసి వాటాలు తీసుకుంటారు. ఆదోరకం అవినీతి. చివరికి ఆయనకు జగన్ సీటే లేదు పొమ్మన్నాడు' అని వ్యాఖ్యానించారు. కొండపిలో ఒక అనామకుడికి తొలుత పదవి ఇచ్చాడని తాజా మాజీ వైసీపీ ఇన్‌చార్జి అశోక్‌బాబు గురించి వ్యాఖ్యానించి ఆయన్ను అడ్రస్ లేకుండా ఎక్కడికో పంపాడని చమత్కరించారు. చివర్లో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి గురించి మాట్లాడుతూ.. జగన్ ఆయనకు అడ్రస్ లేకుండానే చేశాడంటూ ఒకే ఒక్క కామెంట్‌తో వదిలేశారు. అలాగే గిద్దలూరు ఎమ్మెల్యే 'నేను పోటీచేయను. నావల్ల కాదని పారిపోయాడు. అందుకు కారణం జగనే కదా' అని అన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో చంద్రబాబు నిండుసభలో చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయవర్గాలలో పలు అనుమానాలను రేకెత్తించాయి. ఏ దృష్టితో ఆయన ఇలా మాట్లాడినప్పటికీ మాగుంట, బాలినేని, మహీధరరెడ్డి టీడీపీ వైపు చూస్తున్నారా? అన్న సందేహాలను రాజకీయ విశ్లేషకులు వ్యక్తంచేస్తున్నారు.



హైటెక్‌సిటీ 25 ఏళ్ల జ్ఞాపకం

జిల్లా అభివృద్ధి బాధ్యత నాదే!



- అధికారంలోకి వచ్చేది మేమే..
- తొలి ఏడాదిలోనే వెలిగొండ పూర్తి
- మార్కాపురం కేంద్రంగా జిల్లా
- కందుకూరును ఒంగోలులో చేరుస్తా
- ఉగ్ర చెప్పిన ఐదు గ్యారెంటీలను నెరవేరుస్తా
- కనిగిరి సభలో చంద్రబాబు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

'రాష్ట్రంలో వైసీపీ ఓటమి చెందడం.. టీడీపీ, జనసేనల ప్రభుత్వం ఏర్పడటం ఖాయం. రానున్న వంద రోజుల్లో జరగబోయేది ఇదే. ఆ తర్వాత జిల్లా అభివృద్ధి బాధ్యతను టీడీపీ తీసుకుంటుంది' అని ఆ పార్టీ అధినేత చంద్రబాబు చెప్పారు. తొలి ఏడాదిలోనే వెలిగొండతోపాటు ముఖ్యమైన ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి తన దృష్టికి తెచ్చిన ఐదు సమస్యలను పరిష్కరించి కనిగిరికి బంగారు భవిష్యత్‌ను అందిస్తానని ప్రకటించారు. రా.. కదలిరా.. అంటూ చేపట్టిన కార్యక్రమంలో భాగంగా కనిగిరి సభలో చంద్రబాబు మాట్లాడారు. అనంతరం వేదికపై జిల్లా నాయకులతో కలిసి భేరీని మోగించి ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి తానే శ్రీకారం పలికానని, పదిశాతం మినహా మిగిలిన పనులు పూర్తిచేశానని చెప్పారు. తిరిగి టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే ఆ పనులు పూర్తయి ఇప్పటికే పశ్చిమప్రాంతం సస్యశ్యామలమయ్యేదన్నారు. ఇప్పుడు చెప్తున్నా.. తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే దాన్ని పూర్తిచేసి సాగు, తాగునీరు అందిస్తానని స్పష్టం చేశారు. 'జిల్లాలో గుండ్లకమ్మ, కొరిశపాడు ఎత్తిపోతల పథకం, గుంటూరు చానల్ పొడిగించి పర్చూరు వరకు గోదావరి నీరు ఇవ్వడం, సాగర్ కుడి కాలువకు గోదావరి నీరు మళ్లించడం వంటి వాటిని పూర్తి చేస్తా. జిల్లా వాసులకు నీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తా' అని హామీ ఇచ్చారు. వెలిగొండ కుడికాలువతో ముసి, పాలేరు నదులను అనుసంధానం చేస్తామని చెప్పారు. మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేస్తామన్న చంద్రబాబు ఆ విషయంలో ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దన్నారు. ఒంగోలు జిల్లా కూడా ఉంటుంది అందులో కందుకూరును చేరుస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఒంగోలు, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు తదితర ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తానని చెప్పారు. కందుకూరులో తాను చేపట్టిన హార్టీకల్చర్ కళాశాలను కూడా ఈ ప్రభుత్వం ఆపేసింది. దాన్నికూడా మన ప్రభుత్వం రాగానే పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు.

కనిగిరికి ప్రత్యేక వరాలు

తొలుత ఇన్‌చార్జి డాక్టరు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధించి తాను చేపట్టిన ఐదు గ్యారెంటీలను ప్రస్తావిస్తూ వాటి సాధన ద్వారా దుర్భిక్షాన్ని తరిమికొట్టేందుకు సహకరించాలని కోరారు. వాటిని చంద్రబాబు తన ప్రసంగంలోకి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ 'కనిగిరి నియోజకవర్గంలో ఉన్న ప్రజలు ఆర్థికంగా వెనుకబడిపోతుంటే ఇక్కడి నుంచి ఎక్కడికో వెళ్లినవారు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. దానికి కారణం ఇక్కడ అవసరమైన వసతులు లేకపోవటమే. మా ప్రభుత్వం రాగానే ఆ పరిస్థితిని నివారిస్తా. మీ ప్రాంత ప్రజల కోసం నిత్యం పరితపించే డాక్టర్ ఉగ్ర సూచించిన విధంగా వెలిగొండను పూర్తిచేసి మీ నియోజకవర్గానికి ఉపయోగపడేటట్లు చేస్తా. గతంలో నేను శంకుస్థాపన చేసి ఈ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిన ట్రిపుల్ ఐటీని కనిగిరిలోనే ఏర్పాటు చేస్తా. అప్పట్లో కేంద్రంతో మాట్లాడి తాము ఈ ప్రాంతానికి తీసుకొచ్చిన నిమ్జ్‌కు తిరిగి కేంద్రం ద్వారా డబ్బులు తెచ్చి పారిశ్రామిక అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తా. నడికుడి-శ్రీకాళహస్తి రైలుమార్గాన్ని వారు పూర్తిచేయలేకపోవడం బాధాకరం. మా ప్రభుత్వం రాగానే ఆ పనులు వేగంగా జరిగి మీప్రాంతం మీదుగా రైళ్లు నడిచేలా చర్యలు తీసుకుంటా. ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా రక్షిత తాగునీటిని అందించి ఫ్లోరోసిస్ పీడ నుంచి వముక్తి కల్పిస్తా' అని చంద్రబాబు హామీ ఇచ్చారు.



బాబును ఒక్కసారిగా చూడగానే మహిళల కేరింతలు

కరోనా కలవరం



- జిల్లాలో మూడు పాజిటివ్ కేసులు
- ఒంగోలు, మద్దిపాడు, కంభాలపాడుల్లో నమోదు

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 5 : కరోనా కలవరం మళ్లీ మొదలైంది. జిల్లాలో శుక్రవారం మూడు పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఒంగోలు దేవుడు చెరువుకు చెందిన ఒక యువకుడికి, మండల కేంద్రమైన మద్దిపాడుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు, పొదిలి మండలం ఉప్పలపాడు పీహెచ్‌సీ పరిధిలోని కంభాలపాడుకు చెందిన మరొకరికి వైరస్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. దేవుడు చెరువుకు చెందిన యువకుడు ప్రస్తుతం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. మద్దిపాడుకు చెందిన వ్యక్తి హోం ఐసోలేషన్‌లో ఉన్నారు. వీరిద్దరికీ ఒంగోలు జీజీహెచ్‌లో గురువారం పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ ఫలితం వచ్చింది. రెండు నమూనాలను జినోమ్ ల్యాబ్‌కు పంపుతున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్, ఆర్‌ఎంవో డాక్టర్ తిరుమలరావు తెలిపారు. కంభాలపాడుకు చెందిన వ్యక్తి విజయవాడలో పరీక్ష చేయించుకోగా వైరస్ ఉన్నట్లు తేలింది. ఈమేరకు అక్కడి నుంచి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం అందింది.

మాగుంట, బాలినేని ప్రత్యేక భేటీ



హైదరాబాద్‌లో బాలినేని, మాగుంటతో మేయర్, కార్పొరేటర్లు, నేతలు

- ఒంగోలుకు వేణుగోపాల్ పేరు పరిశీలన
- సీఎంతో ఎమ్మెల్యేలు అన్నా, మద్దిశెట్టి భేటీ

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి హైదరాబాద్‌లో ఏకాంతంగా భేటీ కావడం వైసీపీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గురువారం ఢిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చిన మాగుంట ఆ రోజు సాయంత్రమే బాలినేనిని కలిశారు. శుక్రవారం మధ్యాహ్నం మళ్లీ బాలినేని నివాసానికి వెళ్లి సమాలోచనలు చేశారు. మాగుంట వెంట అన్నింటా ఆయన ఆలోచనల్లో పాలుపంచుకునే గోపాల్‌రెడ్డి ఉన్నారు. సీఎం జగన్ మాగుంటకు లోక్‌సభ టికెట్ లేదని చెప్పడం, టీడీపీ అధినేత చంద్రబాబుతో మాగుంట టచ్‌లోకి వెళ్లారని వార్తలు వస్తున్నాయి. అదేసమయంలో పార్టీలో తగిన ప్రాధాన్యత లేదని, తనను కనీసం పిలవకుండానే జిల్లాలో అభ్యర్థుల ఎంపికను పూర్తి చేస్తున్నారన్న వ్యథతో బాలినేని ఉన్నారు. ఆయన ఎక్కడి నుంచి పోటీ చేయాలన్న విషయంపై సీఎం ఇంత వరకూ స్పష్టత ఇవ్వలేదు. ఈనేపథ్యంలో బాలినేని, మాగుంట వెంటవెంటనే రెండుసార్లు భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. పార్టీ మారే విషయమై ఇద్దరూ చర్చించుకున్నట్లు భావిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం వీరిద్దరూ ఉన్న సమయంలోనే బాలినేని ఇంటికి ఒంగోలు నగరానికి చెందిన వైసీపీ ముఖ్యనేతలు వెళ్లారు. వారితో మాట్లాడే సందర్భంలో మాగుంట.. నేను, బాలినేని ఒకే పార్టీ నుంచి పోటీ చేస్తాం అని వ్యాఖ్యానించడం విశేషం. ఆ తర్వాత బాలినేని తన సన్నిహితులతో నేను ఒంగోలు నుంచే బరిలోకి దిగుతున్నానని గట్టిగా చెప్పినట్లు తెలుస్తోంది.

దర్శి, గిద్దలూరు ఎమ్మెల్యేలు వేణుగోపాల్, రాంబాబు శుక్రవారం వేర్వేరుగా తాడేపల్లిలో సీఎం జగన్‌ను కలిశారు. మద్దిశెట్టికి దర్శి నుంచి పోటీ చేసే అవకాశం లేదని తేల్చిచెప్పిన జగన్ ప్రత్యామ్నాయంగా అవకాశం ఇస్తే ఒంగోలు లోక్‌సభ లేక అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తారా? అని అడిగినట్లు తెలిసింది. ఒంగోలు అసెంబ్లీ స్థానం నుంచి శిద్దా కుమారుడు సుధీర్ నుంచి స్పష్టత రాకపోవడంతో ఆ విషయాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. ఎంపీగా పోటీ చేయాల్సి వస్తే సిద్ధంగా ఉండాలని, రెండు మూడు రోజుల్లో స్పష్టత ఇస్తామని చెప్పినట్లు తెలిసింది. అనంతరం కలిసిన అన్నా రాంబాబును పోటీకి దూరంగా ఉంటానని ప్రకటించడంలోని ఆంతర్యం ఏమిటని జగన్ ప్రశ్నించినట్లు తెలిసింది. రాంబాబు బదులిస్తూ 'మిమ్మల్ని కలిసేందుకు ప్రయత్నించాను. నాకు అవకాశం దక్కలేదు. అందుకే నేరుగా ప్రకటించానని' చెప్పినట్లు తెలిసింది. అనంతరం రాంబాబుకు జగన్ ఏమి సమాధానం చెప్పకుండానే మళ్లీ కలుద్దామని చెప్పి పంపినట్లు సమాచారం. మాగుంటపై విమర్శలు చేయడం ద్వారా రాంబాబు ముఖ్యమంత్రి వద్ద మంచి మార్కులు పొందారని, ప్రత్యామ్నాయ అవకాశం కూడా కల్పించవచ్చని ఆపార్టీ నాయకుల్లోని కొందరి అంచనా. కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి సీఎం విధించిన షరతులను తీవ్రంగా వ్యతిరేకించిన నేపథ్యంలో శుక్రవారం ఉదయం విజయసాయిరెడ్డి ఫోన్‌లో మహీధర్‌రెడ్డితో మాట్లాడారు. ఇంకోవైపు మాగుంటకు మహీధర్‌రెడ్డి కూడా టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

రెండు వారాలైనా పట్టించుకోలేదు!

• ఎమ్మెల్యే ఇంటికెళ్లే దారిలో తాగునీరు రోడ్డుపాలు


వృథాగా పోతున్న మంచినీరు

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 5 : ఒంగోలు నగరంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. ఏ రోజు వస్తాయో.. ఎన్నిగంటలకు ఇస్తారో తెలియదు. అయితే అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిరక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. అందుకు పలు ప్రాంతాల్లో విచ్చలవిడిగా ఏర్పడిన తాగునీటి పైపులైను లీకులుచూస్తే అర్థమవుతోంది. ప్రధానంగా స్థానిక లాయరుపేటలోని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఇంటికెళ్ళే వీఐపీరోడ్‌లోని పద్మాలయ బేకరి వద్ద పదిహేను రోజుల క్రితం తాగునీటి పైపులైను లీకు ఏర్పడింది. అయితే ఇంతవరకు పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. ముఖ్యంగా లీకు ఏర్పడిన ప్రాంతం నాలుగు రోడ్ల జంక్షన్ కావడంతో నిరంతరం వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కాగా తాగునీరు వృథాగా రోడ్డుపాలు కావడంతోపాటు ఇబ్బందిగా మారింది. కనీసం కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చే స్తున్నారు. లీకులకు మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రేపు సుదర్శన లక్ష్మీనారసింహ యజ్ఞం


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(కల్చరల్),జనవరి 5: ఒంగోలు నగరం కోర్టుసెంటర్‌లోని గడియారం వారి వీధిలో బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలోని శ్రీఅనంత కోదండరామస్వామి దేవస్థానంలో ధనుర్మాసం సందర్భంగా ఆదివారం శ్రీసుదర్శన లక్ష్మీనారసింహ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త గడియారం సుబ్బయ్యశర్మ తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 13 ఏళ్లుగా ఈ యజ్ఞం నిర్వహిస్తున్నామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ సలహాదారు కళ్యాణపురం రాజేష్‌కుమార్ భట్టార్ బృందం యాజ్ఞికంలో జరిగే ఈ యజ్ఞంలో భక్తులు తమ గోత్రనామాలతో పాల్గొనే అవకాశం కల్పించామన్నారు. బ్రాహ్మణ సేవాసమితి ఉపాధ్యక్షులు మహంకాళి వెంకటశేషయ్య మాట్లాడుతూ సుమారు వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ దేవస్థానంలో జరిగే ఈ యజ్ఞంలో ప్రజలందరూ పాల్గొనాలని, అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసమితి కార్యవర్గ సభ్యులు షైనంపాటి సాయికుమార్, ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవటం కనీస ధర్మం


స్టాలిన్ దంపతులను సన్మానిస్తున్న కళాకారులు

ఒంగోలు(కల్చరల్), జనవరి 5: కళాకారులు సమాజహితం, ప్రజల ఆనందం కోసం పనిచేస్తారని అటువంటి వారికి కష్టం వచ్చినప్పుడు అండగా నిలబడి ఆదుకోవటం ప్రతి ఒక్కరి కనీస ధర్మమని వాణిజ్య పన్నులశాఖ విశ్రాంత డిప్యూటీ కమిషనర్ ఆర్.సదానందరావు పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ గాయకులు స్టాలిన్ సహాయార్థం మయూరి ఆర్కెస్ట్రా, ఒంగోలు కళాకారుల ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్థానిక సీవీఎన్ రీడింగ్ రూములో సంగీత విభావరి జరిగింది. ముందుగా ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గాయకులు అప్పిశెట్టి రత్తయ్య, మయూరి ఆర్కెస్ట్రా అధినేత బి.జెర్మియా ఆధ్వర్యంలో స్టాలిన్ దంపతులను ఘనంగా సత్కరించి వారికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రత్తయ్య మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా రెండు తెలుగు రాష్ట్రాలలో ఎన్నో వేల పాటలు పాడి అలరించిన గొప్ప గాయకులు స్టాలిన్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో దాతల సహకారంతో ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మల్లిఖార్జునరావు, రాఘవులు, జి.గురవారెడ్డి, వెన్నూరి నాగేశ్వరరావు, అనంతలక్ష్మి, ఐనంపూడి నరసింహారావు, కె.విజయ్, డి.రాజేష్, కె.పూర్ణిమ పాల్గొన్నారు.

బొడ్డువారిపాలెంలో ఆరోగ్య సేవలు

సంతనూతలపాడు, జనవరి 5: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు రక్ష అని డీటీసీవో డాక్టర్ సురేష్ పేర్కొన్నారు. బొడ్డువారిపాలెం గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్యసురక్ష-2 కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు డేవిడ్, సుష్మ 183 మంది రోగులను పరీక్షించి మందులను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ డి.రమణమ్మ, సర్పంచ్‌లు టి.వెంకటరెడ్డి, రామారావు, వైసీపీ మండల కన్వీనర్ డి.చెంచిరెడ్డి, వేములపాడు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపట్నం మండలంలో వరుస చోరీలు

• కేసులు నమోదు చేయని పోలీసులు
• ఫిర్యాదులు అందినా పట్టించుకోని వైనం

కొత్తపట్నం(ఒంగోలునగరం)జనవరి 5 : దొంగల పట్ల కొత్తపట్నం పోలీసులు ఉదాశీన వైఖరిని ఆవలంభిస్తున్నారు. రూ.లక్షల విలువైన వస్తువులు చోరీకి గురవుతున్నా..నష్టపోయిన వారు ఫిర్యాదు చేస్తున్నా పోలీసుల్లో ఏ మాత్రం చలనం ఉండటం లేదు. అపహరణకు గురైన తమ వస్తువులు ఎక్కడ ఉన్నాయో కనుక్కొని ఫిర్యాదుదారులు చెబుతున్నా విచారణ చేసి దొంగలను చట్టపరిధిలో శిక్షించేందుకు పోలీసులు ముందుకు రావటం లేదు. దీంతో కొత్తపట్నం మండలంలో పలు గ్రామాల్లో దొంగతనాలు పెచ్చుమీరిపోయి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. నాలుగు నెలల క్రితం కొత్తపట్నం -ఈతముక్కల రోడ్డులో కొత్తపట్నానికి దగ్గర్లో శాంతి ఇండేన్ గ్యాస్ కంపెనీకి సమీపంలోని పొలంలో రూ.2 లక్షల విలువైన పైపులు, స్పేయర్లు దొంగలు ఎత్తుకుపోయారు. సాగులో ఉన్న ఉన్న పొలానికి నీరు పెట్టేందుకు ఏర్పాటు చేసుకున్న పైపులు చోరీకి గురయ్యాయి. బాధితుడు రామచంద్రరావు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంత వరకు కేసు నమోదు కాలేదు. ఇదే పొలంలో ఉంచిన ట్రాక్టర్‌ను రెండు రోజుల క్రితం దుండగులు తస్కరించారు. దీనిపై కూడా కొత్తపట్నం పోలీసులకు ఫిర్యాదు అందింది. అయినా పోలీసులు ఏ మాత్రం స్పందించటం లేదు. కాగా బాధితుడు రామచంద్రరావు తమ పొలంలో చోరీకి గురైన వస్తువులు ఎక్కడ ఉన్నాయో.. ఎవరు తీశారనే అనుమానం ఉన్న వ్యక్తుల గురించి కూడా పోలీసులకు తెలియజేశారు. అయితే పోలీసుల్లో ఏ మాత్రం చలనడం ఉండటం లేదు. అనుమానితులను విచారణ జరపాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. బాధితుడు ఫిర్యాదులు చేసి ఎన్నిసార్లు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతూ న్యాయం చేయాలంటూ అడుగుతున్నా పోలీసుల్లో స్పందన అంతంతమాత్రంగానే ఉంటోంది. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మండలంలో తరచూ జరుగుతున్న చోరీలపై దృష్టి సారించి బాధితులకు న్యాయం చేయాలని ప్రజ లు కోరుతున్నారు.

దేశ సంపదను దోచిపెడుతున్న మోదీ, షాలు

12న విజయవాడలో రాజ్యాంగ హక్కుల వేదిక ఆవిర్భావ సభ • సంయుక్త కిసాన్‌మోర్చా రాష్ట్ర కన్వీనర్ శోభనాద్రీశ్వరరావు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 5: దేశ సంపదను ఆదాని, అంబానీలకు దోచిపెడుతున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమీత్‌షాలను, వారికి మద్దతు ఇచ్చే పార్టీలను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఒంగోలులోని రంగాభవన్‌లో జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈనెల 12న విజయవాడలో జరిగే భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆవిర్భావ సభ సన్నహక సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. విద్యుత్ సంస్కరణలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలోని 12 పోర్టులను అదానీకి అప్పగించారని విమర్శించారు. వ్యవసాయ, గృహవినియోగానికి స్మార్ట్ మీటర్లు బిగించేలా రంగం సిద్ధం చేశారని చెప్పారు. చేసిందన్నారు. రాష్ట్రంలో భూమి హక్కుల చట్టం-22ను


సమావేశంలో మాట్లాడుతున్న శోభనాద్రీశ్వరరావు

రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 12న విజయవాడలో జరిగే భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆవిర్భావ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యూత్ ఫర్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు యు.వేదవతి మాట్లాడుతూ పాలకులు ప్రభుత్వ రంగం కన్నా ప్రైవేటురంగం మంచిదన్న తీరుగా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ.ప్రసాద్ మాట్లాడుతూ బీజేపీ పాలనలో దేశంలోని ఏ వర్గం సంతోషంగా లేదన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు చుండూరి రంగారావు, కంకణాల ఆంజనేయులు, కె.అరుణ, వడ్డే హనుమారెడ్డి, కె.వీరారెడ్డి, జె.జయంతిబాబు, పమిడి వెంకట్రావు, చుంచు శేషయ్య, ఎస్.లలితకుమారి, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, కరవది సుబ్బారావు, ఓర్సు శ్రీనివాసరావు, పేరయ్య, దేవరపల్లి సుబ్బారెడ్డి, రఫీ, దాసరి సుందరం, రావిపాటి ప్రసాదరావు, నాదెండ్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల సమ్మె ఉధృతం

వంటా-వార్పుతో నిరసన • ప్రభుత్వ తీరుపై ఆగ్రహం • ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోనే రాత్రి నిద్ర

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 5 : మునిసిపల్ కార్మికుల సమ్మె రోజురోజుకూ ఉధృతమవుతోంది. 11వ రోజైన శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో వంటా వార్పు చేసి కార్మికులు నిరసన తెలిపారు. అంతకుముందు తమ సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఇంటింటికీ తిరిగి బిక్షాటన చేశారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో వంట చేసుకొని తిని, రాత్రికి అక్కడే నిద్ర చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదన్నారు. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి తన నిరంకుశ ధోరణి మానుకోవాలని హితవుపలికారు. కార్మికుల సమ్మెతో పట్టణాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయిందన్నారు. అంతేకాకుండా ఇళ్లలోని చెత్తను బయటపోసే వీలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో కార్మికులంతా వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొర్నెపాటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసరావు, యు.రత్నకుమారి, బాలకృష్ణ, గోపి, విజయమ్మ, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.


ఒంగోలులో వంటావార్పుకు సిద్ధం చేస్తున్న కార్మికులు


చీమకుర్తిలో పొర్లుదండాలతో నిరసన తెలుపుతున్న మహిళలు

పొర్లుదండాలతో నిరసన

చీమకుర్తి: మున్సిపల్ కార్మికుల సమ్మె శుక్రవారం కొనసాగింది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చీమకుర్తిలో కార్మికులు ధర్నా నిర్వహించారు. శిబిరంలో పొర్లుదండాలు పెడుతూ తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో పద్మ, ఏడుకొండలు, కోటేశ్వరి, చెన్నమ్మ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

అనంతవరం మునిసిపై బ్రిడ్జి నిర్మాణానికి పరిశీలన

• కలెక్టర్, ఎంపీ మాగుంట చొరవ


బ్రిడ్జి నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

టంగుటూరు, జనవరి 5 : మండలంలోని అనంతవరంలోని ముసిపై బ్రిడ్జి నిర్మాణానికి పంచాయతీరాజ్ ప్రాజెక్టుల విభాగం ఇంజనీరింగ్ అధికారి మాలకొండయ్య శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతవరం-ఇదే పంచాయతీలోని తేటుపురం గ్రామాల మధ్య ముసి తీవ్ర అడ్డంకిగా మారింది. అనంతవరం నుంచి ఇదే పంచాయతీలోని తేటుపురానికి మధ్య దూరం కేవలం 3 కి.మీ మాత్రమే. ముసిపై బ్రిడ్జి లేనందున రెండు గ్రామాల జనం 5, 6 కి.మీ దాటి ప్రయాణిస్తుంటారు. ఈ రెండు గ్రామాల నడుమ ముసిపై బ్రిడ్జితోపాటు సుమారు 2 కి.మీ రోడ్డు నిర్మించుకుంటే రాకపోకలకు అనువుగా ఉంటుంది. కొత్తపట్నం, టంగుటూరు మండలాలను కలిపేందుకు కూడా ఈ మార్గం సుగమంగా ఉంటుంది. అనంతవరం నుంచి ముసి అవతల వేలాది ఎకరాల్లో రొయ్యల చెరువులు విస్తరించి ఉన్నాయి. ఆ చెరువుల వద్దకు వెళ్లేందుకు ముసి అడ్డుగా ఉండడంతో రొయ్యల చెరువుల యజమానులు ఒంగోలు నుంచి ఈతముక్కల, మడనూరు మీదుగా వెళ్తుంటారు. గతంలో అనంతవరం సమీపాన దక్షిణంగా ముసిపై బ్రిడ్జి నిర్మాణం జరిగినా ప్రజలకు అంత ప్రయోజనకరంగా తీర్చిదిద్దలేదు. బ్రిడ్జికి అవతల మడనూరు గ్రామాన్ని కలుపుతూ అటూ, ఇటూ రోడ్డు వేయలేదు. దీంతో ఈ బ్రిడ్జి నిరుపయోగం ఉంది. కాగా అనంతవరం, తేటుపురం గ్రామాల మధ్య ముసిపై బ్రిడ్జి కావాలని ఈ రెండు గ్రామాల జనం పదేపదే ప్రజాప్రతినిధులను, జిల్లా అధికారులను కోరుతూనే ఉన్నారు. ఇటీవల ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని, కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కూడా రెండు గ్రామాల వారు బ్రిడ్జి కావాలని అడిగారు. ఏళ్ల తరబడి రెండు గ్రామాల జనం ముసిపై బ్రిడ్జి కోరుతూనే ఉన్నారు. ఎట్టికేలకు వీరి విన్నపాన్ని మన్నించిన కలెక్టర్, ఎంపీ ఇంజనీరింగ్ అధికారులను పంపించారు. ఈ సందర్భంగా ముసి వద్దకు వచ్చి పరిస్థితి పరిశీలించిన జేఈ మాలకొండయ్య మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలు రూపొందిస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థుల భవిష్యత్ కోసం 'మార్గదర్శి'

• కలెక్టర్ దినేష్‌కుమార్


సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్


ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 5 : బాల్యం నుంచే భవిష్యత్‌కు స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరుచుకునేలా విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు జిల్లాలో అమలు చేస్తున్న మార్గదర్శిని కార్యక్రమాన్ని మెల్బోర్న్ యూనివర్శిటీ సహకారంతో మరింత ముందుకు తీసుకెళ్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ దిశగా తొలుత ఎంపిక చేసిన 20 పాఠశాలలు, 6 ప్రభుత్వ వృత్తివిద్య జూనియర్ కాలేజీల్లోని 82 మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లకు శుక్రవారం ఒంగోలులోని రామచంద్రమిషన్ ప్రాంగణంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు భవిష్యత్తు, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ ఉన్నత విద్యావిభాగం, కెరియర్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టు పేరుతో మెల్బోర్న్ యూనివర్శిటీతో అవగాహన ఒప్పందం చేసుకుందన్నారు. మార్గదర్శిని పేరుతో జిల్లా యంత్రాంగం గత ఏడాది నుంచి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిన నేపథ్యంలో తొలుత ప్రకాశం జిల్లా నుంచే కెరీర్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టును కూడా ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. రాక్వెల్ షర్ప్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా లభిస్తున్న ఉద్యోగ అవకాశాలలో గణనీయంగా మార్పు వస్తుందని తెలిపారు. వాటికి తగినట్లుగా విద్యార్థులు ముందు నుంచే తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో డీఈవో సుబ్బారావు, మార్గదర్శిని జిల్లా నోడల్ అధికారి సామా సుబ్బారావు, ఆర్‌ఐవో సైమన్ విక్టర్, డీవీఈవో శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఏఎంవో రమేష్, సైన్స్ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. గత ఏడాది ఆగస్టు నుంచి డిసెంబరు వరకు అమలైన వివిధ సంక్షేమ పథకాలకు అర్హత ఉన్నా పలు కారణాలతో లబ్ధి పొందలేకపోయిన అర్హుల ఖాతాలలో శుక్రవారం సీఎం జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గత ఆరు నెలల్లో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలలో అర్హత ఉన్నా లబ్ధి పొందలేకపోయిన 3173 మందికి రూ.4.73కోట్లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమార్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మహబూబ్, అధికారులు వసుంధర, రవికుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, మార్కాపురం డీఎల్‌డీవో సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 5: ఏషియన్ టెన్నిస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలో సత్తా చాటిన ఒంగోలు క్రీడాకారుడు తేళ్ళ రోహిత్‌ను పలువురు అభినందించారు. గత నెల 30 నుంచి ఈనెల 1వ తేదీ వరకు జరిగిన ఏషియన్ చాంపియన్‌షిప్ పోటీలలో శ్రీలంక, బంగ్లాదేశ్, సింగపూర్, నేపాల్, భారత జట్లు తలపడ్డాయి. భారత్, సింగపూర్ మధ్య జరిగిన మ్యాచ్‌లో రోహిత్, వెంకట్ పాల్గొని విజయం సాధించిన ఒంగోలుకు చెందిన తేళ్ళ రోహిత్, వెంకట్‌లను శుక్రవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. అనంతరం టెన్నిస్‌బాల్ జిల్లా అసోసియేషన్ చైర్మన్ మారం వెంకారెడ్డి వారిని అభినందించారు. సత్కరించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ప్రియ, సెక్రటరీ రవి, తేళ్ళ జాన్సన్, డాక్టర్ కిషోర్, డాక్టర్ ప్రకాష్, సినీ యాక్టర్ మస్తాన్‌రావు పాల్గొన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న వెంకారెడ్డి

అవీ..ఇవీ..

అక్రమ లేఅవుట్లపై సంజాయిషీ నోటీసులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 5: సింగరాయకొండ, పామూరు, సంతనూతలపాడులో అక్రమ లే అవుట్లపై మండల విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సంజాయిషీ నోటీసులు ఇస్తూ జిల్లా పంచాయతీ అధికారి జీవీ.నారాయణరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కలెక్టర్ దినేష్‌కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అక్రమ లే అవుట్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరాయకొండ, పామూరు, సంతనూతలపాడులలో ఉన్న అక్రమ లే అవుట్లను వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయా అక్రమ లే అవుట్లపై శుక్రవారం డీపీవో నోటీసులు జారీ చేశారు. 24 గంటల్లో అక్రమ లే అవుట్లపై సంజాయిషీ ఇవ్వాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

వాచ్‌మెన్ల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 5: ఒంగోలు నగరంలోని అపార్ట్‌మెంట్లలో పని చేస్తున్న వాచ్‌మెన్ల సమస్యలను అపార్ట్‌మెంట్ల అసోసియేషన్లు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వాచ్‌మెన్ల అసోసియేషన్ అధ్యక్షుడు చెందలూరి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో 473 అపార్ట్‌మెంట్లలో పనిచేసే వాచ్‌మెన్లకు సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అనంతరం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టంగుటూరు రాము, రాయల మాలకొండయ్య, సీహెచ్ .కోటేశ్వరరావు, ఎ.రమణయ్య, డాక్టర్ కృష్ణయ్య, శ్రీనివాసులు, కె.నాగేశ్వరరావు, నాగరాజునాయక్, నాగేశ్వరనాయక్, టి.సుబ్బారావు, సీహెచ్.రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు

ఒంగోలు(కలెక్టరేట్) జనవరి 5 : జన విజ్ఞాన వేదిక, రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ సహకారంతో ఈనెల 7న జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడులోని శ్రీహర్షిణీ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా గౌరవ సలహాదారు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏవీ.పుల్లారావు, సీహెచ్.జయప్రకాష్ తెలిపారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత నెలలో జరిగిన మండల చెకుముకి సైన్స్ పరీక్షల్లో మొదటి స్థానం సాధించిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు హాజరవుతారని తెలిపారు. డీఈవో వీఎస్.సుబ్బారావు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌వీ.రంగారెడ్డి, ఎన్‌టీ.వెంకటేష్, డి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శారీరక శ్రమతోనే మానసిక ఒత్తిడి దూరం


కిట్లను అందజేస్తున్న డాక్టర్ శాంతకుమారి

సంతనూతలపాడు, జనవరి 5: శారీరక శ్రమతోనే మానసిక ఒత్తిడి దూరం సాధ్యమని ఒంగోలుకు చెందిన శ్రీరామ్ హస్పిటల్ డాక్టర్ చాపల శాంతకుమారి తెలిపారు. సేవాసంకల్ప్ చారిటబుల్ ట్రస్టు, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శుక్రవారం సంతనూతలపాడు జడ్పీహైస్కూల్ విద్యార్థులకు ఆరోగ్యం-విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన శాంతకుమారి మాట్లాడుతూ బాలికలు సరైన పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు హెల్త్‌కిట్లను అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మండల చైర్మన్ శనగల రమణ, వైస్‌చైర్మన్ ధనలక్ష్మి, ట్రెజరర్ శ్రీనివాసరావు, సెక్రటరీ పాపారావు, హెచ్‌ఎం పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


అట్టలు, పెన్నులను అందజేస్తున్న దాతలు

మద్దిపాడు, జనవరి 5: నాగన్నపాలెం ఎలిమెంటరీ స్కూల్‌లో శుక్రవారం పోలిశెట్టి సోమసుందరం పొగాకు కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రిని కంపెనీ మేనేజర్లు సురేంద్ర, విద్యాధరన్ రావు, ఆర్ల రామాంజనేయు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాకర్ల విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు అందజేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 5 : నిరుద్యోగ యువతకు ఏపీపీఎస్‌సీ, వివిధ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలకు నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పరీక్షలకు హాజరయ్యే 50మంది విద్యార్థులకు ఒంగోలులోని లాజిక్ అకాడమీలో ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు డైరెక్టర్ పాలపర్తి విజయభాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బుద్దిస్టులు, జైన్‌లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, ఇతర ధృవీకరణపత్రాలతో ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 7207012758 సెల్ నంబరులో ద్వారా సంప్రదించాలని కోరారు.

కొనసాగిన సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 5: సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పలువురు జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు. రాష్ట్ర సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఫెడరేషన్(జేఏసీ) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు 17వ రోజైన శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక దీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ తమకు సామాజిక భద్రత పథకాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయస్సును పెంచాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేసి పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి


మాట్లాడుతున్న వెంకట్రావు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 5: పశువైద్యాధికారులు లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని పశుసంవర్థక శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకట్రావు సూచించారు. ఒంగోలులోని డీఎల్‌డీఏ సమావేశపుహాలులో శుక్రవారం పశువైద్య సహాయశస్త్ర చికిత్సకులు, సహాయ సంచాలకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడ్డి విత్తనాల పంపిణీ, ఫిక్స్‌డే విజిట్స్ పూర్తి చేయాలన్నారు. పశువైద్యులు రైతులకు అందుబాటులో ఉంటూ సకాలంలో వైద్య సేవలు అందించాలని చెప్పారు. పశుసంవర్థకశాఖ జిల్లా అధికారి డాక్టర్ కె.బేబీరాణి మాట్లాడుతూ రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు, రుణాలు అర్హులైన వారికి అందించి వారి ఆదాయాన్ని పెంచాలని సూచించారు. సమావేశంలో ఉపసంచాలకులు డాక్టర్ షేక్ కాలేషా, రమేష్, సౌమ్య, వెంకటసుబ్బయ్య, పద్మావతి, సహాయ సంచాలకులు వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఓటర్లను జాగృతం చేస్తున్నా నిధులు ఇవ్వరా..?



మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 5: 2009 సంవత్సరం నుంచి ఓటర్ల అవగాహన కోసం స్వీప్ అనే చైతన్య కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నా రాష్ట్రంలో జిల్లా కలెక్టర్లకు ఎన్నికల సంఘం ఎలాంటి నిధులు ఇవ్వకపోవడం దురదృష్టకరమని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ జాయింట్ సెక్రటరీ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సీపీఐ సమావేశపు హాలులో శుక్రవారం నాయకులు మావులూరి నాగేశ్వరరావు, కొల్లా మధు, సుంకర సాయిబాబు విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 12వ తేదీ వరకు ఓటర్ల నమోదు, 22న తుది ఓటర్ల జాబితా విడుదల అవుతుందన్నారు. వలంటీర్లు ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగస్వాములు అవుతున్నారని ఆరోపించారు. సచివాలయ సిబ్బంది అత్యధికులు బీఎల్‌వోలుగా ఉంటున్నారని, వీరిపై స్థానిక అధికార పార్టీ నేతల జోక్యం ఉండటంతో ఓటర్ల జాబితాలో లోపాలు దర్శనమిస్తున్నాయన్నారు. వీటిని సరిదిద్దే బాధ్యత వారికే ఇవ్వడం తగదని చెప్పారు. ఈనెల 9,10 తేదీల్లో విజయవాడలో జరిగే సమావేశంలో కేంద్ర ఎన్నికల సంఘం సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.

అగ్జీలీయం హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్

ఒంగోలు(రూరల్), జనవరి5: ఒంగోలులోని అగ్జీలియం హైస్కూల్లో శుక్రవారం సైన్సు ఎగ్జిబిషన్ జరిగింది. విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సిస్టర్స్ లూసి, అప్పమ్మ, సూసియారాణి, ట్రీసా, ప్రియాంక, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కనిగిరిలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు శుక్రవారం నిర్వహించిన పిలుస్తుంది రా.. కదలిరా.. ఎన్నికల శంఖారావ సభకు ఒంగోలు నుంచి పెద్ద ఎత్తున తెలుగు తమ్ముళ్లు తరలివెళ్లారు. నగరంలోని కమ్మపాలెం నుంచి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేయగా టీడీపీ కార్పొరేటర్ దాచర్ల రమణయ్య, సీనియర్ నాయకుడు భైరపనేని తిరుపతిరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా వెళ్లారు. - ఒంగోలు

సంగమేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేయండి



ఇరిగేషన్ ఎస్ఈకి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

టంగుటూరు, జనవరి 5: నియోజకవర్గ ప్రజలకు వరప్రసాదిని సంగమేశ్వరం ప్రాజెక్టును ఇకనైనా పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు బొడ్డు సతీష్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒంగోలులోని ఇరిగేషన్ కార్యాలయంలో ఎస్ఈ అబుద్ఆలీని కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు సంగమేశ్వరం ప్రాజెక్టు అంతగా పట్టించుకోలేదని, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వమైతే అటువైపు కన్నెత్తి కూడా చూడలేదని చెప్పారు. సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం సంగమేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ఒక్కటేనన్నారు. జగన్ ప్రభుత్వం ఇకనైనా మొద్దు నిద్ర నుండి మేల్కొని సంగమేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులకు నిధులు విడుదల చేయాలని విన్నవించారు.

ఎస్సైలుగా ఎంపికైన పీఎన్‌సీపీ విద్యార్థులకు సత్కారం

సింగరాయకొండ, జనవరి 5 : సింగరాయకొండ పీఎన్‌సీపీ డిగ్రీ కళాశాలలో విద్యను అభ్యసించి ఎస్సైలుగా ఎంపికైనా ముగ్గురు పూర్వ విద్యార్థులను కళాశాల యాజమాన్యం శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. గీతారాణి మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. అందుకు తమ కళాశాలలో చదివి ఎస్సైలుగా ఉద్యోగం సాధించిన విద్యార్థులే తార్కాణమని చెప్పారు. అనంతరం ఎస్సైలుగా ఎంపికైనా మండలంలోని శానంపూడి గ్రామానికి చెందిన చింతలపూడి గోవర్ధన్, పోలినేనిపాలేనికి చెందిన నేలకూరి ఏడుకొండలు, కందుకూరికి చెందిన జక్కుల శ్రావణ్ అలాగే రైల్వేలో ఉద్యోగం సాధించిన నర్రావారిపాలెంకు చెందిన కె. శ్రీనివాసులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పి.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డి.నాగేశ్వరరావు, అధ్యాపకబృందం పాల్గొన్నారు.

బాబు సభకు భారీగా తరలిన టీడీపీ శ్రేణులు



జెండా ఊపి కనిగిరికి బస్సులను ప్రారంభిస్తున్న సర్పంచ్ మమత, మండల పార్టీ అధ్యక్షుడు విజయకుమార్

టంగుటూరు, జనవరి 5 : కనిగిరిలో టీడీపీ అధినేత చంద్రబాబు సభకు టంగుటూరు మండలం నుంచి వందలాది మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుక్రవారం తరలివెళ్లారు. టంగుటూరు మసీదు సెంటర్‌లో ఏర్పాటు చేసిన మూడు ప్రైవేట్ బస్సులు, టెంపో, కార్లను సర్పంచ్ మద్దిరాల మమత, మండల పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్ జండా ఊపి ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ శ్రేణులు వారికి ఏర్పాటు చేసిన వాహనాల్లో సుమారు 1,500 మంది తరలివెళ్లారు.

ఆధునిక డ్రిప్ ఇరిగేషన్‌పై అవగాహన

కొండపి, జనవరి 5 : పొగాకు తోటలలో ఆధునిక పద్ధతిలో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీరు పెట్టే విధానాన్ని క్షేత్రస్థాయి ప్రదర్శన ఐటీసీ కంపెనీ ప్రతినిధులు, కొండపి పొగాకు వేలం కేంద్రం అధికారులు శుక్రవారం పెదకండ్లగుంటలో నిర్వహించారు. ఐటీసీ ప్రతినిధులు ఎల్ఎం యశ్వంత్‌కుమార్, వెంకటరావు ఈపద్ధతిలో నీరు కట్టడం వల్ల రైతులకు ఒనగూరే ప్రయోజనాలు వివరించారు. వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్, సీనియర్ గ్రేడింగ్ అధికారి సాయికుమార్, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష వివరాలను ఆన్‌లైన్ చేయాలి

ఒంగోలు(రూరల్), జనవరి5: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యసేవలు పొందినవారి వివరాలను ఆన్‌లైన్ చేయాలని ఏపీ వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం ఉలిచి గ్రామ పంచాయతీ కార్యలయం వద్ద ఏర్పాటు చేసిన ఆరోగ్యసురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వైద్యసేవలు పొందిన వారిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. రోగులు ఆరోగ్యశ్రీ వైద్యశాలకు వెళ్లినప్పుడు వైద్యసేవలు ఎలా పొందాలో సిబ్బంది తెలియజేయాలన్నారు. ఆరోగ్యశ్రీ వైద్యసేవలు సంతృప్తికరంగా, సక్రమంగా లేకుంటే 104 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ డాక్టర్ పి.సరళమ్మ, డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి, డీసీహెచ్ఎస్ మూర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌వో మాధవీలత, జిల్లా ఆరోగ్యశ్రీ ట్రస్టు కోఆర్డినేటర్ హేమంత్, ఎంపీడీవో పి.అజిత, కరవది డాక్టర్ సుందరప్రసాద్, డాక్టర్ ఎస్.వాణి, సర్పంచ్ మంచు మురళి. ఏఎన్ఎంలు జయకుమారి, రజినీకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ రవి పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్ నిర్వాహకులకు శిక్షణ



మాట్లాడుతున్న జేడీ చంద్రశేఖరరెడ్డి

ఒంగోలు నగరం, జనవరి 5: జిల్లాలో ఫిష్ ఆంధ్ర పథకం కింద రిటైల్ అవుట్ లెట్‌లను నిర్వహిస్తున్న వారికి శుక్రవారం ఒంగోలులోని వెలుగు టీటీడీసీ భవనంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఆవుల చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ అవుట్‌లెట్లను ఇంకా సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రయివేట్ సంస్థ ద్వారా రిటైల్ అవుట్ లెట్ నిర్వాహకులకు దూర ప్రాంతాల నుంచి సముద్రం చేపలు, మంచినీటి చేపలు, రొయ్యల సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నాణ్యమైన చేపలను వినియోదారులకు అందించటమే లక్ష్యంగా అవుట్‌లెట్లను ఆధునీకరించబోతున్నామని పేర్కొన్నారు. సమావేశంలో సంయుక్త సంచాలకులు వెంకటేశ్వరరావు, ఏడీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

వాసవీ సిటిజన్స్ కార్యవర్గం

ఒంగోలు(కల్చరల్), జనవరి 5: వాసవీ క్లబ్ ఒంగోలు సిటిజన్స్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైబ్రెంట్ ఇయర్ 2024కు గాను క్లబ్ అధ్యక్షులుగా ఏల్చూరి నగేష్ గుప్తా, కార్యదర్శిగా భూమా శ్రీనివాసులు, కోశాధికారిగా బియ్యపు సంపత్‌లు ఎన్నికయ్యారు. ఈ మేరకు క్లబ్ రీజన్ చైర్మన్ టి.రంగస్వామికి వారు నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ చీదెళ్ల వెంకటప్రసాదు, రీజియన్ కార్యదర్శి అమరా సత్యనారాయణ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

25వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

- జిల్లావ్యాప్తంగా కొనసాగిన ధర్నాలు



కొండపి, మద్దిపాడులో జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

ఒంగోలు నగరం, జనవరి 5: తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం నాటికి 25వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అన్ని కేంద్రాల్లో ధర్నాలు కొనసాగించారు. ఒంగోలులోని కలెక్టరేట్ ఎదుట, అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల కేంద్రాల్లో తమ నిరసనలు చేపట్టారు. ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కేవీ.సుబ్బమ్మ అధ్యక్షత వహించగా సీఐటీయూ నాయకులు కొండారెడ్డి, చీకటి శ్రీనివాసులు, తంగిరాల మహేష్ తదితరులు ప్రసంగించారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు ఆందోళన కొనసాగుతుందని చెప్పారు. కేంద్రాలను వెంటనే తెరిపించి లబ్ధిదారులకు పౌష్టికాహారం అందేలా చేయాలంటే ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కాగా శుక్రవారం నుంచి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేయించేందుకు ప్రభుత్వం వలంటీర్లను రంగంలోకి దింపేందుకు చర్యలు చేపట్టింది. ఈ చర్యలను అడ్డుకునేందుకు యూనియన్ సిద్ధమయ్యింది. ఇప్పటికే కేంద్రాల తాళాలను అధికారులు పగులకొట్టటంతో కేంద్రాల్లో ఉన్న సామగ్రి కనిపించటం లేదని అంగన్‌వాడీలు ఆందోళన చెందుతున్నారు. ఇతరులతో నడిపించాలని ప్రభుత్వం ప్రయత్నించటంతో అంగన్‌వాడీలు ప్రభుత్వంపై మరింత పోరుకు సిద్ధమవుతున్నారు.

కొండపిలో..

కొండపి: అంగన్‌వాడీల పది డిమాండ్స్ నెరవేర్చామని ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ధనలక్ష్మి విమర్శించారు. శుక్రవారమిక్కడ అంగన్‌వాడీలు చేస్తున్న నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ బెదిరింపులకు బెదిరేది లేదని స్పష్టం చేశారు. అనంతరం ప్రభుత్వ జీవో ప్రతులను అంగన్‌వాడీలు దహనం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, ఆశావర్కర్ల యూనియన్ జిల్లా ఉపకార్యదర్శి రాఘవమ్మ, కొండపి ప్రాజెక్ట్‌లోని కొండపి, మర్రిపూడి, పొన్నలూరు మండలాల అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, పున్నమ్మ, అరుణ, ధనలక్ష్మి, పోలమ్మ, మధురవాణి పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు మద్దిపాడులో శుక్రవారం పెద్దఎత్తున నిరసన దీక్ష చేశారు. అంగన్‌వాడీ టీచర్లు వెంటనే విధులకు హాజరుకావాలని ప్రభుత్వం జారీ చేసిన జీవో కాపీలను వారు తగులబెట్టారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బంక సుబ్బారావు, ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, జయప్రద, రజని, నిషా, మాధవి తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్): మండల కేంద్రమైన నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటర్‌లో అంగన్‌వాడీలు శుక్రవారం తమ నిరసనలో భాగంగా మోకాళ్లపైన నిల్చుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రమీల, సుబ్బరావమ్మ, టి.శ్రీకాంత్ పాల్గొన్నారు

410 మంది ఉద్యోగులకు సంజాయిషీ నోటీసులు

- జారీ చేసిన సమగ్ర శిక్ష ఏపీసీ
- వారంలోపు వివరణ ఇవ్వకపోతే ఉద్వాసన తప్పదని హెచ్చరిక

ఒంగోలు (విద్య), జనవరి 5 : సమగ్ర శిక్షలో సమ్మె చేస్తున్న 410 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ వీఎస్.సుబ్బారావు శుక్రవారం సంజాయిషీ నోటీసులు ఇచ్చారు. వారంలోపు వివరణ ఇవ్వాలని ఆదేశించారు. లేకపోతే ఉద్వాసన తప్పదని హెచ్చరించారు. కాంట్రాక్టు నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగులు సమ్మె చేయడం తగదని నోటీసుల్లో ఆయన పేర్కొన్నారు. సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టులో వివిధ విభాగాల్లో మొత్తం 1,166 మంది కాంట్రాక్టు ఉద్యోగాలు పని చేస్తున్నారు. వీరిలో 410 మంది సమ్మెలో పాల్గొంటున్నారు. తమ సర్వీసులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాల ని, గ్రాస్‌పే అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వీరంతా పక్షం రోజులుగా సమ్మె చేస్తున్నారు. విధుల్లో చేరాలన్న సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ విజ్ఞప్తిని వారు పట్టించుకోకపోవడంతో వేటు వేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గురువారం ఎస్పీడీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సమ్మెలో ఉన్న వారికి నోటీసులు జారీ చేసి వారిని ఉద్యోగాల నుంచి తొలగించాలని ఆదేశించారు. దీంతో సమగ్ర శిక్ష ఏపీసీ సుబ్బారావు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. ఈనేపథ్యంలో కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మెను వీడి విధుల్లో చేరతారా లేదా? అన్నది వేచిచూడాల్సి ఉంది. కాగా 17వ రోజైన శుక్రవారం కూడా స్థానిక కలెక్టరేట్ ఎదుట దీక్షలు చేపట్టి నిరసన తెలిపారు.

సార్వత్రిక ఎన్నికలకు పోలీసుశాఖ సిద్ధం

- గుంటూరు రేంజ ఐజీ పాల్‌రాజ్
- ఒంగోలు డీఎస్పీ కార్యాలయం తనిఖీ

ఒంగోలు(క్రైం), జనవరి 5: సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతగా ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం చేస్తున్నామని గుంటూరు రేంజి ఐజీ జి.పాల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం ఒంగోలు డీఎస్పీ కార్యాలయంతో పాటు జిల్లా పోలీసు కార్యాలయంలోని అన్ని విభాగాలను ఎస్పీ మలికగర్గ్‌తో కలిసి తనిఖీ చేశారు. అనంతరం మీడియాతో ఐజీ మాట్లాడుతూ ఈ ఏడాది జరిగే ఎన్నికలలో గత ఎన్నికలకు కంటే అదనంగా పోలీసు సిబ్బందిని వినియోగిస్తామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పోలీసు సిబ్బంది పెంచుతామని చెప్పారు. అదేవిధంగా రౌడీషీటర్లను బైండోవర్ చేయడంతో పాటు నాన్‌బెయిల్‌బుల్ వారెంట్లు అమలుకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణలో కఠినంగా వ్యవహరిస్తామని,సమస్యాత్మక గ్రామాలపై ప్రధానంగా దృష్టి పెడతామని తెలిపారు. అదేవిధంగా ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా బదిలీలు ఉంటాయని, ఈమేరకు ఈ నెల 9,10 తేదీల్లో జరిగే సమావేశంలో ఎన్నికల ప్రణాళిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని వెల్లడించారు. తొలుత జిల్లా పోలీసు కార్యాలయంలో డీసీఆర్‌బీ సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం విధుల్లో ప్రతిభ కనబరిచిన వారికి రివార్డులతో పాటు గుడ్ సర్వీస్‌ను ప్రకటించారు. కాగా ఒంగోలు, దర్శి డీఎస్పీ కె.నారాయణస్వామిరెడ్డి, టి.అశోక్‌వర్ధన్, సీఐలు జగదీష్, భక్తవత్సలరెడ్డి, ఎం.లక్ష్మణ్, శ్రీనివాసరెడ్డి, రంగనాథ్, ఎస్పై బాబురావులు ఐజీకి సాదరస్వాగతం పలికారు.

కొత్తపట్నం బాలికల హాస్టల్‌కు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు

- జీవీఆర్ ఫౌండేషన్ దాతృత్వం



సామగ్రిని అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

కొత్తపట్నం(ఒంగోలునగరం), జనవరి 5: వైసీపీ ప్రభుత్వం సంక్షేమశాఖల వసతి గృహాలను ఏమాత్రం పట్టించుకోకపోవడంతో పలు సమస్యలు తిష్టవేశాయి. విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. బాలికల వసతిగృహాల్లో అయితే సమస్యలు మరింత జఠిలంగా మారాయి. కొత్తపట్నంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతిగృహంలో విద్యార్థినుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న జీవీఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు చలించిపోయారు. రూ.10లక్షలు సొంత నిధులు వెచ్చించి బాలికల వసతి గృహంలో కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పించారు. బాలికలకు నీటి కొరత లేకుండా కొత్తగా బోరు వేయించి మోటార్ బిగించారు. విద్యార్థినులకు రక్షణ కోసం వసతిగృహం చుట్టూ సీసీకెమెరాలు అమర్చారు. వేడి నీటి కోసం హీటర్ ఏర్పాటు చేశారు. 50 మందికి సరపడా మంచాలు, బెడ్‌లు అందించారు. అంతేగాకుండా విద్యార్థినుల గదుల్లో తగినన్ని ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. నిన్నటి వరకు అసౌకర్యాలతో సతమతమైన విద్యార్థినులకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. గ్రంధి వెంకటేశ్వరరావు ఫౌండేషన్ నిర్వాహకులు గ్రంధి శ్రీనివాసరావు ఔదార్యం విద్యార్థినులకు వరంగా మారింది. వసతిగృహంలో సమస్యలను ఇప్పటి వరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేక పోవటంతో మ్యాట్రిన్ అరుణకుమారి సమస్యలను జీవీఆర్ సంస్థ మేనేజర్ పిన్ని బంగారయ్య దృష్టికి తీసుకుపోయారు. ఆయన ఈ విషయాన్ని గ్రంధి శ్రీనివాసరావు దృష్టికి తీసుకుపోయారు. వెంటనే స్పందించి రూ.10లక్షలతో అన్ని సౌకర్యాలను కల్పించడంపై విద్యార్థినుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హత్యాచారయత్నం కేసులో ఐదేళ్లు జైలు

ఒంగోలు(క్రైం), జనవరి5: మహిళపై హత్యాచారయత్నానికి పాల్పడిన కనిగిరి మండలానికి చెందిన మారెళ్ళ కిషోర్‌కి ఐదేళ్లు జైలు శిక్ష, రూ.3వేలు జరిమాన విధిస్తూ ఒంగోలు రెండో అదనపు కోర్టు న్యాయాధికారి సోమశేఖర్ శుక్రవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కనిగిరి మండ లంలో కొబ్బరికాయలు వ్యాపారం చేసుకునే 35 ఏళ్ల మహిళపై 2019లో అదే గ్రామానికి చెందిన కిషోర్ కొబ్బరికాయ కొనేందుకు వెళ్లాడు. నిందితుడు మహిళను మంచినీరు అడిగాడు. ఆమె మంచినీటి కోసం ఇంట్లోకి వెళ్ళగా లోపలకి ప్రవేశించి అత్యాచారయత్నం చేసి హత్య చేయబోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.

నయన మనోహరం చెన్నకేశవ కల్యాణం



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు (కల్చరల్), జనవరి 5: స్థానిక కేశవస్వామిపేట శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో స్వామి వారి కళ్యాణోత్సవం శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. చిత్తా నక్షత్రం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కళ్యాణోత్సవంలో అర్చకులు కేవెల్.శర్మా వధాని, పి.రమానాథాచార్యులు, నాగార్జున దేవ్, శ్రీధర్, కె.రాంబాబు బృందం వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం క్రతువులను నిర్వహించారు. కళ్యాణోత్సవ ఏర్పాట్లను దేవస్థాన చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, ఈవో డి.రజనికుమారి, సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, పి.గోవర్ధనరెడ్డి పర్యవేక్షించారు. అనంతరం రాజ్యలక్ష్మి అమ్మవారి ప్రాకారోత్సవం సైతం వైభవోపేతంగా జరిగింది.

వెలగపూడి-ఆలకూరపాడు తారురోడ్డుకు అనుమతి

టంగుటూరు, జనవరి 5 : మండలంలోని వెలగపూడి నుంచి ఆలకూరపాడు వయా అనంతవరం మార్గంలో తారు రోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ ప్రాజెక్టు విభాగం నుంచి అనుమతి లభించిందని పీఆర్ ప్రాజెక్టుల విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాలకొండయ్య శుక్రవారం తెలిపారు. ఈరోడ్డు నిర్మాణానికి రూ.4.05కోట్లు మంజూరైనట్లు చెప్పారు. ఈరోడ్డు పనులకు ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చీమకుర్తి, జనవరి 5 : చీమకుర్తి, ఆర్ఎల్.పురం ప్రాంతాల్లో ఉన్న గ్రానైట్ తదితర పరిశ్రమలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ డీఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎంఐ వర్క్ నిర్వహిస్తున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కరెంటు సరఫరా నిలిపిస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రీరామ్ హాస్పటల్‌లో మహిళా సర్జన్ సేవలు

ఒంగోలు(కల్చరల్), జనవరి 5: ఒంగోలు నగరం సత్యనారాయణపురంలోని శ్రీరామ్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో మహిళా జనరల్ సర్జన్ సేవలు ప్రారంభించినట్లు ఆస్పత్రి ఎండీ డాక్టర్ చావల వంశీకృష్ణ తెలిపారు. జిల్లాలోనే ఏకైక మహిళా జనరల్, లేపరోస్కోపిక్ సర్జన్, ఒంగోలుకు చెందిన డాక్టర్ జెరుషా జాస్మిన్ ఇక నుంచి తమ ఆస్పత్రిలో సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన డాక్టర్ జెరుషాజాస్మిన్‌కు బొకే అందజేసి ఆహ్వానించారు. అదేవిధంగా జనరల్, లేపరోస్కోపిక్ సర్జరీ సమస్యలు సంబంధించిన సందేహాల కోసం 8184828282 నెంబరులో సంప్రదించవచ్చని డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ శాంతకుమారి తెలిపారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

ఒంగోలు(కల్చరల్),జనవరి 5: ఒంగోలు నగరం సుజాతనగర్‌లోని అపెక్స్ పబ్లిక్‌స్కూలులో శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎమ్మెస్‌రెడ్డి ప్లేగ్రౌండ్‌లో ఉపాస్ హాస్పటల్ సౌజన్యంతో మండాది శ్రీనివాసరెడ్డి మెమోరియల్ ఉచిత మెగా వైద్యశిబిరంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె.శివకోటిరెడ్డి మాట్లాడుతూ వైద్య శిబిరంలో సుమారు 1400 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు చెప్పారు. ఉపాస్ హాస్పటల్ ఎండీ డాక్టర్ చావల ప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రామసుబ్బారెడ్డి, జోస్నా, గోనుగుంట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షతలు పంపిణీ



డాక్టర్ హరిణికి అక్షతలను అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

సంతనూతలపాడు, జనవరి 5: అయోధ్య అక్షతలను వాసవిక్లబ్ ప్రతినిధులు శుక్రవారం సంతనూతలపాడులో పలు కార్యాలయాల్లో శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ ప్రతినిధులు వి.శేషారావు, టి.సురేష్, వీఎన్.ప్రసాద్, జీఎల్.ప్రసాదరావు, బి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమరోత్సాహంలో తమ్ముళ్లు

- కనిగిరి సభకు భారీగా తరలిన టీడీపీ కార్యకర్తలు
- వాహనశ్రేణులను ప్రారంభించిన నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు



గిద్దలూరు నియోజకవర్గ వాహనశ్రేణిని ప్రారంభిస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు, జనవరి 5 : టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కనిగిరిలో పాల్గొన్న ఎన్నికల శంఖారావం సభకు గిద్దలూరు నియోజకవర్గం నుంచి టీడీపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు 400కు పైగా వాహనాల్లో తరలివెళ్లారు. గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, బేస్తవారపేట, కంభం, అర్ధవీడు మండలాల నుంచి భారీ సంఖ్యలో తొలుత సలకలవీడు కళాశాల వద్దకు చేరుకున్నారు. అక్కడ భోజనాలు ముగించుకుని కనిగిరి బయలుదేరి వెళ్లారు. 400 వాహనాల కాన్వాయిని టీడీపీ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డి ప్రారంభించి పార్టీ శ్రేణులతో కలిసి కనిగిరి తరలివెళ్లారు.

శంఖారావానికి టీడీపీ శ్రేణులు

రాచర్ల : కనిగిరిలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాడు నేతృత్వం జరిగిన ఎన్నికల శంఖారావం కార్యక్రమానికి శుక్రవారం మండలంలోని టీడీపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షులు కె.యోగానంద్ ఆధ్వర్యంలో దాదాపు 200 మంది నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వెంట బయలుదేరారు. యోగా నంద్ 50 వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ తాహర్‌బాషా, సనావుల్లాఖాన్, జీవన్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, శ్రీనివాసులు, జనసేన నాయకులు అలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కూడా కార్యకర్తలు బయలుదేరారు.

పెద్ద దోర్నాల : టీడీపీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కనిగిరిలో శుక్రవారం నిర్వహిస్తున్న శంఖారావం సభకు టీడీపీ మండల నాయకులు భారీ సంఖ్యల్లో తరలివెళ్లారు. టీడీపీ మండల నాయకులు 30 వాహనాల్లో తరలి వెళ్లారు. దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, షేక్ సమ్మద్ భాష, దేసు నాగేంద్రబాబు, చంటి, చల్లా వెంకటేశ్వర్లు, షేక్ ఇస్మాయిల్, షేక్ భాష, ఎలకపాటి చెంచయ్య, బట్టు సుధాకర్‌రెడ్డి, షేక్ రఫీ, పఠాన్‌ఖాన్, షేక్ మౌలాలి తదితరులు తరలివెళ్లారు.

త్రిపురాంతకం : కనిగిరిలో శుక్రవారం నిర్వహించిన చంద్రబాబునాయుడు టీడీపీ సమర శంఖారావం సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి సుమారు 50 వాహనాలలో టీడీపీ శ్రేణులు టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో తరరలివెళ్లారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వలరాజు, మాజీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరెడ్డి, నాయకులు డి.చలమయ్య, వి.ఆంజనేయులు, కె.కొండలు, ఎం.అల్లూరిరెడ్డి, ఏ.నాసరరెడ్డి, సునీల్, చంటి, కోటయ్య, పిచ్చయ్య పాల్గొన్నారు.





వై.పాలెం కార్యకర్తల వాహన శ్రేణిని ప్రారంభిస్తున్న ఎరిక్షన్‌బాబు, పొదిలి నుంచి తరలివెళుతున్న కార్యకర్తలు

ఎర్రగొండపాలెం : కనిగిరిలో జరిగిన టీడీపీ ఎన్నికల సమర శంఖారావం సభలో పాల్గొనేందుకు శుక్రవారం ఎర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేలాదిమంది ప్రైవేటు వాహనాల్లో తరలివెళ్లారు. ముందుగా నియోజకవర్గంలోని ఐదుమండలాల నుంచి నాయకులు పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు వద్ద చేరారు. ఆ పార్టీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు జెండా ఊపి వాహనశ్రేణిని ప్రారంభించారు. ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల నుంచి వెళ్లే వాహనాలకు ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ పరిశీలకులు వేముల కొండ శ్రీనివాసగౌడ్ టీడీపీ జెండా ఊపి ప్రారంభించారు. 'సైకోపోవాలి, సైకిల్ రావాలి' అంటూ టీడీపీ నాయకులు కార్యకర్తలు నినాదాలు చేస్తూ ప్రదర్శనగా వెళ్లారు. ఐదు మండలాల టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, పయ్యావుల ప్రసాదరావు, యేర్వ మల్లిఖార్జునరెడ్డి, మేకల వలరాజు, మెట్టు శ్రీనివాసరెడ్డిలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పొదిలి : పొదిలి మండలం నుంచి కనిగిరిలో జరుగుతున్న 'రా కదలిరా శంఖారావ' సభకు పొదిలి నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాదర్శి వరికుంట్ల అనీల్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కాటూరి పెదబాబుల ఆధ్వర్యంలో మండలం నుండి అత్యధిక సంఖ్యలో కార్యకర్తలు, మహిళలు శంఖారావ సభకు తరలివెళ్లారు.

అవీ..ఇవీ..

వృద్ధులకు అందని పింఛన్లు

రాచర్ల, జనవరి 5 : ప్రభుత్వం వృద్ధులకు వికలాంగులకు అందజేసే సామాజిక పింఛన్లు జనవరి 1వ తేది నుంచి రూ.3 వేలు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే జనవరి 1న రూ.3వేలు వస్తాయని ఆశతో ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు నేటికీ పింఛన్ అందలేదు. రాచర్ల మండలంలో 5వేల మంది లబ్ధిదారులుండగా, వలంటీర్లకు నగదు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఎంపీడీవో కవితాచౌదరిని వివరణ కోరగా పింఛన్లు ఆలస్యమైన మాట వాస్తవమేనని, రెండు రోజుల్లో అందజేస్తామన్నారు.

ఆలయాల్లో సబ్ కలెక్టర్ ప్రత్యేక పూజలు



ఆలయ ప్రదక్షిణలు చేస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా

త్రిపురాంతకం, జనవరి 5: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరీదేవి అమ్మవార్ల ఆలయాల్లో మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రదక్షణల అనంతరం స్వామివారికి మహాన్యాస పూర్వకాభిషేకం, చినమస్తాదేవికి పూజలు, బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారికి అర్చనలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు సబ్ కలెక్టర్‌ను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, తహసీల్దారు వి.కిరణ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దదోర్నాల, జనవరి 5: కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు గండి వీరారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిన్నగుడిపాడు గ్రామంలో భారత్‌వికాస్ సంకల్ప యాత్ర శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర పథకాలైన ముద్రాలోన్, రైతు పెట్టుబడి సాయం, బీమాసౌకర్యం, రైతు పింఛను పథకం వంటి వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్‌రావు, ఎంపీడీవో నాసర్‌రెడ్డి, ఎంఈవో మస్తాన్‌నాయక్, ఏవో జవహర్‌లాల్‌నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భ్రమరాంబికాదేవి, ఏపీవో అన్నపూర్ణ, ఏపీఎం పోలయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీడీవో

మార్కాపురం రూరల్ జనవరి 5: ఆరోగ్యం సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో తోట.చందన కోరారు. మండలంలోని భూపతిపల్లి గ్రామంలో కార్యక్రమాన్ని శుక్రవారం అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ శిబిరంలో గ్రామస్థులకు పలు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు సోనీ, లక్ష్మీ కళ్యాణి, శార్వాణి, హెల్త్ అసిస్టెంట్ శివకుమారి, గ్రామ సర్పంచ్ కోటేశ్వరి, గ్రామస్తులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

దర్శి, జనవరి 5 : యువత క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలు అందుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆకాంక్షించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం సాయంత్రం రాష్ట్రస్థాయి పురుషుల, మహిళల కబడ్డీ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ దర్శి పట్టణంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు పురుషులతో పాటు మహిళలకు ప్రత్యేకంగా నిర్వహించటం ఆనందదాయకమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. పోటీలు ఏర్పాటు చేసిన దర్శిలో మాజీ జర్నలిస్టు శీలం శ్రీనివాసరెడ్డి, దర్శి నగర పంచాయతీ వైస్ చైర్మెన్ స్టీవెన్‌ను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్‌ప్రధాన కార్యదర్శి యలమంచలి శ్రీకాంత్, రాష్ట్ర ట్రెజరర్ ఎం. సుబ్బరాజు, జిల్లా అధ్యక్షుడు ఎన్.అర్జునరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, డాక్టర్ ఎస్ఎం బాష తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సీఎం హామీ

- ఎమ్మెల్యే అన్నా రాంబాబు

గిద్దలూరు టౌన్, జనవరి 5 : గిద్దలూరు నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సీఎంను కలిసి సమస్యలను ప్రస్తావించారు. కంభం, పూసలపాడు, చింతలపల్లి ప్రాంతాలలో లో-వోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉన్నందున త్వరితగతిన విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలన్నారు. అలాగే అర్ధవీడు-రంగాపురం రోడ్డు పూర్తి కోసం, సగిలేరు ముంపు నివారణ కోసం, వెలిగొండ జలాలు తదితర సమస్యలను పరిష్కరించాలని సీఎంను కోరినట్లు తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే రాంబాబు తెలిపారు.

నేడు పూర్వ విద్యార్థుల సమావేశం

గిద్దలూరు, జనవరి 5 : పట్టణంలోని విఠా సుబ్బరత్నం కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం ఉదయం 9 గంటలకు 1983-85-88 బ్యాచుకు చెందిన శ్రీవివేకానంద ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పూర్వవిద్యార్థుల చతుర్థ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి ఆయా బ్యాచుల పూర్వ విద్యార్థులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని పూర్వవిద్యార్థుల సంఘం ప్రతినిధులు హనుమంతరెడ్డి, తులసిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



కేసు వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ

మార్కాపురం రూరల్, జనవరి 5: మండలంలోని రాయవరం గ్రామ పరిధిలోని జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ పలకల క్వారీలో గుర్తు తెలి యని వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఇటీవల నూతనంగా ప్రారంభించిన వాహన తనిఖీ కార్యాలయం సమీపంలోనే ఈ క్వారీ ఉంది. క్వారీలో సుమారు 200 అడుగుల లోతున మృతదేహం ఆచూకీని పోలీసులు గుర్తించారు. వారం క్రితం మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సంఘటన స్థలానికి డీఎస్పీ వీరరాఘవరెడ్డి, ట్రైనీ డీఎస్పీ సెహనాజ్ అహ్మద్, సీఐ ఆవుల వెంకటేశ్వర్లు పరిశీలించారు. మృతదేహం ఉన్న క్వారీ వద్ద మద్యం సీసాలు, వాటర్ బాటిళ్లు ఉన్నాయి. దీంతో ప్రమాదవశాత్తు జరిగిందా..? ఎవరైనా హత్య చేసి పడేశారా..? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ఎక్సకవేటర్ సహాయంతో క్వారీలోని మృతదేహాన్ని బయటకు తీశారు. శవపరీక్ష నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించారు.

జన్‌మన్ పథకంపై అవగాహన

ఎర్రగొండపాలెం, జనవరి 5 : ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో కేంద్రప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలకు చెంచుగిరిజనులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. మండలంలోని తిరుమలగిరికాలనీ, పాలుట్ల, రేగులపల్లిలోని చెంచుగిరిజనులకు శుక్రవారం ప్రధానమంత్రి జన్‌మన్ పథకంపై అవగాహన కల్పించారు. పథకాలకు దరఖాస్తు చేసే లబ్ధిదారులు ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంటు, కులధృవీకరణపత్రం, జాబ్‌కార్డు, రేషన్ కార్డు జతచేయాలని తెలిపారు. రేగులపల్లిలో ఎంపీడీవో నాగేశ్వరప్రసాదు, ఎస్వో కే.నాగేశ్వరరావు, మొగుళ్ళపల్లి సర్పసర్పంచి కర్నాటి వెంకటేశ్వర్‌రెడ్డి, పాలుట్ల గిరిజన గూడెంలో ఎంఈ వో 2 మల్లికార్జుననాయక్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న బాజీ

దర్శి, జనవరి 5 : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దర్శి పట్టణానికి చెందిన షేక్ బాజి అనే యువకుడు గురువారం అర్ధరాత్రి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే పోలీసులు గుర్తించి అతన్ని ఆసుపత్రికి తరలించారు. ఇందుకు సంబంధించిన స్టేషన్‌లో జరిగిన విషయాలను దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ శుక్రవారం రాత్రి విలేకరులకు తెలిపారు. దర్శి మండలం తిమ్మాయిపాలేనికి చెందిన నారాయణరెడ్డి అనే రైతు పొలంలో నీటిపైపులను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. పైపులు అపహరణకు గురికావడానికి ముందు రోజు ఆ పొలంలో పట్టణానికి చెందిన షేక్‌బాజీ అనే యువకుడు మోటర్‌బైక్‌తో ఉండటాన్ని రైతు గమనించాడు. ఇక్కడ ఎందుకు ఉన్నావని రైతు ప్రశ్నించడంతో బాజీ బండిని వదిలేసి వెళ్లిపోయాడు. ఈ తరుణంలో పొలంలో నీటి పైపులు అపహరణకు గురవడంతో బాజీయే అపహరించి ఉంటాడని రైతు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు పొలంలో ఉన్న బాజీ మోటార్ బైక్‌ను స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఈవిషయంపై పోలీసులు విచారించేందుకు బాజీని గురువారం రాత్రి స్టేషన్‌కు పిలిచారు. ఆ యువకుడిపై గతంలో ఒక యువతిని ప్రేమించి మోసం చేశాడని కేసు నమోదై ఉంది. ఆ కేసు కూడా విచారణ జరుగుతోంది. పోలీస్‌స్టేషన్‌లోకి వచ్చిన బాజీ తన బైక్‌ను ఇవ్వమని పోలీసులతో వాగ్వివాదానికి దిగాడు. ఇప్పుడు కాదు రేపు మాట్లాడదామని పోలీసులు చెప్పిపంపించారు. వెంటనే బయటకు వెళ్లిన బాజీ మళ్లీ తన వెంట పెట్రోలుతో వచ్చి స్టేషన్‌లో గొడవకు దిగి ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పు అంటించుకున్నాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని మంటలు ఆర్పి ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం బాధితుడిని గుంటూరు వైద్యశాలకు తరలించారని డీఎస్పీ అశోక్‌వర్ధన్ రెడ్డి వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

బైకును లారీ ఢీకొనడంతో ఘటన

త్రిపురాంతకం, జనవరి 5: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని గుట్లఉమ్మడివరం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం కొత్తచెరువుకొమ్ముపాలేనికి చెందిన పసుమర్తి వెంకటరమణ(69) అనే వృద్ధురాలు తన కుమారుడు అంజయ్య కలిసి మండలంలోని ఒడ్డుపాలెంలో బంధువుల ఇంటికి వెళుతోంది. ఈ నేపథ్యంలో గుట్లఉమ్మడివరం వంతెన సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ బైకును ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఆమె అక్కడిక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం కోసం వైపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దర్శి అభ్యర్థి తేలిన తర్వాతే భవిష్యత్ కార్యాచరణ

సమావేశంలో ఎమ్మెల్యే మద్దిశెట్టి అనుచరులు



మారెళ్లలోని ఓ తోటలో సమావేశమైన ఎమ్మెల్యే వర్గీయులు

ముండ్లమూరు, జనవరి 5 : వైసీపీ దర్శి అభ్యర్థిని అధికారికంగా ప్రకటించిన తరువాతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ వర్గీయుడైన ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మానందరెడ్డి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన తోటలో సమావేశం జరిగింది. రెండు వారాల నుంచి దర్శి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాదరెడ్డికి టిక్కెట్ ఖరారవుతున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మానందరెడ్డి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ వర్గీయుడు కావటంతో మద్దిశెట్టి వర్గీయులంతా కలిసి సమావేశం కావటం విశేషాన్ని సంతరించుకుంది. అయితే ఇటీవల మాజీ ఎమ్మెల్యే శివ ప్రసాదరెడ్డి నూతన సంవత్సరం సందర్భంగా కొందరిని వేడుకలకు రావాలని ఆహ్వానించటంతో అప్రమత్తమైన ఎంపీపీ వర్గీయులందరూ కలిసి వైసీపీ అధిష్టానం అధికారికంగా అభ్యర్థిని ప్రకటిస్తే తామంతా కూర్చొని ఒకే తాటిపై వెళ్లేందుకు సమావేశంలో తీర్మానం చేసుకున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే వేణుగోపాల్ నిర్ణయం ఎలా ఉంటుందో ఆయనకు అనుగుణంగానే నిర్ణయం తీసుకోవాలా?, లేక అధిష్టానం ప్రకటించిన అభ్యర్థికి మద్దతు ఇవ్వాలా? అనే విషయంలో సందిగ్ధంలో పడి సమావేశం అయినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ సమావేశానికి దాదాపు 300 మందికి పైగానే హాజరుకావటం విశేషం. ఈ సమావేశంలో వైసీపీ సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మానందరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ మేడికొండ జయంతి, సర్పంచ్‌లు వేముల శ్రీనివాసులు, చొప్పరపు వెంకటేశ్వర్లు, జనమాల పిచ్చయ్య, నలమోలు వెంకటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ దాసరి ఏలియా, సొసైటీ మాజీ అధ్యక్షుడు మొదుళ్ళ వెంకట సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ రామా నాయక్, అన్నపురెడ్డి భిక్షాలరెడ్డి, తేలుకుట్ల బ్రహ్మం తదితరులు ఉన్నారు.

నకిలీ మిరప విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న రైతులు

మార్కాపురం రూరల్, జనవరి 5: నకిలీ మిరప విత్తనాలను సాగుచేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.., గత నెల 21న సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి సబ్‌కలెక్టర్‌కు సమస్యను వివరించినా తమకు నష్టపరిహారం అందలేదన్నారు. అధికారులు పంటలను తనిఖీ చేసి వదిలేస్తున్నారన్నారు. లక్షల రూపాయలు అప్పులు చేసి పంటలను సాగుచేసి తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అధికారులు నష్టపరిహారం అందించడంలో జాప్యం జరుగు తుండడంతో పెద్దారవీడు మండలం బోడిరెడ్డిపల్లి గ్రామంలో మిరప పంటను సాగు చేసిన రైతు దండ బోడిరెడ్డి మనస్థాపంతో అకస్మాత్తుగా మృతి చెందాడని వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందించి సమస్యను వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రైతుసంఘం నాయకులు గాలి వెంకటరామిరెడ్డి, బొగ్గు రామిరెడ్డి, నష్టపోయిన రైతులు బద్దిగం చిన్న వెంకటరెడ్డి, నల్లబోతుల వెంకటేశ్వర్లు, కనకం బాలకోటయ్యలతో పాటు 30 మంది రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పొదిలిలో భిక్షాటన చేస్తున్న కార్మికులు

గిద్దలూరు, జనవరి 5 : న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ నాయకులు తహసీల్దార్ సీతారామయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస పనికి కనీస వేతనం ఇవ్వాలన్న నియమ నిబంధనలను తుంగలోకి తొక్కడం శోచనీయమని ధ్వజమెత్తారు. సమ్మెతో పట్టణంలో చెత్త పోగుపడుతూ ప్రజలు అనారోగ్యానికి గురవుతున్న దృష్ట్యా సమస్యను పరిష్కరించి సమ్మెను విరమింప జేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ ఉపాధ్యక్షులు టీవీ.రామాంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు ముప్పూరి శ్రీనివాసులు, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు ఎ.సాయిచరణ్ పాల్గొన్నారు.

పొర్లు దండాలతో నిరసన

గిద్దలూరు : డిమాండ్ల పరిష్కారం కోసం నిరవధికంగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు శుక్రవారం పొర్లుదండాలతో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు పొర్లుదండాలు పెట్టి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కక్ష సాధింపు ధోరణిలు మానుకుని న్యాయమైన కోర్కెలను ఆమోదించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మురళి, నాగయ్య, సీఐటీయూ నాయకులు ఆవులయ్య, నరసింహులు డిమాండ్ చేశారు.

మార్కాపురం వన్‌టౌన్ : మున్సిపల్ అధికారులు ఇంజనీరింగ్ కార్మికులను పిలిచి భయభ్రాంతులకు గురిచేసేలా బెదిరంచడం తగదని సీఐటీయూ జిల్లా నాయకులు సోమయ్య అన్నా రు. మున్సిపల్ కార్మికుల సమ్మె శుక్రవారం కూడా కొనసాగింది. ప్రభుత్వం వెంటనే కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని సోమయ్య కోరారు. బీజేపీ నాయకులూ సమ్మెకు సంఘీ భావం తెలిపారు.

మున్సిపల్ కార్మికులు భిక్షాటన

పొదిలి : తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పొదిలి నగరపంచాయతీ కార్మికులు చేట్టిన నిరవధిక సమ్మె 12వరోజుకు చేరింది. శుక్రవారం పట్టణంలో కార్మికులు భిక్షాటన చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతరం కార్మికులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మో హన్‌రెడ్డి అధికారం చేతబట్టిన తరువాత నిరసన చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను కన్నెతి చూడలేదన్నారు. జగన్ తన వైఖరి మార్చు కోకపోతే తమకు ఒక్కచాన్స్ వస్తుందన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన



మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఎర్రగొండపాలెం, జనవరి 5 : జీతాలు పెంచాలని అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె 25వ రోజూ కొనసాగుతోంది. శుక్రవారం ఎర్రగొండపాలెంలోని ధర్నా శిబిరం వద్ద రాష్ట్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ, మోకాళ్లపై నిల్చుని కార్యకర్తలు నిరసన తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్‌వాడీలకు తెలంగాణా కంటే రూ.1000 అదనంగా జీతాలు పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మాటమార్చారన్నారు. అంగన్‌వాడీల సమ్మెపై ముఖ్యమంత్రి స్పందించక పోవడం దారుణమన్నారు. తమ డిమాండ్లు పరిష్క రించకపోతే తమ సత్తా ఏమిటో చూపిస్తా మన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్& హెల్పర్స్ యూనియన్ నాయకులు జి.మల్లేశ్వరి, పి.సుబాషిణి, నాగరాజకుమారి, రామసుబ్బమ్మ, అరుణ,సునీత, తలపాటి సుబ్బమ్మ, సుజాత, విజయలక్ష్మి, రూత్‌మేరి, రామకుమారి, తిరుపాలమ్మ, పాల్గొన్నారు. మూడు మండలాల నుంచి 250 మందికి పైగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

గిద్దలూరు : అంగన్‌వాడీ కార్యకర్తలు గిద్దలూరులో చేపట్టిన నిరసనలో కార్యక్రమంలో అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు స్వర్ణకుమారి, మున్నా, తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 5: తమ సమస్యలు పరిష్కరించాలని స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె కొనసాఉగోంది. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి అందె నాసరయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీలు తన న్యాయబద్ధమైన డిమాం డ్‌లు నెరవేర్చాలని నిరసనలు తెలుపుతున్న ప్రభుత్వం నిర్లక్ష్యం చేయటం తగదన్నారు.

కంభం : కంభంలోని కందులాపురం కూడలి వద్ద జరుగుతున్న దీక్షలో ఏఐటీయూసీ అధ్యక్షులు షేక్ మహమ్మద్ ఇబ్రహీం, సీపీఎం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బారావు, షేక్ అన్వనర్ బాషా, ఏఐటీయూసీ అధ్యక్షురాలు సరళ, ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి, శ్రీదేవి, ఆదిలక్ష్మి, శారద, సుబ్బమ్మ, మాధవి, తిరుపతమ్మ, పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు విస్మరించారు

గ్రామసభలో ఆరోపణలు

దొనకొండ, జనవరి 5 : దొనకొండ గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు కొన్ని నెలలుగా సక్రమంగా జరగకపోవడంతో వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసనలు, దోమల బెడదతో ప్రజలు అల్లాడిపోతున్నారని ఏఎంసీ దర్శి డైరెక్టర్ షేక్ రసూల్‌బాష ఆరోపించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక గ్రామ సభను సర్పంచ్ ఆరోగ్యం బాగాలేక హాజరుకాకపోవటంతో ఉప సర్పంచ్ పఠాన్ ఇమ్రాన్‌ఖాన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రసూల్ మాట్లాడుతూ గ్రామంలో కోతుల సమస్య తీవ్రంగా ఉందన్నారు. వాటి దాడికి గురై ఇటీవల అనేకమంది గాయాలపాలయ్యారన్నారు. గ్రామంలో బ్లీచింగ్ చల్లించటం, ఫాగింగ్ చేయకపోవటంతో దోమలు విపరీతమయ్యాయని తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ గుట్టమీదపల్లి, అడ్డరోడ్డులోని ఎస్టీ కాలనీలో ఎనిమిదేళ్లుగా తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకు స్పందించిన కార్యదర్శి కృష్ణమూర్తి పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా చేయిస్తామని, కోతులను పట్టించేందుకు అటవీశాఖ నుంచి అనుమతులు రాగానే కోతులను నిర్మూలిస్తామన్నారు. ఎంఈవో సాంబశివరావు, హెచ్ఎం వీవీ రామాంజనేయులు బాలికా విద్య ప్రాముఖ్యతను వివరించారు. గ్రామ కార్యదర్శి పోట్ల కృష్ణమూర్తి, మండల కోప్షన్ సభ్యుడు షేక్ గఫూర్, ఎంపీటీసీ గుంటు అమ్మాజీ, అజయ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కనిగిరిని క్షామం నుంచి కాపాడండి !



దర్శి నుంచి చంద్రబాబు సభకు భారీ సంఖ్యలో తరలివెళ్తున్న వాహనాలు

'బాబు' సభకు భారీగా తరలిన తమ్ముళ్లు

దర్శి, జనవరి 5 : టీడీపీ అధినేత చంద్రబాబు శంఖారావం సభకు దర్శి నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. జనసేన పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు కూడా చంద్రబాబు సభకు అధికసంఖ్యలో వెళ్లారు. దర్శి నియోజకవర్గం నుంచి సుమారు 300 పైగా వాహనాల్లో తరలివెళ్లినట్లు సమాచారం. దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకుడు గోరంట్ల రవికుమార్ అన్ని మండలాల నుంచి చంద్రబాబు సభకు వెళ్లేందుకు వీలుగా వాహనాలు ఏర్పాటు చేశారు. దర్శి-పొదిలి మధ్యలో మూసీ నది వద్ద అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ చంద్రబాబు సభకు వెళ్లేందుకు వీలుగా వాహనాలు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులు సభకు జనసమీకరణలో సమన్వయం చేసి ప్రణాళిక సిద్ధం చేశారు. అన్ని గ్రామాలకు వాహనాలు తరలివెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. ఈ సభకు నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మండలపార్టీ అధ్యక్షులు చిట్టే వెంకటేశ్వర్లు, నాగులపాటి శివకోటేశ్వరరావు, నెమలయ్య, బొమ్మిరెడ్డి ఒబుల్‌రెడ్డి, కూరపాటి శ్రీనివాసరావు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అశేషంగా తరలివెళ్లారు.



దొనకొండ నుంచి శంఖారావం సభకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు

దొనకొండ నుంచి భారీగా తరలిన టీడీపీ శ్రేణులు

దొనకొండ : తెలుగుదేశం అధినేత చంద్రబాబు కనిగిరిలో చేపట్టిన శంఖారావం బహిరంగ సభకు టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని అన్నీ గ్రామాలనుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో తరలివెళ్లారు. టీడీపీ నాయకులు మోడి వెంకటేశ్వర్లు, శృంగారపు రామసుబ్బారెడ్డి, వల్లపునేని వెంకటస్వామి, కుందుర్తి లక్ష్మణ్, యరగొర్ల బసవయ్య, విప్పర్ల లక్ష్మీరావు తదితరుల నేతృత్వంలో అన్ని గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాల్లో దొనకొండకు చేరి ర్యాలీగా కనిగిరి వెళ్లారు. రామాపురం మాజీ సర్పంచ్ కామేపల్లి నారాయణమ్మ, చెంచయ్య ఆధ్వర్యంలో పలు గ్రామాలకు దాదాపు 18 వాహనాలు ఏర్పాటు చేసి కార్యకర్తలను కనిగిరి తరలించారు.

కురిచేడు నుంచి..

కురిచేడు : కనిగిరిలో బహిరంగ సభకు కురిచేడు మండలం నుంచి భారీ సంఖ్యలో తెలుగు తమ్ముళ్ళు వాహనాలలో తరలి వెళ్లారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి వాహనాల్లో, యువకులు ద్విచక్రవాహనాలపై వెళ్ళి తమ అభిమానం చాటుకున్నారు. దారి పొడవునా తెలుగుదేశానికి, నారా చంద్రబాబు నాయుడుకు జేజేలు పలుకుతూ వెళ్లారు.

ముండ్లమూరు నుంచి..

ముండ్లమూరు : మండలంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వెళ్ళారు. దర్శి నియోజక వర్గ టీడీపీ నాయకులు, శ్రీ హర్షిణీ విద్యా సంస్థల అధినేత గోరంట్ల రవి కుమార్ ఆధ్వర్యంలో వంద కార్లు, ఆటోలలో తరలి వెళ్ళారు. మాజీ ఎంపీపీ మండలపు వెంకటరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ సభ్యులు కొక్కెర నాగరాజు, వరగాని పౌలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, భారీ సంఖ్యలో శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్ళారు.

తాళ్లూరు నుంచి..

తాళ్లూరు: కనిగిరిలో జరుగుతున్న రా..కదిలిరా కార్యక్రమానికి తాళ్లూరు మండలం నుంచి 50 వాహనాల్లో కార్యకర్తలు, టీడీపీ శ్రేణులు శుక్రవారం అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకులు గోరంట్ల రవికుమార్ (హర్షిణి విద్యాసంస్థల అధినేత) ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి వేలాది మంది కార్యకర్తలు తరలి వెళ్లారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బి.సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షులు బి.ఓబుల్‌రెడ్డి, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శులు దర్శినియోజకవర్గ నేతలు, పలుగ్రామాలకు చెందిన టీడీపీ శ్రేణులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పామూరు నుంచి

పామూరు : విజయ శంఖారావం బహిరంగ సభకు పామూరు నుంచి టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు ముందుగా స్థానిక పార్టీ కార్యాలయం నుంచి వాహనాలకు టీడీపీ మండల కమిటీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు జండా ఊపి సాగనంపారు. ఈ కార్యక్రమంలో 150కు పైగా వాహనాల్లో టీడీపీ, జనసేన శ్రేణులు కనిగిరికి తరళివెళ్లినట్లు ఆయన తెలిపారు.

పీసీపల్లి నుంచి

పీసీపల్లి : శంఖారావం సభకు మండలంలోని టీడీపీ, జనసేన శ్రేణులు భారీగా తరలివెళ్లారు. మండలంలోని 18 పంచాయతీల నుంచి టీడీపీ, జనసేన శ్రేణులతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా కనిగిరి వెళ్లి బహిరంగసభలో పాల్గొన్నారు.

చంద్రబాబుకు సమస్యలు నివేదించిన డాక్టర్ ఉగ్ర



శంఖారావం సభలో మాట్లాడుతున్న ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి, జనవరి 5: కనిగిరిని క్షామం నుంచి కాపాడాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకు విన్నవించారు. రాష్ట్రంలో ఎన్నికల సమర శంఖారావం తొలిసభ కనిగిరిలోని కొత్తూరు సమీపంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర కనిగిరి ప్రాంతంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చంద్రబాబు ఎదుట నివేదించారు. కనిగిరిలో ఉపాధి లేక పరాయి ప్రాంతాలకు వెళ్ళి వలస జీవనం గడుపుతున్నారన్నారు. అలాగే కనిగిరి ప్రాంతానికి చెందిన ప్రజలు ఫ్లోరైడ్‌తో ఇప్పటికీ పీడితులుగా ఉన్నారన్నారు. సాగర్‌నీటి జలాలు ఇంటింటికి కొళాయిల ద్వారా ఇస్తామని ఎన్నికలకు ముందు హామీలిచ్చిన అధికారపార్టీ నేతలు పట్టించుకోలేదన్నారు. నడికుడి - శ్రీకాళహస్తి రైలుమార్గం వైసీపీ పాలనలో రైలుమార్గం ఊసే లేదని చంద్రబాబుకు విన్నవించారు. కనిగిరి ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి వలసలకు అడ్డుకట్ట వేయాలని చంద్రబాబును డాక్టర్ ఉగ్ర అభ్యర్థించారు. అలాగే వెలుగొండ పనులు పూర్తి చేయటంతో పాటు ఆ జలాలు కనిగిరి ప్రాంతానికి మళ్ళించే చర్యలు తీసుకోవాలని కోరారు. యువగళం పాదయాత్ర సందర్భంగా యువనేత లోకేష్ వచ్చినప్పుడు కనిగిరిలో ఫార్మా హబ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, అది నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు అదేవిధంగా మార్కాపురంను పశ్చిమ ప్రాంతానికి జిల్లాగా చేయాలని కోరారు.

టీడీపీ మార్కాపురం ఇన్‌చార్జి కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక వెలుగొండ పూర్తి చేసి తాగు,సాగు నీరు ఇస్తామని చెప్పిన సీఎం ఇచ్చిన మాట తప్పారన్నారు. మార్కాపురంను జిల్లాగా ప్రకటిస్తే పశ్చిమ ప్రాంతంలోని 5 నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు.



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఉగ్ర తనయుడు భరత్‌సింహారెడ్డి



కనిగిరి శంఖారావం సభకు భారీగా హాజరైన ప్రజలు

ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజి మాట్లాడుతూ టీడీపీ, జనసేన పొత్తుతో జగన్‌కు వెన్నులో వణుకు పుట్టి అభద్రతాభావంతో రెండు పార్టీల నడుమ చిచ్చు పెట్టాలని చూస్తున్నాడని ఆరోపించారు. జనసేన రాష్ట్ర నాయకులు ఆమంచి స్వాములు మాట్లాడుతూ జనసేన- టీడీపీ పొత్తు రాష్ట్రం ఉజ్వల భవిష్యత్తుకు నాంది అన్నారు. ఈ పొత్తు చిరకాలం నిలవాలని ఆకాంక్షించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్ మాట్లాడుతూ పొత్తుతో జగన్‌రెడ్డికి ఫ్యాంటు తడుస్తుందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో కొండపి ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామి, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమార్, రాంభూపాల్‌రెడ్డి, దామచర్ల సత్య, దామచర్ల జనార్దన్, కొండయ్య, నారపశెట్టి పాపారావు,పోతుల రామారావుతో పాటు పలువురు ముఖ్యనేతలు ప్రసంగించారు.

చంద్రబాబు సభలో ప్రత్యేక ఆకర్షణగా తిరుపతయ్య

పామూరు, జనవరి 5 : కనిగిరి వెలుగొండ సాధన ప్రాంగణంలో శుక్రవారం జరిగిన చంద్రబాబు ఎన్నికల విజయ శంఖారావ బహిరంగ సభలో టీడీపీ జండాతో పామూరు మండలం తూర్పుకోడిగుడ్లపాడు గ్రామానికి చెందిన అభినవ గాంధీ వేషధారణతో తిరుపతయ్య ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చంద్రబాబు, ఉగ్రలపై ఉన్న అభిమానంతో తాను తన ద్విచక్రవాహనంపై గాంధీ వేషధారణతో కనిగిరికి వచ్చానని తెలిపారు. బహిరంగ సభలో తనను పలువురు అభిమానంతో పలకరించారని తెలిపారు.



గాంధీ వేషధారణలో తిరుపతయ్య

పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరిక

కనిగిరి, జనవరి 5: కనిగిరి నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన ముఖ్య నేతలు వైసీపీని వీడి చంద్రబాబు సమక్షంలో, డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో తెలుగు దేశం పార్టీలో చేరారు. నియోజకవర్గంలోని వెలిగండ్ల మండలానికి చెందిన వైసీపీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు టీడీపీలో శుక్రవారం చంద్రబాబు సమర శంఖారావం సభలో ముగింపు సమయంలో చేరారు. ఈ సందర్భంగా వారు చంద్రబాబు ఎదుట తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తామన్నారు. సీఎస్ పురం మండలానికి చెందిన మాజీ ఐఏఎస్ అధికారి పిడుగు బాబూరావు, వాకా సత్యనారాయణ, కనిగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ చినమస్తాన్‌లు డాక్టర్ ఉగ్ర ఆధ్వర్యంలో పార్టీలో చేరగా, చంద్రబాబు వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అదేవిధంగా వెలిగండ్ల మండలానికి చెందిన ఇర్లపాడు, రామగోపాలపురం సర్పంచ్‌లు బొబ్బారమణారెడ్డి, నారాయణరెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మల్లెబోయిన మీరాకుమారి, మాజీ ఎంపీటీసీ చాగం నరసమ్మ, ఒంగోలు జ్యోతి, ఎలికా పద్మావతితో పాటు మరికొంతమంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. హనుమంతునిపాడు మండలానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త భైనబోయిన వెంకటేశ్వర్లుయాదవ్, హెచ్‌ఎంపాడు వైసీపీ ఎంపీటీసీ ఉడుముల సుబ్బారెడ్డి, పెదగొల్లపల్లి వైసీపీ కన్వీనర్ సానికొమ్ము వెలుగొండారెడ్డి, వీ వెంకటస్వామి, కత్తి అబ్రహంలతో పాటు 50 కుటుంబాలకు వారు వైసీపీని వీడి ఆయా మండలపార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కనిగిరి క్లస్టర్ ఇంచార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, మండలపార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులరెడ్డి, రాచమల్ల శ్రీనివాసులరెడ్డి, నారపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బాలు ఓబులురెడ్డి, సైకం మాలకొండారెడ్డి, వీవీఆర్ మనోహరరావు, తమ్మినేని వెంకటరెడ్డి, వివిధ మండలపార్టీ అధ్యక్షులు, గ్రామపార్టీ అధ్యక్షులు, బూత్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన అనంతరం మండల నేతలతో సర్పంచ్

టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచ్

పీసీపల్లి : మండంలోని పెదయిర్లపాడు గ్రామ సర్పంచ్ పోలం లక్ష్మీదేవితోపాటు వార్డు మెంబర్లతో కలిసి టీడీపీ కనిగిరి ఇన్‌చార్జ్ ముక్కు ఉగ్ర నర సింహారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. గత పంచాయతీ ఎన్నికల్లో వైసీపీ తరుపున పోటీ చేసి లక్ష్మీదేవి గెలుపొందారు. అయితే అప్పటి నుంచి వైసీపీలో సరైన గౌరవం లేకపోవడంతో పాటు ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నామన్నామని ఆవేదన చెందామన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని, అందుకే టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. వారిని చంద్రబాబునాయుడు సాదరంగా ఆహ్వానించి టీడీపీ కండువాలుకప్పి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో వార్డు సభ్యులు అంకమ్మ, రాజేశ్వరి, పద్మావతి, మల్లిఖార్జున్‌తోపాటు మరో 60 కుటుంబాలకు చెందిన వారు చేరారు.



జనసేన పార్టీ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఎడ్ల పోటీలకు చేసిన ఏర్పాట్లు

జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలకు ఏర్పాట్లు పూర్తి

దర్శి, జనవరి 5 : జనసేన పార్టీ ఆధ్వర్యంలో దర్శిలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో శనివారం నుంచి నాలుగు రోజులు పాటు ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా శనివారం నాలుగు పళ్ళ ఎడ్ల బలప్రదర్శన పోటీలు, ఆదివారం ఆరు పళ్ళ ఎడ్ల బలప్రదర్శన పోటీలు, సోమవారం న్యూ క్యాటగిరి ఎడ్ల బలప్రదర్శన పోటీలు, మంగళవారం సీనియర్ క్యాటగిరి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన సీనియర్ కేటగిరి ఎడ్లకు ప్రథమ బహుమతిగా మహేంద్ర 475 ట్రాక్టర్, న్యూ క్యాటగిరి ఎడ్ల బలప్రదర్శనలో గెలుపొందిన ఎడ్లకు బుల్లెట్ మోటార్‌సైకిల్ మిగిలిన క్యాటగిరీలకు నగదు బహుమతులు భారీ స్థాయిలో అందజేస్తున్నారు. అన్ని కేటగిరీలకు సుమారు రూ.30 లక్షల బహుమతులు అందజేస్తున్నారు. ఈ పోటీలకు ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి ఎడ్లు వస్తున్నట్లు గరికపాటి వెంకట్ తెలిపారు. సుమారు పదివేల మంది కూర్చుని చూసే వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. పోటీలు చూసేందుకు వచ్చిన అందరికీ భోజన వసతి కల్పిస్తున్నారు. టీడీపీ, జనసేన రాష్ట్ర స్థాయి నాయకులను పోటీలు తిలకించేందుకు గరికపాటి వెంకట్ స్వయంగా ఆహ్వానించటంతో అనేకమంది ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు హాజరవుతున్నట్లు సమాచారం.

పారిశుధ్య కార్మికుల ధర్నా



నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

దర్శి, జనవరి 5 : హామీలను అమలు పర్చనందుకు నిరసనగా చేపట్టిన ఆందోళనలో భాగంగా దర్శి నగర పంచాయతీ కార్మికులు రెండోరోజు స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం వీధుల్లో భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కె. హనుమంతరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌ఇచ్చిన హామీ మేరకు వేతనాలు రూ.26 వేలకు పెంచాలని, ఉద్యోగాలు రెగ్యులర్ చేసి భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ దర్శి ఇన్‌చార్జి మాడపాకుల రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాస రావు, దళిత ప్రజాసంఘాల నాయకులు ప్రేమ్‌కుమార్, రాచపూడి మోషే, వర్కర్స్ యూనియన్ నాయకులు ఇత్తడి ఇర్మియా, ప్రభాకర్, పుల్లయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల ధర్నా

దర్శి, జనవరి 5 : డిమాండ్ల సాధన కోసం చేస్తున్న ఆందోళనల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు 25వ రోజు శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా కొనసాగించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎంవైఎస్ జగన్‌ఇచ్చిన హామీలు అమలు చేయటంలో ఘోరంగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. అధికారుల ద్వారా బెదిరింపులకు పాల్పడటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్ళు అచ్చమాంబ, స్వప్న, మేరి, నాగమణి, జ్యోతి, బాలమ్మ, రత్నకుమారి, సీఐటీయూ నాయకులు నందు వెంకటేశ్వరరావు, టి. రంగారావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



విజేతలను అభినందిస్తున్న విద్యాసంస్థల అధినేత ఏవీ రమణారెడ్డి

జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో రాణించిన శ్రీ సరస్వతీ విద్యార్థులు

తాళ్లూరు, జనవరి 5: జాతీయస్థాయి క్రికెట్‌పోటీల్లో తాళ్లూరు శ్రీ సరస్వతీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు సీనియర్, జూనియర్ విభాగంలో ఆంధ్రాటీమ్ తరుపున ఉత్తమ ప్రతిభ కనపరిచి విజేతలుగా నిలిచారు. ఆంధ్రా రంజీ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో జరిగిన జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో శ్రీ సరస్వతీ హైస్కూల్‌కు చెందిన సీనియర్స్ విభాగంలో ఆంధ్రా తరుపున వినోద్, దేవేంద్ర, వినయ్, రాజేష్, నరసింహానాయుడు, అనిల్, సుధాకర్‌లు, జూనియర్స్ విభాగంలో ఆంధ్రా తరుపున మణీంద్ర, వివేక్, వెంకారెడ్డి,భరత్‌కుమార్, ప్రభాస్, కార్తిక్, సురేంద్ర, చందులు విజేతలుగా నిలిచారు. తమపాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో క్రికెట్ పోటీల్లో రాణించటం గర్వకారణంగా ఉందని క్రికెట్ విజేతలను శ్రీ సరస్వతీ విద్యాసంస్థల చైర్మన్ ఏవీరమణారెడ్డి, డైరెక్టర్స్ గణేశ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి,హెచ్‌ఎం వి.శ్రీరామమూర్తి అభినందించారు.

20 మద్యం సీసాలు పట్టివేత

ముండ్లమూరు, జనవరి 5 : మండలంలోని మక్కెనవారిపాలెంలో బెల్టు షాపుపై శుక్రవారం రాత్రి ముండ్లమూరు ఎస్‌ఐ యూ. వెంకట కృష్ణయ్య తన సిబ్బందితో దాడి చేశారు. దాడిలో 23 క్వాటర్ బాటిళ్ళు దొరికాయి. పట్టుబడిన నిందితుడిపై కేసు నమోదు చేసి సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ పీ మహేష్ పాల్గొన్నారు.



- రంగవల్లులతో పులకించిన పుడమి
- ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీకి విశేష స్పందన
- విజేతలకు సెయింట్ ఆన్స్ కళాశాల బహుమతులు
- పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతి



ఉత్సాహంగా రంగవల్లులు తీర్చిదిద్దుతున్న అతివలు

ఇలపై.. ఇంద్రధనుస్సు



ప్రథమ బహుమతి పొందిన వెదుళ్లపల్లికి చెందిన మల్లీశ్వరికి రూ.6వేలు నగదు బహుమతి అందజేస్తున్న డీఎస్పీ ప్రసాదరావు



చీరాల, జనవరి 5: ఇలపైకి ఇంద్రధనుస్సు దిగివచ్చింది. రంగ వల్లులతో చీరాల సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల పులకించింది. సందేశాత్మకంగా, సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి శోభను ముందస్తుగా కళ్లకు కట్టినట్లుగా రంగవల్లులను మహిళలు, యువ తులు తీర్చిదిద్దారు. ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన సంయుక్తంగా సెయింట్ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల సౌజన్యంతో శుక్రవారం చీరాలలో ముగ్గుల పోటీ జరిగింది. స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల(అటానమస్)లో నిర్వహించిన ముత్యాల ముగ్గులు పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో మహిళలు, యువతులు, విద్యార్థినులు హాజరయ్యారు. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ముగ్గులను తీర్చి దిద్దారు. రంగురంగుల ముగ్గులు పలువురిని ఆకట్టుకున్నాయి. పోటీల నేపథ్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తొలుత పోటీలను కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణు గోపాలరావు, అక్రిడేషన్స్ మేనేజర్ డాక్టర్ సుబ్బారావులు ప్రారంభించారు. ఈ సం దర్భంగా జరిగిన సభలో డీఎస్పీ మాట్లాడు తూ సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీలకు వచ్చిన స్పం దనను చూస్తుంటే సనాతన విధానం గుర్తు కొస్తుందన్నారు. మహిళలు, విద్యార్థినులు ఆపదలో పోలీస్ సహాయం పొందేందుకు దిశ యాప్ ద్వారా తక్షణ సహాయం పొందేందుకు ఉన్న వెసులుబాటును వివరించారు. డయల్ 100 ప్రయోజనాలను వివరించారు. ప్రస్తుత యాంత్రిక జీవనంలో తల్లిదండ్రులు పిల్లలు ఏం చేస్తున్నారనే విషయంపై సునిశిత పరిశీలన అవసరమన్నారు.ఆంధ్రజ్యోతి ఒంగోలు ఎడిషన్ ఇన్‌ఛార్జి ఆళ్ల శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జి సూర్యదేవర నవీన్‌బాబులు మాట్లాడుతూ రంగ వల్లుల పోటీలను సంక్రాంతి సంబరాల్లో భాగంగా ప్రతి ఏటా నిర్వహిస్తున్నామన్నారు. న్యాయనిర్ణేతలు మాట్లాడుతూ ప్రతి ముగ్గును మనస్సు పెట్టి మహిళలు, యువతులు తీర్చిదిద్దార న్నారు. ఒకదానికొకటి తక్కువ కాదన్నట్లు ఎంపికలో సవాల్‌గా నిలి చాయన్నారు. కళాశాల ఈవెంట్ టీం ప్రతినిధులు ఎక్కడ ఎవరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి చీరాల వీసీ పరిధిలోని పలువురు రిపోర్టర్లు, యాడ్స్ విభాగ ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు..

ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలో బాపట్ల మండలం వెదుళ్లపల్లికి చెందిన కొమర్నేని నాగమల్లేశ్వరి ప్రథమ బహుమతి సాధించారు. మార్టూరుకు చెందిన మద్దినేని పద్మావతి ద్వితీయ, చిన గంజాం మండలం కడవకుదురుకు చెందిన గున్నంనేని విజయశాంతి తృతీయ బహుమతి పొందారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలను విజేతలకు చీరాల డీఎస్పీ ప్రసాదరావు అందజేశారు. ఇంకొల్లుకు చెందిన మణి మంజరి, వేటపాలెం మండలం నీలకంఠాపురానికి చెందిన మౌనికశ్రీ, వేటపాలేనికి చెందిన కె.చందనసాయి, ఎం.మధు, అద్దంకి చెందిన కె.సుజాత, తిమ్మసముద్రానికి చెందిన సీహెచ్.శ్రీజలకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున ప్రోత్సాహక బహుమతులు అంద జేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతి అందజేశారు. న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన పూరా శేషమాధవి, అమరా సునీత, రామిశెట్టి విజయలక్ష్మి ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు.



ద్వితీయ బహుమతి పొందిన మార్టూరుకు చెందిన పద్మావతికి రూ.4వేలు నగదు బహుమతి అందజేస్తున్న డీఎస్పీ ప్రసాదరావు



తృతీయ బహుమతి పొందిన కడవ కుదురుకు చెందిన విజయశాంతికి రూ.3వేలు నగదు బహుమతి అంద జేస్తున్న డీఎస్పీ ప్రసాదరావు

రాష్ట్ర స్థాయి బహుమతే లక్ష్యం



పదిహేనేళ్ల క్రితం ఆంధ్రజ్యోతి వారు నిర్వహించిన ముగ్గుల పోటీలో ప్రథమ బహుమతి పొందాను. మరలా ఇప్పుడు ప్రథమ బహుమతి వచ్చింది. రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందాలన్నదే నా లక్ష్యం. మా పుట్టిల్లు వెదుళ్లపల్లి. మెట్టినిల్లు రేపల్లె. బహుమతి గెలుచుకోవడం చాలా ఆనందం.

- నాగమల్లేశ్వరి, ప్రథమ బహుమతి విజేత



కృషికి తగిన ప్రోత్సాహం



రంగవల్లులకు సంబంధించి నిర్వహిస్తున్న పోటీలో కృషికి తగిన ప్రోత్సాహం ఇస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది. మరలా పోటీలో పాల్గొని ప్రథమ బహుమతి సాధిం చుకుంటాను. అందుకు అనుగుణంగా సాధన చేస్తాను.

- ఎం.పద్మావతి, ద్వితీయ బహుమతి విజేత, మార్టూరు



ఆనందంగా ఉంది



పోటీలో మొదటి స్థానం రానందుకు కొంత నిరాశ ఉంది. అయినా ఆనందంగా ఉంది. మరోసారి ప్రథమ బహుమతి పొందేవిధంగా ప్రయత్నిస్తా. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తాను.

- జి.విజయశాంతి, తృతీయ బహుమతి విజేత, కడవకుదురు



నేడు ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీ

- బాపట్ల తహసీల్దారు కార్యాలయం రోడ్డులో ఏర్పాట్లు
- ఇప్పటికే పెద్దసంఖ్యలో పేర్లు నమోదు చేసుకున్న మహిళలు

బాపట్ల, జనవరి 5: ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీకి బాపట్ల ముస్తాబైంది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన వారు సంయుక్తంగా జీఎస్సార్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత, కర్లపాలెం మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గుండ్రెడ్డి శివ సౌజన్యంతో పోటీలు ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 9 గంటలకు తహసీల్దార్ కార్యాలయం నుంచి ఫైర్ స్టేషన్‌కు వెళ్లే సీసీరోడ్డుపై ముగ్గుల పోటీలు జరగనున్నాయి. ప్రతి ఏడాది వలే ఈ ఏడాది కూడా పెద్దఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పోటీలో పాల్గొనే మహిళలు అనేక ప్రాంతాలు నుంచి పేర్లు నమోదు చేసుకున్నారు. పోటీలో పాల్గొనే వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు చొప్పున అందజేయనున్నారు. పాల్గొనే ప్రతి ఒక్కొక్కరికి ప్రోత్సాహక బహుమతి ఇవ్వనున్నారు.

ఇలా చేరుకోవచ్చు..

బాపట్ల మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉప్పరపాలెం రోడ్డు నుంచి, బాపట్ల పాతబస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు నుంచి ముగ్గుల పోటీ జరిగే ప్రాంతానికి చేరుకోవచ్చు. పోటీలో పాల్గొనే మహిళలు ముగ్గు, రంగులు వారే తెచ్చుకోవాలి, చుక్కల ముగ్గు మాత్రమే వేయాలి. ముగ్గు వేయడానికి రెండు గంటల సమయం కేటాయించారు. ఇప్పటికే పేర్లు నమోదు చేయించుకున్నవారు కాకుండా మిగిలిన వారు 9985411056, 9985411240 నెంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చు. పోటీలకు అర గంట ముందుగా ప్రాంగణానికి రావాలని నిర్వాహకులు సూచించారు.



ఎంపీ లావుకూ.. నో?



- గుంటూరు వెళ్లమని జగన్ హుకుం
- అందుకు సుముఖత చూపని ఎంపీ
- మార్చొద్దని ఎమ్మెల్యేలు చెప్పినా ఆలకించని వైనం
- నరసరావుపేటలో అయితేనే పోటీ చేస్తానని చెప్పిన లావు శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు కూడా సీఎం జగన్ మొండిచేయి చూపించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గుంటూరు ఎంపీగా పోటీ చేయమని హుకుం జారీ చేశారు. దాంతో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుతో పాటు ఆ నియోజకవర్గంలోని కొంత మంది ఎమ్మెల్యేలు కూడా విస్మయానికి గురయ్యారు. చిన్న వయస్సులోనే రాజకీయాల్లోకి వచ్చి నిజాయితీగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి పైనే దృష్టి కేంద్రీకరించిన ఎంపీకి ఈ పరిస్థితిని కల్పించడంపై అంతా అవాక్కవుతున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల ముందు కూడా తొలుత శ్రీకృష్ణదేవరాయలును గుంటూరులో పోటీ చేయమని చెప్పి తీరా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక నరసరావుపేటకు పంపారు. అయినా ఆయన ఏమాత్రం అభ్యంతరం పెట్టకుండా నరసరావుపేటకు వెళ్లి అక్కడ రాజకీయ ఉద్ధండుడు రాయపాటి సాంబశివరావుపై పోటీ చేసి లక్షకు పైగా మెజార్టీతో గెలుపొందారు. ఎన్నికల్లో గెలిచిన రోజు నుంచి నియోజకవర్గ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తూ నిధులను మంజూరు చేయించారు. ఇవేమి పరిగణనలోకి తీసుకోకుండా ఇప్పుడు మళ్లీ నియోజకవర్గం మారాల్సిందిగా వైసీపీ అధిష్ఠానం ఒత్తిడి చేయడంపై పార్టీ పల్నాడు జిల్లా శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం పెల్లుబుకుతున్నది. తాజాగా శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయానికి శ్రీకృష్ణదేవరాయలును పిలిచి వచ్చే ఎన్నికల్లో గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగాల్సిందిగా సీఎం జగన్ సూచించారు. అయితే అందుకు ఆయన సుముఖత చూపలేదు. తాను నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి అయితేనే ఎన్నికల్లో పోటీ చేస్తానని, కాదంటే బరి నుంచి తప్పుకుంటానని స్పష్టం చేసినట్లు సమాచారం. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలును వైసీపీ అధిష్ఠానం పిలిచిందన్న విషయం ముందుగానే తెలుసుకున్న ఆ పార్టీ ఎమ్మెల్యేలు కాసు మహేష్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంబూరు శంకరరావు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, మర్రి రాజశేఖర్ సీఎంవోకి వెళ్లి తమకు శ్రీకృష్ణదేవరాయలునే ఎంపీ అభ్యర్థిగా కేటాయించాలని చెప్పి వెనుతిరిగినట్లు సమాచారం. అయినప్పటికీ సీఎం జగన్ వారి విజ్ఞప్తులను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా శ్రీకృష్ణదేవరాయలును గుంటూరు వెళ్లాల్సిందేనని చెప్పి పంపినట్లు తెలిసింది. క్లీన్ ఇమేజ్ ఉన్న శ్రీకృష్ణదేవరాయలుకే ఈ పరిస్థితి కల్పించారంటే ఇక ఆ పార్టీలో మిగతా వారి పరిస్థితి ఎలా ఉందో చెప్పకనే చెప్పినట్లు అవుతున్నది.

మైండ్‌గేమ్‌లా మార్పులు

గత కొన్ని రోజులుగా ఒక్కో జిల్లా నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలను తాడేపల్లి ప్యాలెస్‌కు జగన్ కోటరీ పిలిపిస్తూ మీకు ఈసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం లేదని చెబుతున్నది. అలానే కొంతమందిని నియోజకవర్గాలను మారుస్తూ సమన్వయకర్తలుగా నియమిస్తున్నది. ఇప్పటికే రెండు జాబితాల్లో సమన్వయకర్తల పేర్లను ప్రకటించారు. వైసీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొనగా దానిని కప్పిపుచ్చేందుకు మైండ్‌గేమ్‌లా అభ్యర్థులను ఎడాపెడా మారుస్తున్నారు. అలానే మహిళలు, బీసీలను ఉద్ధరిస్తున్నట్లుగా పైకి కలరింగ్ ఇస్తున్నారు. అవినీతికి, వివాదాలకు దూరంగా ఉంటూ ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్న వారిని కూడా నియోజకవర్గం మారమని ఒత్తిడి చేస్తున్నారు.

బయోాలమయం

- ఊరుపేరు లేని పేర్లతో దిగుమతి
- పార్సిల్ కార్యాలయాల్లో టన్నుల కొద్దీ సరుకు



తెలంగాణ నుంచి వచ్చిన బయో మందులు

గుంటూరు సిటీ, జనవరి 5: గుంటూరును నకిలీ బయో మందులు ముంచెత్తుతున్నాయి. తెలంగాణ నుంచి వస్తున్న బయో ఉత్పత్తులతో నగరంలోని పార్సిల్ కార్యాలయాలు నిండిపో తున్నాయి. ఊరు పేరు లేని బయో మందులు టన్నుల కొద్దీ సరఫరా అవుతున్నాయి. వాటిని ఎవరు ఎక్కడకి పంపుతున్నారో.. ఎందుకు పంపుతున్నారో వంటి వివరాలు లేవు. లేబుళ్ల మార్చి రైతులను ఏమార్చే తంతులో నిఘావర్గాల పాత్రే ప్రశ్నార్థకమవుతుంది. హైదరాబాద్ నుంచి గుంటూరుకు ప్రతిరోజూ వందల టన్నుల బయో ఉత్పత్తులు వస్తున్నాయి. పార్సిల్ సర్వీసుల ద్వారా వీటిని తీసుకువచ్చి రహస్య ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్కడ లేబుళ్లు మార్చేసి మార్కెట్‌లోకి డంప్ చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 10 లక్షల ఎకరాల్లో వాణిజ్య పంటలు సాగుతో ఇక్కడ అన్ని రకాల పురుగుల మందులకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం మిరప, మినుము, శనగ, మొక్కజొన్న, పొగాకు సాగు ఎక్కువగా ఉంది. దిగుబడి ఎక్కువగా సాధించేందుకు రైతులు పోటీలు పడి మరీ పురుగుమందులు వాడుతున్నారు. తెలంగాణలో ఎక్కువగా ఊరు పేరు లేని బయో మందులను తయారు చేస్తున్నారు. వాటిని మార్కెట్ చేసుకునేందుకు గుంటూరు మంచి వ్యాపార కేంద్రంగా మారింది. కొన్ని ప్రముఖ కంపెనీలు పేరుతో నకిలీ మందులను తీసుకొచ్చి లేబుళ్లు మార్చే వ్యాపారం కూడా ఇక్కడ ఎక్కువగా జరుగుతుంది. రైతులకు అంటగడుతున్న బయో మందుల్లో 90 శాతం నకిలీవే అని సమాచారం. వాటినే లైసెన్స్‌డ్ ఫర్టిలైజర్ దుకాణాల్లో అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. నకిలీ బయోలతో రైతులు నష్టపోతున్నారు. నకిలీ బయోల మార్కెటింగ్‌కు వ్యాపారులను ఆధారం చేసుకుంటున్నారు. పెద్దగా కష్టపడకుండా పెద్ద మొత్తంలో లాభం వస్తుండటం తో వారు రైతులను బురిడీ కొట్టించేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీల సమయంలో వీటిని పట్టించుకోవడంలేదు. ఒకవేళ పట్టుకున్నా తూతూమంత్రంగా కేసు నమోదు చేసి సరిపుచ్చుతున్నారే కాని కఠిన చర్యలు తీసుకోవడంలేదు. దీంతో జిల్లాలో నకిలీబయోల వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయల అన్న చందంగా యథేచ్ఛగా సాగుతుంది. బయో మందులు వ్యాపారానికి సుమారు 300 మందికి లైసెన్సులు ఉండగా లైసెన్సు లేకుండా సుమారు 500 మంది వ్యాపారం చేస్తున్నారు. వారిలో చాలామందికి వ్యవసాయశాఖలోని ఉన్నతాధికారులతో మంచి సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అందువల్లే బయోల వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నా సంబంధిత శాఖలుపట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నాయి. గుంటూరు కేంద్రంగా బయో మందులపై నిఘా వర్గాలు నిద్ర నటిస్తున్నాయి.



జనసేన పార్టీ ఆధ్వర్యంలో
జాతీయస్థాయి ఎడ్ల పోటీలకు చేసిన ఏర్పాట్లు

జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలకు ఏర్పాట్లు పూర్తి

దర్శి, జనవరి 5 : జనసేన పార్టీ ఆధ్వర్యంలో దర్శిలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో శనివారం నుంచి నాలుగు రోజులు పాటు ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులో బాగంగా శనివారం నాలుగు పళ్ళ ఎడ్ల బలప్రదర్శన పోటీలు, ఆదివారం ఆరు పళ్ళ ఎడ్ల బలప్రదర్శన పోటీలు, సోమవారం న్యూ క్యాటగిరి ఎడ్ల బలప్రదర్శన పోటీలు, మంగళవారం సీనియర్ క్యాటగిరి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన సీనియర్ కేటగిరి ఎడ్లకు ప్రథమ బహుమతిగా మహేంద్ర 475 ట్రాక్టర్, న్యూ క్యాటగిరి ఎడ్ల బలప్రదర్శనలో గెలుపొందిన ఎడ్లకు బుల్లెట్ మోటార్‌సైకిల్ మిగిలిన క్యాటగిరీలకు నగదు బహుమతులు భారీ స్థాయిలో అందజేస్తున్నారు. అన్ని కేటగిరీలకు సుమారు రూ.30 లక్షల బహుమతులు అందజేస్తున్నారు. ఈ పోటీలకు ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి ఎడ్లు వస్తున్నట్లు గరికపాటి వెంకట్ తెలిపారు. సుమారు పది వేల మంది కూర్చుని చూసే వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. పోటీలు చూసేందుకు వచ్చిన అందరికీ భోజన వసతి కల్పిస్తున్నారు. టీడీపీ, జనసేన రాష్ట్ర స్థాయి నాయకులను పోటీలు తిలకించేందుకు గరికపాటి వెంకట్ స్వయంగా ఆహ్వానించటంతో అనేకమంది ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు హాజరవుతున్నట్లు సమాచారం.

కరోనా కలవరం

● జిల్లాలో మూడు పాజిటివ్ కేసులు
● ఒంగోలు, మద్దిపాడు, కంభాలపాడుల్లో నమోదు

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 5 : కరోనా కలవరం మళ్లీ మొదలైంది. జిల్లాలో శుక్రవారం మూడు పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఒంగోలు దేవుడు చెరువుకు చెందిన ఒక యువకుడికి, మండల కేంద్రమైన మద్దిపాడుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు, పొదిలి మండలం ఉప్పలపాడు పీహెచ్‌సీ పరిధిలోని కంభాలపాడుకు చెందిన మరొకరికి వైరస్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. దేవుడు చెరువుకు చెందిన యువకుడు ప్రస్తుతం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. మద్దిపాడుకు చెందిన వ్యక్తి హోం ఐసోలేషన్‌లో ఉన్నారు. వీరిద్దరికీ ఒంగోలు జీజీహెచ్‌లో గురువారం పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ ఫలితం వచ్చింది. రెండు నమూనాలను జీనోమ్ ల్యాబ్‌కు పంపుతున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్, ఆర్‌ఎంవో డాక్టర్ తిరుమలరావు తెలిపారు. కంభాలపాడుకు చెందిన వ్యక్తి విజయవాడలో పరీక్ష చేయించుకోగా వైరస్ ఉన్నట్లు తేలింది. ఈమేరకు అక్కడి నుంచి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం అందింది.



సమావేశంలో మాట్లాడుతున్న శోభనాద్రీశ్వరరావు

దేశ సంపదను దోచిపెడుతున్న మోదీ, షాలు

● 12న విజయవాడలో రాజ్యాంగ హక్కుల వేదిక ఆవిర్భావ సభ
● సంయుక్త కిసాన్‌మోర్చా రాష్ట్ర కన్వీనర్ శోభనాద్రీశ్వరరావు వెల్లడి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 5: దేశ సంపద ను ఆదాని, అంబానీలకు దోచిపెడుతున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమీత్‌షాలను, వారికి మద్ద తు ఇచ్చే పార్టీలను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శో భనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఒంగోలులోని రంగాభవన్‌లో జిల్లా సమితి ఆధ్వ ర్యంలో ఈనెల 12న విజయవాడలో జరిగే భార త రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆవిర్భావ సభ సన్నహాక సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని విమర్శించా రు. విద్యుత్ సంస్కరణలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలోని 12 పోర్టులను అ దానీకి అప్పగించారని విమర్శించారు. వ్యవసా య, గృహవినియోగానికి స్మార్ట్ మీటర్లు బిగించే లా రంగం సిద్ధం చేశారని చెప్పారు. చేసింద న్నారు. రాష్ట్రంలో భూమి హక్కుల చట్టం-22ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 12న విజయవాడలో జరిగే భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆవిర్భావ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో ప్రతి ఒక్కరూ పాల్గొని వి జయవంతం చేయాలని కోరారు. యూత్ ఫర్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు యు.వేదవతి మాట్లా డుతూ పాలకులు ప్రభుత్వ రంగం కన్నా ప్రైవే టురంగం మంచిదన్న తీరుగా ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ.ప్రసాద్ మాట్లాడు తూ బీజేపీ పాలనలో దేశంలోని ఏ వర్గం సం తోషంగా లేదన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు చుండూరి రంగారావు, కంక ణాల ఆంజనేయులు, కె.అరుణ, వడ్డే హనుమా రెడ్డి, కె.వీరారెడ్డి, జె.జయంతిబాబు, పమిడి వెంక ట్రావు, చుంచు శేషయ్య, ఎస్.లలితకుమారి, చిట్టి పాటి వెంకటేశ్వర్లు, కరవది సుబ్బారావు, ఓర్సు శ్రీనివాసరావు, పేరయ్య, దేవరపల్లి సుబ్బారెడ్డి, రఫీ, దాసరి సుందరం, రావిపాటి ప్రసాదరావు, నాదెండ్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం జిల్లా కనిగిరిలో టీడీపీ శుక్రవారం నిర్వహించిన పిలుస్తుంది రా.. కదలిరా.. ఎన్నికల శంఖారావ సభకు హాజరైన అధినేత చంద్రబాబు నాయుడుని ఆ పార్టీ నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ కలిశారు. ఆయనకు బొకే ఇచ్చి స్వాగతం పలికారు.
- కందుకూరు

టీడీపీ సమరశంఖం

కనిగిరి సభ సూపర్ సక్సెస్

పోలీసుల అడ్డంకులను అధిగమించి పరుగులు తీసిన ప్రజలు

ప్రాంగణంలో ఎంతమందో.. బయట అంతమంది

అశేష జనవాహిని సమక్షంలో టీడీపీ ఎన్నికల సమరశంఖారావాన్ని పూరించింది. కనిగిరిలో ఆపార్టీ అధినేత చంద్రబాబునాయుడు అందుకు శ్రీకారం పలికారు. రాష్ట్రంలో రాబోయే సార్వత్రిక ఎన్నికల సన్నాహంలో భాగంగా రా.. కదలిరా అంటూ లోక్‌సభ నియోజకవర్గాల వారీ సభలు నిర్వహించాలని టీడీపీ నిర్ణయించింది. ఆ కార్యక్రమానికి ఒంగోలు పార్లమెంటు పరిధిలోని కనిగిరి నియోజకవర్గంలో శుక్రవారం శ్రీకారం పలికారు. సభకు టీడీపీ, జనసేన కార్యకర్తలతోపాటు సాధారణ ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. విపరీతమైన పోలీసు ఆంక్షల వల్ల సభాస్థలికి దూరంగా చాలా మంది ఆగిపోవాల్సి వచ్చినప్పటికీ సభాప్రాంగణం కిటకిటలాడింది. చివర్లో వచ్చిన కొన్ని నియోజకవర్గాల ప్రజల వాహనాలు కనిగిరిలోకి ప్రవేశించే అవకాశం లేక వెనుదిరిగి వెళ్లిపోవడం కనిపించింది.



కనిగిరిలో జరిగిన శంఖారావం సభలో మాట్లాడుతున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

టీడీపీ కనిగిరిలో నిర్వహించిన రా.. కదలిరా సభ సూపర్ సక్సెస్ అయ్యింది. ఒంగోలు లోక్‌సభ స్థాయిలో నిర్వహించిన ఈ సభకు తెలుగుదేశం, జనసేన పార్టీల ముఖ్యనాయకులంతా హాజరయ్యారు. ముమ్మరమైన వ్యవసాయ పనులున్నా, ఊరూవాడా ప్రత్యేక వాహనాలను పంపకపోయినా రెండుపార్టీల ముఖ్య కార్యకర్తలతోపాటు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఆయా అసెంబ్లీ సెగ్మెంట్‌ల నుంచి టీడీపీ కార్యకర్తలు హాజరుకావాలని ప్రచారం చేశారు. అయితే సభ నిర్వహిస్తున్న కనిగిరి నియోజకవర్గం నుంచి స్వచ్ఛందంగా తరలిరావాలని డాక్టరు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు విస్తృత ప్రచారం చేశారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరం కావడంతో టీడీపీ ఆశించిన స్థాయిలో ప్రజలు హాజరుకాకపోవచ్చన్న భావన వ్యక్తమైంది. అయితే సభాప్రాంగణంలో ఉన్నవారిని, సుదూరంగా ఆగిపోయినవారిని, పట్టణంలోకి ప్రవేశించే అవకాశం లేక వెనక్కువెళ్లేవారిని కలుపుకుంటే లక్షా 70వేల మంది వరకు వచ్చి ఉంటారని అంచనా. చంద్రబాబునాయుడు సకాలంలో ప్రాంగణానికి చేరుకున్నారు. 5 గంటల 6 నిమిషాలకు వేదికమీదకు వచ్చారు. తెలుగుదేశం, జనసేన అధ్యక్షులు బాలాజీ, రియాజ్, కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ప్రధానంగా మాట్లాడారు. ఆపార్టీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, బాపట్ల పార్లమెంటు అధ్యక్షుడు ఏలూరి సాంబశివరావులు చివర్లో ప్రసంగించారు. 5 గంటల 36 నిమిషాలకు చంద్రబాబు సమరశంఖం మోగించి 5.40 గంటల నుంచి ప్రసంగాన్ని ప్రారంభించారు. 6 గంటల సమయంలో సభాప్రాంగణంలో లక్షమందికి పైగా కనిపించారు. 7 గంటల సమయంలో ఆవరణ నుంచి వెళ్లిపోయేవారు అప్పటికీ సభకు వచ్చేవారు ఎదురుపడటంతో కనిగిరి-వెలిగండ్ల రోడ్డుమార్గంలో ప్రజలు తీవ్ర ఒత్తిడికి గురికాక తప్పలేదు. సభ ప్రారంభ సమయంలో సుమారు 40వేల మంది పాల్గొనగా బయటప్రాంతంలో మరో 20వేల మందికి పైగా ఆగిపోయారని పోలీసు గూఢచార శాఖ ప్రభుత్వానికి తెలియజేయడం విశేషం. వారి అంచనాకు రెండింతల జనం రావటమనేది సత్యం. కార్యక్రమం వద్ద డాక్టరు ఉగ్ర దూరప్రాంతాల నుంచి వచ్చేవారికి మధ్యాహ్నం, రాత్రికి కలిసి సుమారు 70వేల మందికి భోజన ఏర్పాట్లు చేశారు.

సభ అనంతరం ఆ ప్రాంతమంతా కిటకిటలాడింది. తెలుగుదేశం నాయకులు మాత్రం పూర్తి ఆనందంతో సభ ఘనవిజయం సాధించిందని 2 లక్షలకు పైగా ప్రజలు వచ్చారని ప్రకటించారు. సభలో చంద్రబాబుతోపాటు కనిగిరి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, ఒంగోలు లోక్‌సభ టీడీపీ పరిశీలకులు రాంగోపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, టీడీపీ ఒంగోలు, బాపట్ల అధ్యక్షులు నూకసాని బాలాజీ, ఏలూరి సాంబశివరావు, ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, స్వామి, మాజీ ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, పోతుల రామారావు, అశోక్‌రెడ్డి, నారాయణరెడ్డి, విజయకుమార్, పాపారావు, ఆపార్టీ ఇన్‌చార్జిలు ఎంఎం కొండయ్య, ఇంటూరి నాగేశ్వరరావు, ఇతర నాయకులు దామచర్ల సత్య, ఇంటూరి రాజేష్, డాక్టర్ మన్నె రవీంద్ర, జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్, ఆపార్టీ దర్శి నాయకుడు గరికిపాటి వెంకట్, చీరాల ఇన్‌చార్జి ఆమంచి స్వాములు, ఇమ్మడి కాశీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి బాధ్యత నాదే!

అధికారంలోకి వచ్చేది మేమే..
తొలి ఏడాదిలోనే వెలిగొండ పూర్తి
మార్కాపురం కేంద్రంగా జిల్లా
కందుకూరును ఒంగోలులో చేరుస్తా
ఉగ్ర చెప్పిన ఐదు గ్యారెంటీలను నెరవేరుస్తా
కనిగిరి సభలో చంద్రబాబు



కనిగిరి ప్రాంత సమస్యలను చంద్రబాబుకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

'రాష్ట్రంలో వైసీపీ ఓటమి చెందడం.. టీడీపీ, జనసేనల ప్రభుత్వం ఏర్పడటం ఖాయం. రానున్న వంద రోజుల్లో జరగబోయేది ఇదే. ఆ తర్వాత జిల్లా అభివృద్ధి బాధ్యతను టీడీపీ తీసుకుంటుంది' అని ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు చెప్పారు. తొలి ఏడాదిలోనే వెలిగొండతోపాటు ముఖ్యమైన ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి తన దృష్టికి తెచ్చిన ఐదు సమస్యలను పరిష్కరించి కనిగిరికి బంగారు భవిష్యత్‌ను అందిస్తానని ప్రకటించారు. రా.. కదలిరా అంటూ టీడీపీ చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం కనిగిరిలో జరిగిన భారీ బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడారు. అనంతరం వేదికపై జిల్లా నాయకులతో కలిసి భేరీని మోగించి ఎన్నికల శంఖారావాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షమేరకు వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి తానే శ్రీకారం పలికానని, పదిశాతం మినహా మిగిలిన పనులు పూర్తిచేశానని చెప్పారు. తిరిగి టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే ఆ పనులు పూర్తయి ఇప్పటికే పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలమయ్యేదన్నారు. కానీ ఇప్పుడు చెప్తున్నా తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలోనే దాన్ని పూర్తిచేసి సాగు, తాగునీరు అందించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. 'జిల్లాలో ఇంకా చాలా పెండింగ్ ప్రాజెక్టులు ఉన్నాయి. గుండ్లకమ్మ, కొరిశపాడు ఎత్తిపోతల పథకం, గుంటూరు చానల్ పొడిగించి పర్చూరు వరకు గోదావరి నీరు ఇవ్వడం, సాగర్ కుడి కాలువకు గోదావరి నీరు మళ్లించడం వంటి వాటిని పూర్తి చేస్తా. జిల్లా వాసులకు తాగు, నీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తా' అని హామీ ఇచ్చారు. వెలిగొండ కుడికాలువతో ముసి, పాలేరు నదులను అనుసంధానం చేస్తామని చెప్పారు. అలాగే మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేస్తామన్న చంద్రబాబు ఆ విషయంలో ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దన్నారు. ఒంగోలు జిల్లా కూడా ఉంటుంది అందులో కందుకూరును చేరుస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఒంగోలు, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు తదితర ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తానని చెప్పారు. కందుకూరులో తాను చేపట్టిన హార్టీకల్చర్ కళాశాలను కూడా ఈ ప్రభుత్వం ఆపేసింది. దాన్ని కూడా మన ప్రభుత్వం రాగానే పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు.

కనిగిరికి ప్రత్యేక వరాలు

సభలో తొలుత టీడీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టరు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధించి తాను చేపట్టిన ఐదు గ్యారెంటీలను ప్రస్తావిస్తూ వాటి సాధన ద్వారా దుర్భిక్షాన్ని తరిమికొట్టేందుకు సహకరించాలని కోరారు. వాటిని చంద్రబాబు తన ప్రసంగంలోకి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ 'కనిగిరి నియోజకవర్గంలో ఉన్న ప్రజలు ఆర్థికంగా వెనుకబడిపోతుంటే ఇక్కడి నుంచి ఎక్కడికో వెళ్లినవారు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. దానికి కారణం ఇక్కడ అవసరమైన వసతులు లేకపోవటమే. మా ప్రభుత్వం రాగానే ఆ పరిస్థితిని నివారిస్తా. మీ ప్రాంత ప్రజల కోసం నిత్యం పరితపించే డాక్టర్ ఉగ్ర సూచించిన విధంగా వెలిగొండను పూర్తిచేసి మీ నియోజకవర్గానికి ఉపయోగపడేటట్లు చేస్తా. గతంలో నేను శంకుస్థాపన చేసి ఈ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిన ట్రిపుల్ ఐటీని కనిగిరిలోనే ఏర్పాటు చేస్తా. అప్పట్లో కేంద్రంతో మాట్లాడి తాము ఈ ప్రాంతానికి తీసుకొచ్చిన నిమ్జ్‌కు తిరిగి కేంద్రం ద్వారా డబ్బులు తెచ్చి పారిశ్రామిక అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తా.

నడికుడి-శ్రీకాళహస్తి రైలుమార్గాన్ని వారు పూర్తిచేయలేకపోవడం బాధాకరం. మా ప్రభుత్వం రాగానే ఆ పనులు వేగంగా జరిగి మీప్రాంతం మీదుగా రైళ్లు నడిచేలా చర్యలు తీసుకుంటా. ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా రక్షిత తాగునీటిని అందించి ఫ్లోరోసిస్ పీడ నుంచి విముక్తి కల్పిస్తా' అని చంద్రబాబు హామీ ఇచ్చారు.

మాగుంట, బాలినేని ప్రత్యేక భేటీ


● ఒంగోలుకు వేణుగోపాల్ పేరు పరిశీలన
● సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు అన్నా, మద్దిశెట్టి

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి హైదరాబాద్‌లో ఏకాంతంగా భేటీ కావడం వైసీపీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గురువారం ఢిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చిన మాగుంట శ్రీనివాసులరెడ్డి ఆ రోజు సాయంత్రమే బాలినేనిని కలిశారు. శుక్రవారం మధ్యాహ్నం మళ్లీ బాలినేని నివాసానికి వెళ్లి సమాలోచనలు జరిపారు. మాగుంట వెంట అన్నింటా ఆయన ఆలోచనల్లో పాలుపంచుకునే గోపాల్‌రెడ్డి ఉన్నారు. సీఎం జగన్ మాగుంటకు లోక్‌సభ టికెట్ లేదని చెప్పడం, టీడీపీ అధినేత చంద్రబాబుతో మాగుంట టచ్‌లోకి వెళ్లారని వార్తలు వస్తున్నాయి. అదేసమయంలో పార్టీలో తగిన ప్రాధాన్యత లేదని, తనను కనీసం పిలవకుండానే జిల్లాలో అభ్యర్థుల ఎంపికను పూర్తి చేస్తున్నారన్న వ్యథతో బాలినేని ఉన్నారు. ఆయన ఎక్కడి నుంచి పోటీ చేయాలన్న విషయంపై సీఎం ఇంత వరకూ స్పష్టత ఇవ్వలేదు. ఈనేపథ్యంలో బాలినేని, మాగుంట వెంటవెంటనే రెండు సార్లు భేటీ అవడం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. పార్టీ మారే విషయమై ఇద్దరూ చర్చించుకున్నట్లు భావిస్తున్నారు. కాగా, శుక్రవారం మధ్యాహ్నం వీరిద్దరూ ఉన్న సమయంలోనే బాలినేని ఇంటికి ఒంగోలు నగరానికి చెందిన పలువురు వైసీపీ ముఖ్యనాయకులు వెళ్లారు. వారితో మాట్లాడే సందర్భంలో మాగుంట.. నేను, బాలినేని ఒకే పార్టీ నుంచి పోటీ చేస్తాం అని వ్యాఖ్యానించడం విశేషం. ఆ తర్వాత బాలినేని తన సన్నిహితులతో నేను ఒంగోలు నుంచే బరిలోకి దిగుతున్నానని గట్టిగా చెప్పినట్లు తెలుస్తోంది. దర్శి, గిద్దలూరు ఎమ్మెల్యేలు మద్దిశెట్టి వేణుగోపాల్, అన్నా రాంబాబు శుక్రవారం వేర్వేరుగా తాడేపల్లిలో ముఖ్యమంత్రి జగన్‌ను కలిశారు. మద్దిశెట్టికి దర్శి నుంచి పోటీ చేసే అవకాశం లేదని తేల్చిచెప్పిన జగన్ ప్రత్యామ్నాయంగా అవకాశం ఇస్తే ఒంగోలు లోక్‌సభ లేక అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తారా? అని అడిగినట్లు తెలిసింది. ఒంగోలు అసెంబ్లీ స్థానం నుంచి శిద్దా కుమారుడు సుధీర్ నుంచి స్పష్టత రాకపోవడంతో ఆవిషయాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. అలాగే ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాల్సి వస్తే సిద్ధంగా ఉండాలని చెప్పి రెండు మూడు రోజుల్లో స్పష్టత ఇస్తామని చెప్పినట్లు తెలిసింది. అనంతరం కలిసిన అన్నా రాంబాబును పోటీకి దూరంగా ఉంటానని ప్రకటించడంలోని అంతర్యం ఏమిటని జగన్ ప్రశ్నించినట్లు తెలిసింది. రాంబాబు బదులిస్తూ 'మిమ్మల్ని కలిసేందుకు ప్రయత్నించాను. నాకు అవకాశం దక్కలేదు. అందుకే నేరుగా ప్రకటించానని' చెప్పినట్లు తెలిసింది. అనంతరం రాంబాబుకు జగన్ ఏమి చెప్పకుండానే మళ్లీ కలుద్దామని చెప్పి పంపినట్లు సమాచారం.మాగుంటపై విమర్శలు చేయడం ద్వారా రాంబాబు ముఖ్యమంత్రి వద్ద మంచి మార్కులు పొందారని, ప్రత్యామ్నాయ అవకాశం కూడా కల్పించవచ్చని ఆపార్టీ నాయకుల్లోని కొందరి అంచనా. కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి సీఎం విధించిన షరతులను తీవ్రంగా వ్యతిరేకించిన నేపథ్యంలో శుక్రవారం ఉదయం విజయసాయిరెడ్డి ఫోన్‌లో మహీధర్ రెడ్డితో మాట్లాడారు. ఇంకోవైపు మాగుంటకు మహీధర్‌రెడ్డి కూడా టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది

వారికి అభినందనలు.. వీరిపై ఆరోపణలు

కనిగిరి సభలో
చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు
రాజకీయ సమీకరణల మార్పునకు సంకేతమా?



మాట్లాడుతున్న చంద్రబాబు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

అధికార వైసీపీలో టికెట్ల లొల్లి తీవ్రమై అనేక రాజకీయ పరిణామాలు చోటుచేసుకోబోతున్న తరుణంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు సంచలనమయ్యాయి. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను తిట్టాలన్న జగన్ షరతును వైసీపీకి చెందిన ఎంపీ మాగుంట, కందుకూరు ఎమ్మెల్యే మహీధరరెడ్డి తిరస్కరించిన నేపథ్యంలో టీడీపీ అధినేత చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. శుక్రవారం సాయంత్రం కనిగిరిలో జరిగిన సభలో చంద్రబాబునాయుడు ఉపన్యాసం చేశారు. అందులో ఆయన ఒక సందర్భంలో 'నన్ను, పవన్ కల్యాణ్‌ను, లోకేష్‌ను తిట్టాలంట. తిట్టిన వారికే ఎంపీ, ఎమ్మెల్యేల సీట్లు ఇస్తారంట. సమాజంలో సేవ చేసేవారికి సీటు ఇవ్వాలనుకోవడం సంస్కారం. ఇలా తిట్టినవారికి సీటు ఇవ్వాలనుకోవడం కుసంస్కారం. అయితే జగన్ షరతుకు అంగీకరించని ఈ జిల్లాకే చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు సంస్కారవంతులు. వారిని నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా.. మీరూ అభినందించాల్సిన అవసరం ఉంది' అని సభికులనుద్దేశించి చంద్రబాబు సూచన చేశారు. దానికి ప్రజల నుంచి హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. ఇటీవల ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డిలకు జగన్ ఇలాంటి షరతు పెట్టడం, వారు తిరస్కరించడం తెలిసిందే. ఈనేపథ్యంలో మాగుంట చంద్రబాబుకు టచ్‌లోకి వెళ్లారని తదనంతరం బాలినేనితో కూడా చర్చలు జరుపుతున్నారని ప్రచారం జరుగుతోంది. మహీధర్‌రెడ్డి కూడా మాగుంటకు టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమయంలోనే చంద్రబాబు వారిని అభినందించడంతో రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి.

మంత్రి సురేష్, ముగ్గురు ఎమ్మెల్యేలపై విమర్శలు

కనిగిరి సభలో మరోసారి ఒంగోలు లోక్‌సభ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలు అంటూ చంద్రబాబు కొన్ని వ్యాఖ్యానాలు చేశారు. తొలుత ఆయన కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ గురించి మాట్లాడుతూ ఇక్కడ ఎమ్మెల్యే బుర్రా పెద్ద అవినీతిపరుడు. ఆయన పేరు మనీసూదన్ అని విమర్శించారు. ఆయనకు అన్నింట్లో వాటా, దోపిడీల్లోనూ వాటా అంటూ కామెంట్ చేశారు. ఎర్రగొండపాలెంలో మంత్రి సురేష్‌ను ఉద్దేశించి.. 'ఆయన దుస్తులిప్పి తిరిగేవాడు. ఆయన్ను ట్రాన్స్‌ఫర్ చేసి కొండపికి పంపారు. ఎర్రగొండపాలెంలో పనికిరాని చెత్త కొండపిలో బంగారం అవుతుందా' అంటూ విమర్శనాస్త్రాలు సంధించారు. మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి గురించి మాట్లాడుతూ ఆయనో నయీం, ఆయన తమ్ముడో చోటా నయీం అని వ్యాఖ్యానిస్తూ ఈ మాటలు నేనే అనట్లా.. నియోజకవర్గంలో అందరూ అంటున్నారని వ్యాఖ్యానించారు. దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ గురించి మాట్లాడుతూ 'ఆయనకు అన్నిట్లో పర్సంటేజీలే. కుటుంబసభ్యులతో కలిసి వాటాలు తీసుకుంటారు. అదోరకం అవినీతి. చివరికి ఆయనకు జగన్ సీటే లేదు పొమ్మన్నాడు' అని వ్యాఖ్యానించారు. కొండపిలో ఒక అనామకుడికి తొలుత పదవి ఇచ్చాడని తాజా మాజీ వైసీపీ ఇన్‌చార్జి అశోక్‌బాబు గురించి వ్యాఖ్యానించి ఆయన్ను అడ్రస్ లేకుండా ఎక్కడికో పంపాడని చమత్కరించారు. చివర్లో ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి గురించి మాట్లాడుతూ.. జగన్ ఆయనకు అడ్రస్ లేకుండానే చేశాడంటూ ఒకే ఒక్క కామెంట్‌తో వదిలేశారు. అలాగే గిద్దలూరు ఎమ్మెల్యే 'నేను పోటీచేయను. నావల్ల కాదని పారిపోయాడు. అందుకు కారణం జగనే కదా' అంటూ వ్యాఖ్యానించారు. తాజా పరిణామాల నేపథ్యంలో చంద్రబాబు నిండుసభలో చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయవర్గాలలో పలు అనుమానాలను రేకెత్తించాయి. ఏ దృష్టితో ఆయన ఇలా మాట్లాడినప్పటికీ మాగుంట, బాలినేని, మహీధరరెడ్డి టీడీపీ వైపు చూస్తున్నారా? అన్న సందేహాలను రాజకీయ విశ్లేషకులు వ్యక్తంచేస్తున్నారు. అటు టీడీపీ, ఇటు వైసీపీ నేతల్లో కూడా చంద్రబాబు వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

విద్యార్థుల భవిష్యత్ కోసం 'మార్గదర్శి'

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 5 : బాల్యం నుంచే భవిష్యత్‌కు స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరు చుకునేలా విద్యార్థుల్లో అవగాహన కల్పించేందు కు జిల్లాలో అమలు చేస్తున్న మార్గదర్శిని కార్య క్రమాన్ని మెల్బోర్న్ యూనివర్శిటీ సహకారంతో మరింత ముందుకు తీసుకెళ్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ దిశగా తొలుత ఎంపిక చేసిన 20 పాఠశాలలు, 6 ప్రభుత్వ వృత్తివి ద్య జూనియర్ కాలేజీల్లోని 82 మంది ఉపాధ్యా యులు, లెక్చరర్లకు శుక్రవారం ఒంగోలులోని రా మచంద్రమిషన్ ప్రాంగణంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ విద్యార్థులకు భవిష్యత్తు, ఉద్యోగ అవ కాశాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ ఉన్నత విద్యావిభాగం, కెరియర్ ఎడ్యుకేషన్ ప్రా జెక్టు పేరుతో మెల్బోర్న్ యూనివర్శిటీతో అవ గాహన ఒప్పందం చేసుకుందన్నారు. మార్గదర్శిని పేరుతో జిల్లా యంత్రాంగం గత ఏడాది నుంచి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిన నేపథ్యంలో తొ లుత ప్రకాశం జిల్లా నుంచే కెరీర్ ఎడ్యుకేషన్ ప్రా జెక్టును కూడా ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. రాక్వెల్ షర్ప్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా లభిస్తున్న ఉద్యోగ అవకాశాలలో గణనీయంగా మార్పు వస్తుంద ని తెలిపారు. వాటికి తగినట్లుగా విద్యార్థులు ముందు నుంచే తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో డీఈవో సుబ్బారావు, మార్గదర్శిని జిల్లా నోడల్ అధికారి సామా సు బ్బారావు, ఆర్‌ఐవో సైమన్ విక్టర్, డీఐఈవో శ్రీని వాసరావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఏఎంవో రమేష్, సైన్స్ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. గత ఏడాది ఆగస్టు నుంచి డిసెంబరు వరకు అమలైన వివిధ సంక్షే మ పథకాలకు అర్హత ఉన్నా పలు కారణాలతో లబ్ధి పొందలేకపోయిన అర్హుల ఖాతాలలో శుక్ర వారం సీఎం జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గత ఆరు నెలల్లో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథ కాలలో అర్హత ఉన్నా లబ్ధి పొందలేకపోయిన 3173 మందికి రూ.4.73కోట్లు అందిస్తున్నట్లు తెలి పారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ డై రెక్టర్ విజయకుమార్, మైనార్టీ కార్పొరేషన్ డై రెక్టర్ మహబూబ్, అధికారులు వసుంధర, రవి కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, మార్కాపురం డీఎల్ డీవో సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవనిపై హరివిల్లు

- సప్తవర్ణ శోభితంగా సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణం
- ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన
- 180 మంది మహిళల హాజరు
- విజేతలకు బహుమతులు అందజేసిన డీఎస్పీ ప్రసాదరావు



లోగో వేస్తున్న విద్యార్థినులు

చీరాల, జనవరి 5: ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగుళూరు... రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన వారు సంయుక్తంగా సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల సౌజన్యంతో శుక్రవారం సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల(అటానమస్)లో నిర్వహించిన ముత్యాల ముగ్గులు పోటీలకు విశేష స్పందన లభించింది. పోటీలలో గెలుపొందిన విజేతలకు డీఎస్పీ ప్రసాదరావు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మహిళలు ప్రధానంగా విద్యార్థినులకు దిశ యాప్ విని యోగ ఆవశ్యకతను వివరించారు. సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడే విధంగా పోటీలు నిర్వహించినతీరు ప్రశంసనీయమన్నారు. ఆంధ్రజ్యోతి ప్రతినిధులు ఆళ్ల శ్రీనివాసరావు, సూర్యదేవర నవీన్‌బాబు మాట్లాడుతూ ఆనవాయితీగా ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

ఉదయం 8.30 గంటల నుంచి వివిధ ప్రాంతాల నుంచి పోటీలకు వచ్చేవారి కోసం కళాశాల వారు బస్సులను ఏర్పాటుచేశారు. పోటీలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 180 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముందుగా పోటీలను కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు, అక్రిడేషన్స్ కమిటీ మేనేజర్ డాక్టర్ సి. సుబ్బారావు ప్రారంభించారు. పోటీల అనంతరం పోటీలలో పాల్గొనేందుకు వచ్చిన వారి తిరుగుప్రయాణంకు బస్సు సౌకర్యం ఏర్పాటుచేశారు. ఎక్కడ ఎవరికి అసౌకర్యం కలగకుండా కళాశాల ఈవెంట్ టీం తగిన ఏర్పాట్లుచేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై అరుణజ్యోతి, ఆంధ్రజ్యోతి చీరాల వీసీ పరిధిలోని పలువురు విలేఖరులు, యాడ్స్ బాధ్యులు, కళాశాల విద్యార్థులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న సెయింట్‌ఆన్స్ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు, అక్రిడేషన్స్ మేనేజర్ డాక్టర్ సుబ్బారావు తదితరులు


ముగ్గులు వేస్తున్న మహిళలు


మొదటి బహుమతి పొందిన ముగ్గును చూస్తున్న కళాశాల, ఆంధ్రజ్యోతి ప్రతినిధులు


పోటీలకు విచ్చేసిన విద్యార్థినులు, మహిళలు

ఆర్థిక భరోసా కల్పించేందుకే రూ.3 వేల పెన్షన్: బలరాం


పెన్షన్ల పంపిణీ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరాం

చీరాల, జనవరి 5: అవసరార్థులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అర్హులైన ప్రతి ఒక్కరికి నెలకు రూ.3వేలు పెన్షన్‌గా సీఎం జగన్ ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. స్థానిక ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలోని ఓపేటీలో శుక్రవారం నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే బలరాం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న చేయూత చరిత్రాత్మకమన్నారు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ఆధారంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకా లు అందిస్తున్నట్టు చెప్పారు. ఆ చేయూతను లబ్ధిదారులు సద్వినియోగం చేసు కోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సరోజిని, అధికారులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


పంపిణీకి సిద్ధంగా ఉంచిన నిత్యావసర సరుకులు

చీరాల, జనవరి 5: ఇటీవల సంభవించిన తుఫాన్ నేపథ్యంలో బాధితులకు మార్పు సేవా సంస్థ ప్రతినిధులు శుక్రవారం మండల పరిధిలోని వాడరేవు తీర ప్రాంతవాసులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పాకల, ఎస్సీ కాలనీ, సునామీ కాలనీ, బెస్తకాలనీలలో సుమారు 700 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1500 విలువైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మార్పు గ్రెగోరి, సుశీల్‌కుమార్, ప్రేమ్‌కుమార్‌లు మాట్లాడుతూ సంస్థ పరంగా అందిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. అంతకు ముందు సంస్థ బాధ్యులు, స్థానికులతో కలసి తీరాన్ని, వారి నివాసాలన పరిసరాలను శ్రమదానంతో శుభ్రపరిచారు. ఆరోగ్య పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఎరిపిల్లి రమణ, చూగూడి సురేష్, మచ్చా సువార్త, మార్పు విన్సెంట్ పాల్, జోతుల ప్రకాష్, చేగూడి జాన్సన్ మార్పు వంశీ, పారా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించాలి

బల్లికురవ, జనవరి 5: గ్రామాలలో ఈనెల 12లోగా ఇంటింటికి తిరిగి కు ష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి నివేదిక ఇవ్వాలని గుంటుపల్లి పీ హెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహ్మద్ కోరారు. శుక్రవారం స్థానిక పీహెచ్ సీలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాలలో కుష్ఠు వ్యాధిగ్రస్థుల సర్వేపై చర్చించారు. అనంతరం వైద్య సిబ్బందితో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు రంగం సిద్ధం

- 'ఆడుదాం ఆంధ్ర పేరు'తో చదును
- స్వాధీనానికి అధికార పార్టీ నేతల యత్నాలు
- బహిరంగ మార్కెట్‌లో ఎకరా రూ.4 కోట్ల పైమాటే!


శింగరకొండ సమీపంలో చదును చేస్తున్న ప్రభుత్వ భూమి

అద్దంకి, జనవరి 5: ఆడుదాం ఆంధ్ర పోటీల నిర్వహణ సాకుతో ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు అధికార పార్టీ నేతలు రంగం సిద్ధం చేసుకున్నారు. శింగరకొండ వద్ద నామ్ రోడ్డుకు అత్యంత సమీపంలో కలవకూరు, గోపాలపురం రెవెన్యూల సరిహద్దులో శింగరకొండ పాలెం పంచాయతీ పరిధిలో సుమారు ఎకరా ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు సిద్ధం అయ్యారు.

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడు అద్దంకి వచ్చిన సమయంలో శింగరకొండ వద్ద హెలీప్యాడ్ నిర్మాణం చేశారు. ఆప్రాంతంలో ప్రభుత్వ భూమి ఉంది. ఈక్రమంలో ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు నిర్వహణకు కొంతమేర ప్రభుత్వ భూమిని చదును చేశారు. అయితే, కార్యక్రమాల నిర్వహణ వేరేప్రాంతంలో నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈఅవకాశాన్ని అందిపుచ్చుకొని పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేందుకు అద్దంకి పట్టణానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు రంగంలోకి దిగాడు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణకు సిద్ధం చేసిన స్థలానికి పక్కనే ఉన్న ఎర్రకుంట స్థలంలో సుమారు ఎకరా భూమిని గత రెండు, మూడు రోజుల నుంచి చదును చేస్తున్నారు. ఎవరైన ప్రశ్నిస్తే ఆడుదాం ఆంధ్ర పోటీల కోసం చదును చేస్తున్నామని చెబుతుండటం గమనార్హం. ఒకవైపు నామ్ రోడ్డు, మరో వైపు శింగరకొండ రోడ్డు అత్యంత సమీపంలో ఉండటంతో ఎకరం ధర సుమారు రూ.4 కోట్ల పైగానే ఉండవచ్చని అంచనా. అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని పరిరక్షించే విధంగా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ సుబ్బారెడ్డిని వివరణ కోరగా పరిశీలించి ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపడతానని తెలిపారు.

పేదల అభివృద్ధే లక్ష్యం

- కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పలు పథకాలు
- రాజ్యసభ సభ్యులు బాబుబాయ్ దేశాయ్


మార్టూరు: పూనూరులో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బాబుబాయ్ దేశాయ్, ఎంపీడీవో కృష్ణకుమారి తదితరులు

మేదరమెట్ల , జనవరి 5: కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధి కోసం అనేక పథకాలు అందిస్తుందని గుజరాత్‌కు చెందిన రాజ్యసభ సభ్యులు బాబుబాయ్‌దేశాయ్ తెలిపారు. శుక్రవారం మేదరమెట్ల మార్కెట్ యార్డులో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇస్తున్న సబ్సిడీ అధిక మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు మూడు శాతం వడ్డీ రాయితీ ఇస్తుందని చెప్పారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకానికి నిధులను కేంద్రమే అందిస్తుందన్నారు. అందులో భాగంగా గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం కూడా అందులో భాగమే నన్నారు. మహిళలకు రాయితీపై వంట గ్యాస్ వంటి పథకాలను కేంద్రం అందిస్తుందన్నారు. కేంద్రం రాయితీ ఇస్తున్న చాలా పథకాల గురించి ప్రజలకు తెలియజెప్పడమే వికసిత్ సంకల్ప యాత్ర లక్ష్యమని చెప్పారు.

కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, మేదరమెట్ల సర్పంచ్ బోనిగిల ఎలిశమ్మ, ఏపీఎం అనూరాధ, సంకల్పయాత్ర ఇన్‌చార్జ్ రాంబాబు, సమన్వయ కర్త అనుప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, కార్యదర్శి మండవ రామకృష్ణ, మాజీ సర్పంచ్ జజ్జర ఆనందరావు, పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు.

అన్నిరంగాలలో అభివృద్ధే ధ్యేయం

యద్దనపూడి(మార్టూరు), జనవరి 5: ప్రపంచ దేశాల్లో 2047 నాటికి అన్ని రంగాల్లో భారత్‌ను అగ్రగామి దేశంగా నిలపాలనన్నదే బీజేపీ లక్ష్యమని ఆపార్టీ రాజ్యసభ సభ్యులు బాబుబాయ్ దేశాయ్ అన్నారు. బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో వికసిత్ భారత్‌సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో జిల్లా నాయకులు లంకా సాంబశివరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. భారతదేశాన్ని అభివృద్ధి చేసే ఉద్దేశంతో గ్రామాలల్లో క్షేత్రస్థాయిలో ప్రవేశపెట్టిన పథకాల గురించి ప్రజలకు అవగాహన చేసేందుకు ఈసంకల్ప యాత్రను ప్రారంభించినట్లు బాబుబాయ్ దేశాయ్ అన్నారు. అందుకు ప్రతి పౌరుడు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, మండవ రామకృష్ణ, కె.సాంబశివరావు, ఎంపీడీవో కృష్ణకుమారి, సర్పంచ్ మేకా సుధాకర్, ఎంపీటీసీ వంకాయల సునీత, పంచాయతీ కార్యదర్శి భాగ్యరాజు, ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు గౌరవమేదీ..!

- మాట తప్పిన సీఎం
- 25వ రోజుకు చేరిన సమ్మె

అద్దంకిటౌన్, జనవరి 5: అంగన్‌వాడీ కార్యకర్తలను అక్క, చెల్లెమ్మలు అంటూ హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాట తప్పారని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు జి.శారద అన్నారు. గత 25 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోని సీఎం మాకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ఆమె ప్రశ్నించారు. తమ డిమాండ్‌ల సాధన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి 25వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీలను ఆకులు తిని బతకమంటుందని, ఇచ్చిన హామీలను గద్దె నెక్కిన తరువాత పరిష్కరించ కుండా అంగన్‌వాడీలను మోసం చేశారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. కార్యక్ర మంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అనిత, మనోలత, చంద్రామతి, భ్రమరాంబ, సౌభాగ్యం, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించం!

బల్లికురవ, జనవరి 5: శ్రమకు తగ్గ వేతనం ఇచ్చేవరకు నిరవధిక సమ్మెను విరమించబోమని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం టీమ్ లీడర్ నాగమణి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరింది. అధికారంలోకి రాక ముందు కల్లబొల్లి మాటలు చెప్పి ఇప్పుడు ముఖం చాటేసి అధికార పార్టీ నేతలు తిరుగుతున్నారని విమర్శించారు. ఎన్నిరోజులైన సమ్మె ను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో సం ఘ నేతలు అనురాధ, శ్రీలలిత, సునంద, సత్యవతి, సరస్వతి, జ్యోతి, శివపావని, వెంకటరమణ, అనుపమ, తదితరులు పాల్గొన్నారు.

మేదరమెట్ల: తమ న్యాయమైన డిమాండ్‌లు తీర్చేవరకు సమ్మెను విరమించబోమని అంగన్‌వాడీ నాయకురాళ్లు చైతన్య, కాంత్రి తెలిపా రు. శుక్రవారం కొరిశపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు తమ డిమాండ్‌ల సాధన కోసం 25 రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాదయాత్రలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చమని తాము అడుగుతున్నామన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నాలుగున్నరేళ్లుగా అమలు చేయకపోవడం, కనీసం చర్చలకు కూడా పిలవకపోవ డం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.


పర్చూరు సీడీపీవో కార్యాలయం ముందు బైటాయించి నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

కారంచేడులో వినూత్న నిరసన

కారంచేడు(పర్చూరు), జనవరి 5: అంగన్‌వాడీలు తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ చేపట్టిన నిరవధిక నిరదీక్షలు హోరెత్తుతున్నాయి. అయా ప్రభుత్వ కార్యాలయాల ముందు వినూత్న రీతిలో ప్రభుత్వ వైఖరికి వ్యతిరేఖంగా నిరసన గళం వినిపిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కారంచేడు తహసీల్దార్ కార్యాలయం ముందు దున్నపోతుకు వినతిప్రతం అందజేశారు.

ఈసందర్భంగా పలువురు అంగన్‌వాడీ వర్కర్ల నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అమలు చేయలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదన్నారు. సమ్మెను నీరుకార్చేందుకు ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలకు పాల్పడినా భయపడేది లేదని స్పష్టం చేశారు. అంగన్‌వాడీలకు మద్దతుగా సీఐటీయూ నాయకులు నిలిచారు.


కారంచేడులో దున్నపోతుకి వినతి పత్రం ఇస్తూ అంగన్‌వాడీల నిరసన


అద్దంకిలో ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

పంగులూరు: తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం సమ్మె చేపట్టిన అంగన్‌వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం పంగులూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మెకు వారు మద్దతు ప్రకటించారు. సమస్యల సాధనకోసం సమ్మె బాటపట్టిన కార్యకర్తలకు రూ.ఐదు వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నేతలు రావి శ్రీనివాసరావు, టి.నరసింహారావు, బి.సుబ్బారావు, ప్రసాద్, ఏడుకొండలు, కేమా శ్రీను, శిరిగిరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

పర్చూరు, జనవరి 5: తమ న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృత్వం చేస్తామని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. నివరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం పర్చూరులోని సీడీపీవో కార్యాలయం ముందు అంగన్‌వాడీలు బైటాయించి చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్రం కన్నా అదనంగా వెయ్యి రూపాయలు పెంచి ఇస్తామని కల్లబొల్లి మాటలతో అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇప్పుడు ముఖం చాటువేస్తున్నారని విమర్శించారు. తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యాకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

వంటావార్పుతో కార్మికుల నిరసన


అద్దంకిలో వంటావార్పుతో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

అద్దంకిటౌన్, జనవరి 5: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా శిబిరంలో కార్మికులు వంటావార్పు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పెనుబాక ఆదాం, బత్తుల కృష్ణ, గాలి బీష్మా, మాలెపోగు అంజమ్మ, దాసరి అలివేలు, దాసరి వీరయ్య, యర్రమోతు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

చీరాల: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె, నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న నిరసన శిబిరం వద్ద వంటావార్పుతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ ప్రతినిధులు కార్మికులకు మద్దతుగా పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం


అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

యద్దనపూడి (మార్టూరు), జనవరి 5: యద్దనపూడి మండలం పెదజాగర్లమూడి గ్రామంలో 23వ నంబరు రేషను షాపుపై బాపట్ల సివిల్ సప్లయ్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. అదనంగా ఉన్న 15 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషను డీలర్, ఎండీయూ వాహన డ్రైవలపై 6ఏ కేసు నమోదు చేసినట్లు డీటీ ఓంకార్ తెలిపారు. స్వాధీ నం చేసుకున్న బియ్యాన్ని తమ కస్టడీలో ఉంచుకున్నట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు తెలిపారు. ఈ తనిఖీలలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అబ్రహం, కిషోర్, ఆర్ఐ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు రుణాలిచ్చి ఆదుకుంటాం!

బల్లికురవ, జనవరి 5: గ్రామాలలో నిరుపేదలను పేదరికం నుంచి విముక్తి కల్పించేలా పలు రకాల రుణాలను అందించే చర్యలు చేపడుతున్నట్టు చీరాల ఏపీఎం గద్దె సుబ్బారావు తెలిపారు. శుక్రవారం బల్లికురవ వైఎస్ఆర్ ఇందిరా క్రాంతి పథం కార్యాలయంలో లక్‌పతి దీదీ కార్యక్రమంలో గ్రామైక్య సంఘాల వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా శిక్షకులు సుబ్బారావు మాట్లాడుతూ గ్రామాలో ఉన్న నిరుపేదలను గుర్తించాలన్నారు. త్వరలో క్లస్టర్ల వారీగా గుర్తించి బ్యాంకు రుణాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఏపీఎం సురేంద్రబాబు, సీసీలు పాల్గొన్నారు.

గ్రానైట్ ఫ్యాక్టరీలను తనిఖీ చేసిన మైనింగ్ అధికారులు

బల్లికురవ, జనవరి 5: బిల్లులు లేకుండా అక్రమ మార్గంలో గ్రానైట్ స్లాబులు తరలించకుండా మైనింగ్ అధికారులు శుక్రవారం పలు గ్రానైట్ ఫ్యాక్టరీలను తనిఖీ చేశారు. బల్లికురవ మండల కేంద్రంలో ఉన్న పలు ఫ్యాక్టరీలలో ఉన్న నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏడీ ఆదేశాల మేరకు ఫ్యాక్టరీలను తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ తనిఖీలలో మైనింగ్ శాఖ ఆర్ఐ రాజు, టీఏ భాస్కర్ పాల్గొన్నారు.

11న కబడ్డీ పోటీలు

ఇంకొల్లు, జనవరి 5: ఇంకొల్లు మండలంలోని వంకాయలపాడులో శ్రీసాయిరామ గురుకుల్ స్కూల్ ఆవరణలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 11,12 తేదీలలో ఉదయం 9 గంటల నుండి బాపట్ల, ప్రకాశం(ఉమ్మడి) జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు ఆదర్శ స్కూల్ డైరెక్టర్ తోటకూర విజయభాస్కర్ తెలిపారు. మొదటి బహుమతి రూ. 15,666, 2వ బహుమతి రూ.10,666, 3వ బహుమతి రూ.7666, నాల్గో బహుమతి రూ.5666, ఐదో బహుమతి రూ.3666 అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 8374149626 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఇంకొల్లులో పారిశుధ్య కార్మికుల సమ్మె విరమణ


కార్మికులకు లిఖితపూర్వకంగా హామీ ఇస్తున్న ఇంకొల్లు పంచాయతీ కార్యదర్శి

ఇంకొల్లు, జనవరి 5: ఇంకొల్లు పంచాయతీ పారిశుధ్య కార్మికులు బకాయి జీతాల కోసం 14 రోజులుగా విధులు బహిష్కరించి చేపట్టిన సమ్మె శుక్రవారం విరమించినట్లు సీఐటీయూ మండల కార్యదర్శి వెంకట్రావు తెలిపారు.శుక్రవారం ఇంకొల్లు పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన గ్రామ సభలో పారిశుధ్య కార్మికులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. గ్రామస్థులు కార్మికుల పక్షాన వారి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. స్పందించిన గ్రామకార్యదర్శి కోటినాగయ్య మూడు నెలల జీతాలు ఈ నెల 12లోగా అందజేస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. దీంతో శని వారం నుంచి పారిశ్యు కార్మికులు యథావిధిగా విధుల్లోకి హాజరవుతారని తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

యద్దనపూడి(మార్టూరు) , జనవరి 5: యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలో వ్యక్తి ఇంటిలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. ఇంటిలో ఎవరూ లేనిసమయంలో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. అమృతికి గల కారణాలు తెలియలేదు. ఈవిషయంపై ఎలాంటి సమాచారం రాలేదని ఎస్ఐ నాగశ్రీను తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో గ్రానైట్ కార్మికుడు మృతి

మార్టూరు , జనవరి 5: మార్టూరులోని ఓ గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్న అస్సోం రాష్ట్రానికి చెందిన గ్రానైట్ కార్మికుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు సాయంత్రం ఆరు గంటల సమయంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని ద్విచక్రవాహనంపై తీసుకువచ్చినట్లు తెలిసింది. కొంతసేపటికే తీవ్రగాయాలైన వ్యక్తి మృతి చెందినట్లు తెలిసింది. ప్రభుత్వ ఆసుపత్రికి తిసుకువచ్చిన వ్యక్తులు అతని గురించి సమాచారం చెప్పకుండా వెళ్ళిపోయినట్లు తెలిసింది. ఎస్ఐ ఎం.శ్రీనివాసరావును వివరణ అడుగగా ఈవిషయపై పూర్తి సమాచారం సేకరిస్తున్నామన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


పింఛన్‌లు పంపిణీ చేస్తున్న హనిమిరెడ్డి

అద్దంకి, జనవరి 5: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి అన్నారు. అద్దంకి మండలంలోని పలుగ్రామాలలో మంజూరైన వైయస్ఆర్ పెన్షన్ కానుక పత్రాలను లబ్ధిదారులకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అవిశన జ్యోతి, ఎంపీడీవో దేవసేన కుమారి, వైసీపీ నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి, వైసీపీ మండల అధ్యక్షుడు గుజ్జుల జగన్మోహనరెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు అవిశన ప్రభాకరరెడ్డి, ఇస్తర్ల వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో ఏసీబీ కలకలం

నెల్లూరు(సిటీ), జనవరి 5 : నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏసీబీ కలకలం రేగింది. శుక్రవారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయానికి ఏసీబీ అధికా రుల బృందం వచ్చింది. కమిషనర్‌తో భేటీ అనంతరం ఇద్దరు రెవెన్యూ అధికారులను విచారణ నిమిత్తం వారి కార్యాలయానికి తీసుకెళ్లినట్లు తెలిసింది. వారిలో ఒకరు ఆర్వోకాగా మరొకరు ఆర్ఐ అని సమాచారం. మాగుంట లేవుట్‌లోని ఓ భవనానికి నిబంధనలు ఉల్లఘించి పన్ను వేశారన్న ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కాగా, ఏసీబీ అధికారుల రాకతో కార్పొరేషన్ ఉద్యోగుల్లో ఆందోళన రేగింది.




● కావలిలో..

ఇలపై రంగులు పోసినట్టు.. ప్రతి చుక్కా ముగ్గు కోసమే అన్నట్టు తెలుగు సంప్రదాయం ఒట్టిపడేలా నారీమణులు వేసిన రంగవల్లులు అందరినీ కట్టిపడేశాయి.

సంక్రాంతి పండుగ ముందే వచ్చిందా!? అన్నరీతిలో వేసిన ముగ్గులు ముచ్చట గొలిపాయి. ఏబీఎన్, ఆంధ్రజ్యోతి నిర్వహించిన కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు బెంగుళూరు, రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన్ సారథ్యంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నెల్లూరులోని చందనా బ్రదర్స్, సీఎంఆర్ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో శుక్రవారం ముత్యాల ముగ్గులు ఉత్సాహభరితంగా జరిగాయి. నెల్లూరు, కావలి, గూడూరు ప్రాంతాల్లో నారీమణులు భారీగా తరలివచ్చి వారిలోని సృజనాత్మకతను వెలికితీసి ముగ్గులు వేశారు. ప్రతి కేంద్రంలో ప్రథమ విజేతలకు పట్టు చీర, ద్వితీయ విజేతకు వర్క్ శారీ, తృతీయ విజేతకు డిజైనర్ శారీలతోపాటు కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. అలాగే పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు.

మంత్ర ముగ్గులై..!

ఉత్సాహంగా 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' రంగవల్లుల పోటీలు ● నెల్లూరు, కావలి, గూడూరులలో నిర్వహణ

● విజేతలు వీరే..


నెల్లూరు : ప్రథమ విజేత సునీతకు బహుమతి అందజేస్తున్న కమిషనర్ వికాస్ మర్మత్, వాసు, పెంచలయ్య తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని వీఆర్ హైస్కూల్ మైదానంలో జరిగిన రంగవల్లుల పోటీలకు మహిళలతోపాటు విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలు బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి, పి.సుజాత రెడ్డి, ఏటూరి పద్మ ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, చందనా బ్రదర్స్, సీఎంఆర్ షాపింగ్‌మాల్ అధినేత మావూరి శ్రీనివాసరావు, రాజీ యాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ హరికృష్ణ తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు.

● **కావలి :** పట్టణంలోని రైల్వే రోడ్డులో ఉన్న కరోనేషన్ రీడింగ్ రూమ్ ఆవరణలో జరిగిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. పోటాపోటీగా వేసిన ముగ్గులలో విజేతలను నిర్ణయించేందుకు న్యాయనిర్ణేతలు ఎంతో శ్రమించి వారి మెదడుకు పదునుపెట్టాల్సి వచ్చింది. చివరకు ఉపాధ్యాయిని, గాయకురాలు ఉమాశర్మ, సామాజిక కార్యకర్త పార్వతీశంకర్‌లు విజేతలను ఎంపిక చేశారు. ముఖ్య అతిథులుగా ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, శ్రీధర్ మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ వైద్యురాలు ఝాన్సీ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.


కావలి : ఆర్డీవో శీనానాయక్, కమిషనర్ శ్రావణ్‌కుమార్ నుంచి మొదటి బహుమతి అందుకుంటున్న విద్యాధరణి




2, 3వ విజేతలు జయ, అఖిల ఆదిశేషమ్మ

● **గూడూరు :** పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల మైదానంలో జరిగిన పోటీలకు మహిళలు తరలివచ్చి ఉత్సాహంగా ముగ్గులు వేశారు. న్యాయనిర్ణేతలుగా సునీత సేవాసంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి, సభ్యురాళ్లు మహిత, గ్రీష్మ పురోహిత్ వ్యవహరించి, విజేతలను ఎంపిక చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పనుల ఒత్తిడిలో మహిళలు సతమతమవుతున్న తరుణంలో వారిలో ఉత్సాహాన్ని, సంప్రదాయ విలువలను, కళాత్మకతను వెలుగులోకి తెచ్చేందుకు ఆంధ్రజ్యోతి -ఏబీఎన్ ఈ పోటీలను నిర్వహించడం అభినందనీయమని ప్రసంశించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.


నెల్లూరు : ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు, న్యాయనిర్ణేతలు


గూడూరు : డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి నుంచి మొదటి బహుమతి అందుకుంటున్న ఝాన్సీరాణి




కావలిలో ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకుంటున్న వరలక్ష్మి, శ్రీదేవి


ద్వితీయ విజేత ఎన్.సుశ్మిత


తృతీయ విజేత ఆర్.యమున


గూడూరులో ముగ్గులు వేస్తున్న మహిళలు


మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

అంగన్‌వాడీ-వేడి

25వ రోజూ కొనసాగిన సమ్మె ● ఆర్‌టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ సంఘీభావం

నెల్లూరు (వైద్యం), జనవరి 5 : జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. శుక్రవారానికి వీరి సమ్మె 25వ రోజుకు చేరుకుంది. అన్ని ఐసీడీఎస్ కేంద్రాల వద్ద అంగన్‌వాడీ సిబ్బంది ధర్నా చేశారు. నెల్లూరులోని ఐసీడీఎస్ జిల్లా కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు ఆర్‌టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ నేతలు సంఘీభావం తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అంగన్‌వాడీల విషయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైఖరి మారాలన్నారు. ఇన్ని రోజులుగా సమ్మె చేస్తుంటే సమస్యను సానుకూలంగా పరిష్కరించాల్సిన ప్రభుత్వం, విధుల్లోకి చేరాలని సిబ్బందికి నోటీసులు పంపించటం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణలో అంగన్‌వాడీలకు రూ.18వేలు ఇస్తున్నారని, ఆ మొత్తానికి జగన్ ఇచ్చిన హామీ మేరకు మరో వెయ్యి చేర్చి వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, నాగేంద్రరావు, ఎస్‌కే మౌలాలి. ఏవీఎస్ రెడ్డి, అంగన్‌వాడీ యూనియన్ నేతలు కామాక్షమ్మ, రజనీ, మల్లెమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


ధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీలు

కందుకూరు వైసీపీలో
కొనసాగుతున్న సస్పెన్స్

● ఎమ్మెల్యే మహీధరరెడ్డికి విజయసాయి ఫోన్?

కందుకూరు, జనవరి 5 : కందుకూరు వైసీపీలో నెలకొన్న సస్పెన్స్ కొనసాగుతోంది. టీడీపీ అగ్రనేతలు చంద్రబాబునాయుడు, లోకేష్‌లను వ్యక్తిగతంగా విమర్శించాలని, లేనిపక్షంలో టికెట్ విషయం పునరాలోచించాల్సి వస్తుందని అధికార పార్టీకి చెందిన నేతల ద్వారా సీఎం జగన్ మహీధరరెడ్డికి సమాచారం పంపిన విషయం తెలిసిందే. అయితే, ఇందుకు సున్నితంగా మహీధర్ రెడ్డి తిరస్కరించడంతో చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో వైసీపీలో నెం.2గా గుర్తింపు పొందిన విజయసాయిరెడ్డి నేరుగా మహీధరరెడ్డితో సంప్రదింపులు జరిపేందుకు కందుకూరు వస్తున్నారన్న సమాచారం శుక్రవారం ఉదయం వచ్చింది. ఈ విషయాన్ని కొందరు నాయకులు ఎమ్మెల్యేకు తెలపడంతో తనకు ఎలాంటి సమాచారం లేదని వారితో పేర్కొన్నారు. కాగా, ఆయన పర్యటన రద్దయినట్లు తెలియగా, 10 గంటల ప్రాంతంలో మహీధర్‌రెడ్డికి విజయసాయి ఫోన్ చేసినట్లు సమాచారం. వారి మధ్య ఏం సంభాషణ జరిగిందన్న విషయం బయటకు రాకపోయినా సీఎం జగన్ దగ్గరే ఉండి విజయసాయిరెడ్డి ఫోన్‌చేసి మాట్లాడినట్లు సమాచారం. ఆ తర్వాత ఎమ్మెల్యే గుడ్లూరులో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని సీఎం జగన్ పరిపాలనను కీర్తిస్తూ తన ప్రసంగాన్ని కొనసాగించారు



మధ్యలోనే జంప్!

నటుడు ఆలీ ప్రసంగిస్తుండగానే వెళ్లిపోయిన జనం

రాపూరులో వెలవెలబోయిన సామాజిక బస్సు యాత్ర

రాపూరు, జనవరి 5 : అధికార వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక బస్సు యాత్రకు జనం కరువవుతున్నారు. రాపూరులో శుక్రవారం సాయంత్రం సామాజిక బస్సు యాత్ర కార్యక్రమంలో భాగంగా జరిగిన బహిరంగ సభ ప్రజలు లేక వెలవెలబోయింది. ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారుడు, నటుడు ఆలీ ప్రసంగిస్తుండగానే జనం ఒక్కొక్కరుగా లేచి వెళ్లిపోయారు. ఆ తర్వాత కర్నూలు ఎమ్మెల్యే అఫీజ్, నెల్లూరు మేయర్ స్రవంతి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నాగార్జునయాదవ్ తదితరులు ప్రసంగిస్తుం డగానే జనం వెళ్లిపోవడం తో ఖాళీ కుర్చీలు మిగిలాయి. అక్కడున్న అధికారు లు, పోలీసులు సభ నుంచి ప్రజలు వెళ్లనీయకుండా చేసేందుకు నానా తంటా లుపడ్డారు. మరోవైపు ఈ సభలో పాల్గొనేందుకు ఒక్కొక్కరికి రూ.300 నగదుతోపాటు క్వార్టర్ మద్యం సీసా ఇచ్చినట్టు సమాచారం. ఇంత చేసినా జనస్పందన లేకపోవడంతో వైసీపీ నాయకుల్లో అసహనం నెలకొన్నట్టు కనిపించింది.

జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించు తల్లీ..!

● ఇరగాళమ్మకు మున్సిపల్ కార్మికుల పొర్లుదండాలు



నెల్లూరు(సిటీ), జనవరి 5 : ఇచ్చిన మాట నిలబెట్టుకుని, కార్మికుల హక్కులను కాపాడే విధంగా సీఎం జగన్‌కు మంచి బుద్ధిని ప్రసా దించు తల్లీ.... అంటూ మున్సిపల్ కార్మికులు నెల్లూరు గ్రామదేవత ఇరగాళమ్మ గుడిలో పొర్లుదండాలు పెడుతూ నిరసన తెలిపారు. శుక్రవారం 11వ రోజు సమ్మెలో భాగంగా ఇరగాళమ్మ సన్నిధికి ఎదురుగా పొర్లుదండాలు పెట్టారు. వేపమండలతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు పెంచల నరసయ్య, కిన్నెర కుమార్, కామాక్షమ్మ మాట్లాడుతూ ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు ఎన్ని సమస్యలు ఎదుర్కొంటున్నా జగన్ ప్రభుత్వంలో కనీస స్పందన కనిపించడం లేదని విమర్శించారు. అనంతరం పాత మున్సిపల్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. నాయకులు కత్తి శ్రీనివాసులు, సూర్యనారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు అంగన్‌వాడీల సమ్మె ఆగదు

ఆత్మకూరు, జనవరి 5: సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం వారు విధులను బహిష్కరించి ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన ప్రత్యేక శిబిరంలో బైఠాయించి సమ్మెను కొనసాగించారు. ఈ క్రమంలో అటువైపు వెళుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కారును అడ్డగించి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరీ, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.



వరికుంటపాడు: ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అనంతసాగరం: సమస్యల పరిష్కారం కోసం అనంతసాగరంలో శుక్రవారం అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. 25 రోజులగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. కార్యక్రమ ంలో సీఐటీయూ, ఆవాజ్ నాయకులు అన్వర్‌బాషా, మస్తాన్, రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. డిమాండ్ల సాధనలో భాగంగా శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్ వాడీ నాయకురాళ్లు మహాలక్ష్మి, చాంద్‌బేగం, ప్రమీలా తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా శుక్రవారం మెడకు ఉరితాళ్లు బిగించుకొని చెట్టుకు వేలాడుతూ వినూత్నంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు షేక్ రజియా మాట్లాడుతూ కనీస వేతనం పెంచకపోతే నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక ఎమ్మార్వో కార్యాలయ ప్రాంగణంలో అంగన్వాడీలు దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ నాయకులు కోడె రమణయ్య, ఆదిలక్ష్మి, కుమారి, చంద్రమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె



పొర్లుదండాలతో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు, జనవరి 5 : మున్సిపల్ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె 11వ రోజుకు చేరింది. ఈ క్రమంలో శుక్రవారం వారు తమ విధులను బహిష్కరించి స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద పొర్లుదండాలు పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు, ఏఐటీయుసీ మున్సిపల్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ఏఎస్ పేట, జనవరి 5: హసనపురం, ఏఎస్ పేట గ్రామాలలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి దేవసేన ఏఎస్ పేట మండల వ్యవసాయ అధికారిణి రజినితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో చిరంజీవి పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

ఆత్మకూరు, జనవరి 5 : పేదరిక నిర్మూలనే లక్ష్యం అని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం ఆత్మకూరు అర్బన్, రూరల్ పరిధిలోని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ జేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె మధులత, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్, మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు, చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందూరు వెంకటరమణారెడ్డి, జేఏసీ కన్వీనర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడ ఆదిశేషయ్య, అల్లారెడ్డి ఆనందరెడ్డి పాల్గొన్నారు.

చేజర్ల : ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం చేజర్లలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. చేజర్లలో రైతుభరోసా కేంద్రం ప్రారంభోత్సవం, జలజీవన్ పథకానికి శంకుస్థాపన, పింఛన్ల పంపిణీ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్య క్రమంలో ఎంపిపి తూమాటి విజయభాస్కర్ రెడ్డి, జెడ్‌పిటిసి పీర్ల పార్థసారధి, సొసైటీ చైర్మన్ వీరరాఘవరెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్లు మైనారిటీ నాయకులు షేక్ సిరాజుద్దీన్, ఎంపిడివో కరీముల్లా, తహసీల్దారు పి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలు దేశాభివృద్ధికి ఉపయోగపడాలి

ఉదయగిరి రూరల్: వ్యవసాయ రంగంలో చేసే ప్రతి పరిశోధన దేశాభివృద్ధికి ఉపయోగపడాలని ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి జే అంజయ్య, ఉదయగిరి సీఐ గిరిబాబులు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్‌డే కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాలొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ టీ గోపీకృష్ణ, కళాశాల విభాగాధిపతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

ఉదయగిరి రూరల్ : ప్రకృతి వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులకు ప్రకృతి వ్యవసాయ సాగుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి ప్రోత్సహించాలని డీఆర్సీ మునిరత్నం పేర్కొన్నారు. శుక్రవారం రైతు భరోసా కేంద్రంలో క్షేత్రస్థాయి సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఆశీర్వాదం, మండల యాంకర్ వెంకటలక్ష్మమ్మ, చందు తదితరులు పాల్గొన్నారు.

బాలామృతం పంపిణీ

వింజమూరు : పంచాయతీ పరిధిలో నాలుగవ సచివాలయాన్ని శుక్రవారం తహసీల్దారు చొప్పా రవీంద్రబాబు, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసులు సందర్శించారు. అనంతరం బాలింతలకు, గర్భిణులకు బాలామృతం పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు- భూరక్షపై గ్రామసభ

సీతారామపురం : మండలంలో జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష కార్యక్రమంలో భాగంగా సర్వే పూర్తిఅయిన సింగారెడ్డిపల్లికి సంబం ధించి గ్రామసభను మండల తహసీల్దార్ ఎం వికే సుధాకర్‌రావు అధ్యక్షతన సింగారెడ్డిపల్లి సచివాలయంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత

మర్రిపాడ : స్థానిక హైస్కూల్ ఆవరణలో శుక్రవారం సాహో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పడచల నాగేశ్వరావు పేద విద్యార్థులకు సంక్రాంతి కానుకగా బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ధనలక్ష్మి, శాంతి, మాజీ ఎంపీపీ రమణయ్య, మాజీ విద్యాశాకాధికారి సత్యనారాయణ, రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మర్రిపాడు : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన నందవరం చెక్‌పోస్టు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగింది. నెల్లూరు నుండి కడప వైపు వెళ్తున్న కారు గేదెను ఢీకొనటంతో గేదె రోడ్డుకు అడ్డంగా పడింది. అదే సమయంలో ఆ గేదెను నెల్లూరు వెళ్తున్న మరో కారు ఢీకొని ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయణిస్తున్న ఇద్దరు, లారీ డ్రైవర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసునమోదు చేసి విచారిస్తున్నారు.

టీడీపీ నాయకులకు నోటీసుల జారీ

ఉదయగిరి రూరల్, జనవరి 5: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో తెలుగు దేశం పార్టీ నాయకులను అదుపులోకి తీసుకొని నోటీసులు జారీ చేసినట్లు కావలి డీఎస్పీ వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గతనెల 29న ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణకు సంబంధించి ఉన్నెమొదల గురవయ్య తనపై దాడి చేసి కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేయడంతో మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి, ముజ్జె లక్ష్మినారాయణ, జాఫర్‌సాహెబ్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఆ కేసుకు సంబంధించి వారిని అదుపులోకి తీసుకొని నోటీసులు జారీ చేశామన్నారు. కేసుపై విచారణ చేపడుతున్నామని, త్వరలో ఛార్జిషీట్ వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వేల్పుల గిరిబాబు, ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విలేఖరులతో మాట్లాడుతున్న డీఎస్పీ

నూరు శాతం పన్నులు వసూలు చేయాలి

ఉదయగిరి రూరల్, జనవరి 5: మండలంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు మార్చి 31వ తేదీలోపు నూరు శాతం పన్నులు వసూలు చేయాలని ఈవోపీఆర్డీ మల్లికార్జున శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటి పన్నులు చెల్లించేవారు ఫోన్‌పే, ఆన్‌లైన్, క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా నగదు చెల్లింపులు చేయాలన్నారు. మండలంలోని తిరుమలాపురం, ఆర్లపడియ, కృష్ణంపల్లి, శకునాలపల్లిలో రీసర్వే జరుగుతుందని, గృహాల యజమానులు సర్వే సిబ్బందికి సహకరించాలన్నారు.

బొల్లినేనిని విమర్శించడం తగదు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జనవరి 5: ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావును స్థాయి మరిచి వైసీపీ నాయకులు విమర్శించడం తగదని మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కండ్లగుంట వెంకటరెడ్డి, మాజీ జడ్పీటీసీ చీదర్ల మల్లికార్జునలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు విలేఖరులతో మాట్లాడుతూ నియోజకవర్గానికి మూడు జాతీయ రహదారులను తీసుకొచ్చి అభివృద్ధి చేసిన ఘనత బొల్లినేనికే దక్కుతుందన్నారు. ఇకపై ఇలాంటి చౌకబారు విమర్శలు చేస్తే ప్రజలు తగిన బుద్ధి చెపుతారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాకర్ల మధు, ఏలూరి హనుమంతునాయుడు, కృష్ణారెడ్డి, రఘు, శ్రీనివాసులు, కొండారెడ్డి పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

అనంతసాగరం, జనవరి 5: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని గూడూరు ఉప విద్యాధికారి రఘురామయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి, ఉప్పలపాడు, మంచాలపల్లి, సోమశిల ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేసి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బాలకృష్ణారెడ్డి ఉన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే చర్యలు

ఆత్మకూరు, జనవరి 5 : స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని డిసీపీఎన్‌డిటి జిల్లా ప్రోగామ్ అధికారులు బి శ్రీనివాస రావు, కె కనకరత్నం తెలిపారు. శుక్రవారం వారు ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాల, కెకెఆర్, అభిరామ్ హాస్పటల్స్‌తో పాటు నిత్య డయాగ్నోస్టిక్స్ క్లియర్ స్కాన్ స్కానింగ్ సెంటర్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు స్కానింగ్ సెంటర్‌ల వద్ద ధరల పట్టిక, ప్రచార బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి నెలా గర్భిణులకు సంబంధించిన వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.



అభిరామ్ హాస్పటల్‌లో స్కానింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా ప్రోగామ్ అధికారులు

ఆడుదాం ఆంధ్రా క్రీడలను విజయవంతం చేయండి

ఉదయగిరి రూరల్, జనవరి 5: మండల స్థాయిలో ఈనెల 10 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో జరిగిన క్రీడా పోటీల్లో విజేతలైన క్రీడాకారులు మండలస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

వరికుంటపాడు: ఆడుదాం ఆంధ్రా క్రీడాకారులకు ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడాదుస్తులను శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీదేవి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో షావుద్దీన్, పీఈటీలు, పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షితలు

ఉదయగిరి రూరల్, జనవరి 5: ఉదయగిరి పట్టణంలో అయోధ్య రామ జన్మభూమి ట్రస్టు నుంచి వచ్చిన అక్షింతలు, కరపత్రాలను శుక్రవారం రామసేవకులు ఇంటింటా పంపిణీ చేశారు. ఈనెల 15వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో అక్షింతలు, కరపత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. విగ్రహ ప్రతిష్ఠ రోజున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం సమయంలో దీపాలు వెలగించాలన్నారు.



అంక్షితలు పంపిణీ చేస్తున్న రామసేవకులు

వైద్యశిబిరం ప్రారంభం

వరికుంటపాడు, జనవరి 5: గణేశ్వరాపురం సచివాలయ ప్రాంగణంలో శుక్రవారం రెండో విడత సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డైరక్టర్ బాదం నారాయణరెడ్డి రోగులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో చేవూరి. శ్రీదేవి, సర్పంచ్ వడ్లపల్లి తిరుపతయ్య, వైద్యులు షేక్ కరిష్మా, కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సమీర్, వార్డు సభ్యులు సింగమరెడ్డి. సుబ్బరాయుడు, సచివాలయ, వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం : మండలంలోని సింగారెడ్డిపల్లి సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష 2వ విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపిడిఓ భార్గవి, డాక్టర్ స్వప్న, వైసీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ బాలినేని మాబయ్య, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, సచివాలయసిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వింజమూరు: మండలంలోని ఊటుకూరు గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రొడ్డ వెంగమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డ్వామా పీడీ వెంకట్రావు హాజరయ్యారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఈవీఎంలపై అవగాహన

కావలి : ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానంపై ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్ కుమార్ శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఓటర్లకు, బీఎల్వోలకు అవగాహన కల్పించారు. ఈవీఎంలో దేనికి ఓటు నొక్కితే దానికి పడుతుందా లేదా, అవి ఎలా పనిచేస్తున్నాయనే దానిపై వివరించారు.

ప్రాచీన సంప్రదాయాలకు ముగ్గులు ప్రతీతి

● కావలి ఆర్డీవో శీనానాయక్ ● ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలకు విశేష స్పందన

కావలిటౌన్, జనవరి 5: ప్రాచీన సంప్రదాయ కళలకు ప్రతీతి ముగ్గులని కావలి ఆర్డీవో శీనానాయక్ పేర్కొన్నారు. "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన" సారథ్యంలో నెల్లూరులోని చందన బ్రదర్స్, సీఎంఆర్ షాపింగ్‌మాల్ ఆధ్వర్యంలో శుక్రవారం కావలి పట్టణం రైల్వే రోడ్డులోని కరోనేషన్ రీడింగ్ రూమ్ ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులను తీర్చిదిద్దడంతో కరోనేషన్ రీడింగ్ రూమ్ ప్రాంగణంలో సంక్రాంతి శోభ సంతరించుకుంది. సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా వివిధ సందేశాలతో వేసిన రంగవల్లులు అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, శ్రీధర్ మల్టీ స్పెషలిటీ ఆసుపత్రి వైద్యురాలు కె.ఝాన్సీ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలు అంతరించిపోతున్న తరుణంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు నిర్వహించి మహిళలను ఒక వేదికపై చేర్చడం శుభపరిణామమన్నారు. మన సంస్కృతి సంప్రదాయలను కలకాలం కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సంస్కృతిని కొనసాగిస్తూ భావితరాలు అలవర్చుకునే విధంగా కృషి చేయాలన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని చాటేవే ముగ్గులని డాక్టర్ కే.ఝాన్సీ అన్నారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన ఉపాధ్యాయిని, గాయకురాలు ఉమాశర్మ, సామాజిక కార్యకర్త పార్వతీశంకర్ ముగ్గుల విశిష్టత, ఔన్నత్యం గురించి వివరించారు.



మాట్లాడుతున్న ఆర్డీవో శీనా నాయక్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు



ప్రోత్సాహక బహుమతి అందుకుంటున్న అనూష, పద్మ, నాగమణి

బొల్లినేనిని విమర్శించే స్థాయి కాటం రవీంద్రకు లేదు

కలిగిరి, జనవరి 5: అభివృద్ధి విషయంలో ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావును విమర్శించే స్థాయి వైసీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రరెడ్డికి లేదని మండల టీడీపీ, జనసేన అధ్యక్షులు బిజ్జం కృష్ణారెడ్డి, బండారు లక్ష్మీనారాయణ హితవు పలికారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ నాలుగేళ్లగా అవినీతిలో మునిగిపోయి, పర్సెంటేజీలతో అక్రమార్జనలో మునిగిపోయిన కాటం రవీంద్రరెడ్డి మాజీ ఎమ్మెల్యే బొల్లినేనిని విమర్శించేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవడంతోపాటు, స్థాయిని తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఊసా మాల్యాద్రి, పూసాల వెంగపనాయుడు, స్వర్ణ కొండయ్య, బొగ్గవరపు వేణు, నిశ్శంకర సురేష్, ఎం.శ్రీనివాస్, ఎల్.రాంబాబు, కొండపల్లి వెంకట్రావు, కె దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె




ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ కార్మికులు

కావలి, జనవరి 5: మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద వేర్వేరుగా శిబిరాలు ఏర్పాటు చేసుకుని సమ్మెను కొనసాగించారు. సీఐటీయూ అనుబంధ కార్మికులు 11 రోజులుగా, ఏఐటీయూసీ అనుబంధ కార్మికులు 3 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని కార్మిక సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ యూనియన్ నాయకులు మల్లె అంకయ్య, ఆదినారాయణ, వెంకటేష్, గుంజి కిషోర్, ఏఐటీయూసీ నాయకులు కొప్పర్తి నాగరాజు, వై.రాజేష్, ప్రభావతి, సీఐటీయూ అనుబంధ కార్మిక యూనియన్ నాయకులు తురక శీనయ్య, బిడదల మహేష్, క్రాంతి, బాబు, రమేష్, షానువాజ్, రాజేశ్వరి, అనిత, ఐసీటీయూ నాయకుడు వై.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ అనుబంధ కార్మికుల నిరసన

3వ రోజు మున్సిపల్ కార్మికుల దీక్షలు



నిరసనలో పారిశుధ్య కార్మికులు

కందుకూరు : కందుకూరులో మున్సిపల్ పారిశుధ్య కార్మికుల దీక్షలు 3వ రోజు శుక్రవారం కూడా కొనసాగాయి. స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నిరవధిక సమ్మెలో భాగంగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బి.సురేష్‌బాబు, వై.ఆనంద్‌మోహన్, పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు కె.రమణమ్మ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో జేసీ తనిఖీ



పౌష్టికాహారం కిట్లు అందచేస్తున్న జేసీ

బిట్రగుంట, జనవరి 5: బోగోలు రాజావీధిలోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్వాడీలు సమ్మె చేస్తుండటంతో రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో జరుగుతున్న పౌష్టికాహార పంపిణీని పరిశీలించారు. ఆయనవెంట తహసీల్దారు హేమంత్‌కుమార్, ఐసీడీఎస్ సీడీపీవో కోటేశ్వరి, ఇన్‌చార్జి సూపర్‌వైజర్ సుప్రజా, గ్రామ మహిళ పోలీసు పుష్పలత, వీఆర్వో కిరణ్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

'టీఆర్ఆర్' పూర్వ విద్యార్థికి సత్కారం

కందుకూరు: పోలీసు ఎస్ఐగా ఎన్నికైన టీఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల పూర్వవిద్యార్థి వలేటివారిపాలెం మండలం పోలినేనిపాలెంకు చెందిన ఎన్.ఏడుకొండలును కళాశాల ప్రిన్సిపాల్ కే.నాగేశ్వరరావు, అధ్యాపకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. పీడీ టి.సుబ్బారావు, అధ్యాపకులు మస్తాన్‌వలి, వెంకటేశ్వరరావు, కాశీరత్నం, ఉష, బాబూరావు పాల్గొన్నారు.

చంద్రబాబు సభకు తరలిన టీడీపీ శ్రేణులు

కందుకూరు, జనవరి 5: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు రా.. కదలిరా పేరుతో కనిగిరిలో నిర్వహించిన ఎన్నికల శంఖారావం సభకు శుక్రవారం కందుకూరు నియోజకవర్గం నుంచి ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నుంచి, నియోజకవర్గంలోని మండలాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరేందుకు నిర్ణయించుకున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉన్నం నళినీదేవి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తూ మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి తన అనుచరులతో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్, మాజీ ఎమ్మెల్యేలు పోతుల రామారావు, దివి శివరాంలు తమ అనుచరులతో కలిసి వేర్వేరుగా తరలివెళ్లారు.



కనిగిరికి బయలుదేరిన ఇంటూరి, టీడీపీ శ్రేణులు

దివ్యాంగులు, పేదలకు రగ్గుల పంపిణీ

బిట్రగుంట, జనవరి 5: బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప పోలీస్ స్టేషన్ ఆవరణలో శక్రవారం కావలి, బోగోలు పరిసర ప్రాంతాల్లోని దివ్యాంగులు, పేదలకు నెల్లూరుకు చెందిన ఎం.రాజేష్ జైన్ తన తండ్రి మన్‌మల్‌జైన్ జ్ఞాపకార్థం రగ్గులను పంపిణీ చేశారు. ప్రభుత్వ వైద్యుడు కే.చంద్రశేఖర్, హెచ్ఎం సీహెచ్.నాగరాజు, ఏఎస్సై సుధాకర్ రెడ్డి, దివ్యాంగుల నేత వెంకట్రావు, సీహెచ్.శ్రీనివాసులు, ఆయుష్ వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

పాతపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

బిట్రగుంట, జనవరి 5: బోగోలు మండలం సీఆర్‌పాలెం పంచాయతీ పాతపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఏపీ ఆప్కాబ్ చైర్మన్ కొండూరు. అనిల్‌బాబులు పాల్గొన్నారు. లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేశారు. పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల సుజాత, ఎంపీడీవో వెంకటసుబ్బారావు, మద్దిబోయిన కీర్తన, వైసీపీ నేతలు వీరరఘు, శ్రీనివాసులు, బీద.రమేష్ పాల్గొన్నారు.



బిట్రగుంట : పెన్షన్ అందచేస్తున్న బీద, రామిరెడ్డి

లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ

అల్లూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఆప్కాబ్ ఛైర్మన్ కొండూరు అనిల్‌బాబు, ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, జడ్పీటీసీ వేణమ్మ, ఎంపీడీఓ జ్యోతి, తహసీల్దారు చంద్రశేఖర్, జిల్లా నాయకులు నీలం సాయికుమార్, గుమ్మడి సురేంద, తదితరులు పాల్గొన్నారు.

గుడ్లూరులో...

గుడ్లూరు : గుడ్లూరు మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పులి రమేష్, డీఎల్‌డీవో పీ.పద్మజ, తహసీల్దారు సూర్యనారాయణ సింగ్, ఎంపీడీవో రాజశేఖర్, జడ్పీటీసీ బాపిరెడ్డి, సర్పంచు శంకర్ పాల్గొన్నారు.



పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి

రాములు కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు అందజేత

బిట్రగుంట, జనవరి 5: రైల్వే కీమన్ ఎస్.రాములు నవంబరు 5వ తేదీ అల్లూరు రోడ్డు-బిట్రగుంట రైల్వే స్టేషన్ల మధ్య విధులు నిర్వహిస్తు ప్రమాద వశాత్తు మృతి చెందాడు. ఆయన కుటుంబానికి విజయవాడ డివిజనల్ మజ్దూర్ యూనియన్ కార్యదర్శి లీలా శుక్రవారం బిట్రగుంట పీడబ్ల్యూఐ కార్యాలయంలో యూనియన్ తరుపున రూ.2 లక్షల చెక్కు అందచేశారు. ఈ కార్యక్రమంలో బిట్రగుంట బ్రాంచ్ అధ్యక్షుడు యుఎస్.బాబు, కార్యదర్శి నవీన్, యూనియన్ సభ్యులు, రైల్వే కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు విశేష పూజలు

అల్లూరు, జనవరి 5 : అల్లూరులోని ముగ్గురమ్మల తిరునాళ్ల అనంతరం బీసీ కాలనీలో వెలసి ఉన్న పోలేరమ్మ చెట్టు వద్ద మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఆ యన సతీమణి శివప్రియ దంపతులు శుక్రవారం రాత్రి విశేష పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి చీర, పసుపు, కుంకుమలను ఉంచి పొంగళ్లు పొంగించి నైవేద్యంగా ఉంచారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి సన్నిధిలో 300 మందికి పసుపు, కుంకుమ పంపిణీ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, యరటపల్లి శేఖర్‌రెడ్డి, పప్పు సుధాకర్, స్థానికులు బ్రహ్మనాయుడు, రవీంద్ర, కోటి, ఫాజిల్, శ్రీరాములు పాల్గొన్నారు.



పసుపు, కుంకుమ పంపిణీ చేస్తున్న శివప్రియ

25వ రోజుకు అంగన్వాడీల సమ్మె

కావలిటౌన్, జనవరి 5: సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు తలపెట్టిన సమ్మె శుక్రవారం 25 రోజులు పూర్తి చేసుకుంది. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదురుగా శిబిరంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అంగన్వాడీలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి కృష్ణమోహన్, సీపీఎం సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రఘురావమ్మ, వజ్రమ్మ, పెంచలమ్మ, సుభాషిణి, విజయలత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు